# తెలుగు పౌరుషం



సంకలనం

**తవ్వా ఓబుల్ రెడ్డి**

భాషోద్యమం

తెలుగు పౌరుషం

సంకలనం: తవ్వా ఓబుల్ రెడ్డి

# తెలుగు పౌరుషం

సంకలనం

తవ్వా ఓబుల్ రెడ్డి
ఉపాధ్యాయుడు, రచయిత

తెలుగు సమాజం
(తెలుగు సామాజిక సాంస్కృతిక సాహిత్యాభివృద్ధి సంస్థ)
ప్రభుత్వ గుర్తింపు సంఖ్య: 132/2009.
మైదుకూరు, కడప జిల్లా
2017

# తెలుగు పౌరుషం

*(2009లో మైదుకూరులోని సెయింట్ జోషఫ్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో తెలుగు భాషకు జరిగిన అవమానంపై వెల్లువెత్తిన ఉద్యమ విశేషాలకు, స్పందనలకు సంకలన రూపం)*

**హైదరాబాద్‌లో డిసెంబర్, 15-19, 2017లో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్న సందర్భంగా ప్రచురణ.**


సంకలనకర్త: **తవ్వా ఓబుల్ రెడ్డి**
Mobile: 9440024471



మొదటి ముద్రణ: నవంబర్, 2017 .
ప్రచురణ: **తెలుగు సమాజం, మైదుకూరు**
కాపీలు: **1000**

పుస్తక రూపకల్పన: **పి. నారాయణ,** మైదుకూరు. సెల్: 9542801803
ముద్రణ: **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.**

**కాపీలకు:**

**1.** **తవ్వా పార్వతి,**
ఇంటి నెంబరు. 13/478-1,
ఎల్.ఐ.సి.ఆఫీసువీధి, మైదుకూరు, కడప జిల్లా
సెల్: 9440024471

**2.** **పెన్నేటి పుస్తక విక్రయ కేంద్రం,** కడప
మొబైల్ : 7075351872

**3.** **విశాలాంధ్ర, నవోదయ, ప్రజాశక్తి,** పుస్తక విక్రయ కేంద్రాలు.

**పేజీలు: 104**

**వెల: రూ.100/-**

# విషయసూచిక

| | | |
|---|---|---|
| **"తెలుగుకు తిరుగులేదు"** | **డాక్టర్ నందిని సిధారెడ్డి** | I-II |
| **మైదుకూరు ఒక మేలుకొలుపు** | **డాక్టర్ సామల రమేష్‌బాబు** | III-IV |
| **అభినందన** | **"కళారత్న" పొట్లూరి హరికృష్ణ** | V |
| **ఆరోజు..!** | **తవ్వా ఓబుల్ రెడ్డి** | VI-IX |


## వ్యాసాలు

| | | |
|---|---|---|
| *'పరభాషలో నవ్వలేను..ఏడ్వలేను..'* | *ఎ.బి.కె.ప్రసాద్* | 1 |
| *మాతృభాషకు అవమానం...* | *హెబ్బార్ నాగేశ్వరరావు,* | 5 |
| *ఏమిటీ దుస్థితి... ఏమైనది తెలుగు ద్యుతి?* | *అక్కిరాజు రమాపతిరావు,* | 8 |
| *తెలుగు మాటకేదీ పలుకుబడి?* | *డాక్టర్ అద్దంకి శ్రీనివాస్* | 11 |
| *అమ్మ భాషను అవమానించడం నేరం!* | *సహజకవి మల్లెమాల* | 15 |
| *"తెలుగు తెలుస్తుంది.."* | *వీరాజీ* | 17 |
| *తెలుగు గళాలకు సంకెళ్లు* | *పడాల్* | 19 |
| *తెలుగు భాష-చారిత్రక సృష్టి* | *తెలకపల్లి రవి* | 22 |
| *ఆంధ్రజనసంఘం పునరుద్ధరించుకుందామా?* | *డా॥ దేవరాజుమహారాజు* | 25 |
| *మా తుఝే సలామ్* | *డా॥ దుగ్గిరాజు శ్రీనివాసరావు* | 28 |
| *అమ్మభాషకు ఆంగ్ల సంకెళ్ళు* | *టి.ఉదయవర్లు* | 31 |
| *అమ్మ భాష అంటే అంత అలుసా?* | *డా॥ రామకృష్ణ* | 35 |
| *మాతృభాషలో ప్రాథమిక విద్య* | *'పొద్దు'-అంతర్జాల పత్రిక* | 37 |
| *తెలుగు భాష మనది..తెలుగు యాస మనది...* | *డా.చుక్కారామయ్య* | 40 |
| *తెలుగుకు కావలసింది దండలు, దండకాలు కాదు..!* | *డా. సామల రమేష్‌బాబు* | 42 |


## సంపాదకీయాలు

| | |
|---|---|
| *ఏడాది గడిచినా విశిష్టత ఎక్కడ ?* | 46 |
| *తెలుగుకు అవమానం* | 49 |
| *మా టెల్గు టల్లికీ...* | 51 |
| *స్పందనలు - అభిప్రాయాలు* | 61 |
| *తెలుగు అంకెలను సమాధి చేస్తారా?* | 65 |
| *తెలుగుకు లేనిదేమిటి?* | 68 |
| *మైదుకూరు తెలుగు ఉద్యమం - ఛాయాచిత్ర మాలిక* | 70 |
| *తెలుగు చరిత్ర, శాసనాలు, సంస్కృతులపై తవ్వా ఓబుల్‌రెడ్డి పరిశోధనలు* | 82 |
| *పర్యటనలు* | 85 |
| *మైదుకూరు సంఘటనపై ప్రచురితమైన కొన్ని వార్తలు* | 86 |
| *సంకలన కర్త తవ్వా ఓబుల్‌రెడ్డి పరిచయం* | |

కవిత

## మైదుకూరు... మైదుకూరు! (తెలుగు జనంపాట)

తెలుగు పోరుదారిలోన మైలురాయి! వూరుపేరు?
మైదుకూరు, మైదుకూరు, మైదుకూరు, మైదుకూరు ॥తెలుగు॥

తెలుగు నుడిని దండించిన -సెయింట్‌జోసెఫ్ బడినెత్తిన
పెళపెళమని వురిమిందీ-పిడుగులాగ పడిందీ ॥తెలుగు॥

నెల్లూర్లై రాజుకుంది, బెజవాడై భగ్గుమంది
చెర్లలోన చెర్లాడీ.. శ్రీకాకుళం చిచ్చయినది
మీడియాకె మెలకువిచ్చి, మిసమిసలై పొంగిందీ ॥తెలుగు॥

అమ్మ అంటె కోపమా! నాన్నంటే నేరమా?
తల్లి పదం పెదింపైన మెదలటమే పాపమా?
అంటూ ప్రశ్నల వానై దబడ దిబడ కురిసిందీ
గడప, గడప, కడప గడప పెనుగాలై వీచిందీ ॥తెలుగు॥

తెలుగులోన మాట్లాడుట...ప్రజల జన్మహక్కందీ
తెలుగు 'నెవర్' స్పీకంటే- తిమ్మిరి తీస్తానందీ
అమ్మ అచ్చరానికింక-నారు, నీరు పోస్తనంది
ఆంగ్ల ఆధిపత్యానికి అడుగు మడుగులొత్తనంది ॥తెలుగు॥

రాయలు నడిచిన నేలిది...రాయలు పెంచిన సీమిది.
ఆటకైన, పాటకైన, దీటుకైన, పోటుకైన రాయలె మా సంకేతం
భాషపైన చెయ్యేస్తే గద్దె దద్దరిల్లునంది
'అ'-'ఆ' లపైన ఆన! ఆగడాలు సైపనంది ॥తెలుగు॥

(మార్చి 14: తెలుగు కళామండలి ఆవిర్భావం సందర్భంగా....)

**- వెలుగువెంకట సుబ్బారావు,** చీరాల.

**- నడుస్తున్న చరిత్ర మాసపత్రిక,**
మార్చి, 2010.

# "తెలుగుకు తిరుగులేదు"



**డా. నందిని సిధారెడ్డి**
*ఛైర్మెన్, తెలంగాణ సాహిత్య అకాడెమీ.*

భాష భావప్రసార సాధనం మాత్రమే కాదు, సంస్కృతికి పతాక. సమాచారమైనా , సమస్తజ్ఞానమైనా , అనుభవ సంపదైనా, అక్షరమక్షరం నిక్షిప్త పరిచి తర్వాతి తరాలకు అందచేసే మహాపేటిక . ఉత్పత్తిసమూహాలే భాషను సృష్టించి నిరంతరం అభివృద్ధి చేస్తుంటాయి. అవసరాలనుంచి ఉత్పత్తి అయిన భాష ఆనంద దు:ఖ భావోద్వేగాలను పంచుకుని మానవజీవన ప్రస్థానాన్ని మహత్తరంగా మలిచే శక్తిగా వికసించింది. అట్లాంటి ఏ భాషైనా దాని చరిత్ర, క్రమ పరిణామం , స్థిరపడిన స్థానం ఉత్తేజకరం! అయితే-ఒక భాష మీద మరొక భాష ఆధిపత్యం చేలాయించటం సామ్రాజ్య విస్తరణకు సంకేతం. యుద్ధంలో పైచేయి అయిన భాష, అధికార రాజకీయాలకు ఆధార భూమికగా మారిన భాష సహజంగానే ఆధిపత్యంకోసం ఆరాటపడుతుంది. ఇతర భాషల మీద దాడులకు పాల్పడుతుంది. సామ్రాజ్యవిస్తరణలో భాగంగా అడుగుపెట్టిన ఆంగ్ల భాష ఎన్నో స్వదేశ భాషలమీద సాంస్కృతిక దాడులను కొనసాగిస్తున్నది. అవటానికి భారతదేశంలో ప్రజాస్వామిక పాలనే అయినా, స్వతంత్ర పరిపాలనవలె భాసించినా విదేశీ సంస్కృతి, విదేశీ భాషల ఆధిపత్యం ఎడతెగకుండా కొనసాగుతున్నది.

ఆంగ్లేయుల పరిపాలన పోయినా ఆంగ్లభాషాధిపత్య దురహంకారం స్థానిక భాషలను పీడిస్తున్నదనడానికి మైదుకూరు సంఘటన సరయిన ఉదాహరణ. ఆరేడు దశాబ్దాల స్వపరిపాలన తర్వాత కూడా ఆంగ్లమాధ్యమ పాఠశాలలు వెల్లువెత్తటమే విషాదం. తల్లిభాష తెలుగులో మాట్లాడిన పైనానికి సెయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యార్థుల మెడల్లో బోర్డులు వేలాడతీయటం చెప్పరాని విషాదం . అట్లాటి దుర్ఘటన మీద క్షణాల్లో మాతృభాషా స్ఫూర్తితో

ఉద్యమించటం తెలుగు తనను తాను కాపాడుకోగలదని నిరూపించిన స్వాభిమాన ఘర్జన ! భాషగా ఆంగ్లభాష అన్నిభాషల వంటిదే. మిగతా భాషలకంటే ఏ పరిస్థితిలోనూ గొప్పదికాదు. ప్రపంచాన్ని చుట్టవలసిన సందర్భంలో అవసరం మేరకు ఆంగ్లం అధ్యయనం చేయవచ్చు. కానీ– ఇదే అదనుగా ఇతర భాషల మీద , అందునా స్థానిక తెలుగు భాష మీద దాడిని, అవమానపరచటాన్ని ఎవరూ సహించరు. ఎన్నో చారిత్రిక దాడులను ఎదుర్కొన్నా తట్టుకుని తెలుగుపేరును కాపాడుకుంటున్న జిల్లా "కడప" సహిస్తుందా? చైతన్య కెరటమై లేచింది. ఇవ్వాళటి రెండు తెలుగు రాష్ట్రాలకు, జిల్లాలకు ఉత్తేజమై నిలిచింది, "తెలుగు పౌరుషం" వ్యాసాల, సంపాదకీయాల, స్పందనల, చాయాచిత్రాల సంకలనం.

భాషోద్యమంలో క్రియాశీలంగా ముందడుగు వేస్తున్న తవ్వా ఓబుల్ రెడ్డి మైదుకూరు ఘటన నేపథ్యాన్ని తెలుగు ప్రేమికుల దృష్టికి తెస్తున్నాడు. మంచి ప్రయత్నం. పుస్తకంగా వచ్చినపుడు అనేకుల్ని అటువైపు ఉత్తేజితం చేస్తుంది. భాషోద్యమకారుల భావోద్వేగాలు ప్రకటించిన పత్రికల్లోంచి ఓబుల్ రెడ్డి ప్రయాసకోర్చి వీటిని కూర్చాడు. పనిలో ఉద్యమోత్సాహం ఉట్టిపడుతున్నది. తెలుగు పరిరక్షణకోసం కట్టుగా జట్టుగా కలిసి పనిచేయాలని " తెలుగు పౌరుషం" సంకల్పిస్తున్నది.

అక్షరాల్లో ఘోషించింది ఆచరణ రూపం పొందటానికి నిరంతర ప్రయత్నం అవసరం. రచయితలుగా, భాషాప్రేమికులుగా మనమెంత ఆరాటపడినా ప్రజాసమూహం కదలందే ఫలితం రాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాబలమే కీలకం. తెలుగు భాషా చైతన్యాన్ని ప్రచారం చేసి ప్రజలను సమీకరించగలగాలి. వ్యామోహంలో ఉన్న తల్లిదండ్రుల్ని, మోహంలో కొట్టుకుపోతున్న కొత్తతరాన్ని వాస్తవంలోకి తీసుకురావాలి. సాంస్కృతిక , జాతి భావోద్వేగాలను ప్రబలపర్చగలగాలి. " తెలుగు పౌరుషం" అందుకు తోడ్పడుతుందని నమ్ముతున్నాను. తవ్వా ఓబుల్ రెడ్డిని, తెలుగు సమాజం మిత్రుల్నీ అభినందిస్తున్నా ! తెలుగును ప్రజలు కాపాడుకుంటారు. తెలుగుకు తిరుగు లేదు!

హైదరాబాద్
అక్టోబర్ 25, 2017

# మైదుకూరు ఒక మేలుకొలుపు



**డాక్టర్ సామల రమేష్‌బాబు,**
(అధ్యక్షుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య)

కడప జిల్లా మైదుకూరులోని ఒక ఇంగ్లీషు మీడియం స్కూలులో తెలుగుకు జరిగిన అవమానాన్ని లోకానికి తెలియజేసిన జనమాధ్యమాలను ముందుగా అభినందిస్తున్నాను. తెలుగులో మాట్లాడినందుకు పిల్లల్ని రకరకాలుగా శిక్షించడం, జరిమానా విధించడం చాలా ఏళ్లుగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లోని ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో జరుగుతున్నదే. ఈ విషయమై గతంలో అప్పుడప్పుడూ చర్చ జరిగింది. శాసనసభలో కూడా ఒకసారి ఇలాంటి సందర్భం ప్రస్తావనకు రావడంతో, తగు చర్యలు తీసుకుంటామని విద్యామంత్రి హామీ ఇచ్చారు. కొన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలైతే 'ఈ ప్రాంగణంలో తెలుగులో మాట్లాడకూడదు' అనో 'ఆంగ్లంలోనే మాట్లాడుకోవాలి' అనే ప్రకటన పలకల్ని పెట్టేశాయి కూడా.

ఇలాంటి పరిస్థితిని 2005 మే 2న తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు నాటి పాఠశాల విద్యా శాఖామంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా అదే రోజు ఆమె ఒక ఉత్తర్వును పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు పంపించారు. అందులో ఇలా ఉంది : కొన్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలల యాజమాన్యాలు, స్కూలు ఆవరణంలో తెలుగులో మాట్లాడుకొనే బాల బాలికలను శిక్షించడమో లేదా జరిమానా విధించడమో చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పద్ధతి చట్ట వ్యతిరేకమే కాక మాతృభాషా వ్యాప్తికి ఆటంకం కలిగిస్తోంది. దీన్ని నివారించడానికి వీలుగా జిల్లా విద్యా శాఖాధికారులకు, వివిధ యాజమాన్యాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న పాఠశాలలకు తగు ఆదేశాలు జారీ చేయగలరు. ఇటువంటి తప్పు పునరావృతం కాకుండా అవసరమైతే అట్టి పాఠశాలల యాజమాన్యాలపై తగు చర్య తీసుకొనేందుకు వీలైన నిబంధనల్ని రూపొందించగలరు', మంత్రి సంతకంతో ఉన్న ఈ ఉత్తర్వు తర్వాత జరిగిందేమీ లేదు. అధికారులు ఈ విషయంలో పట్టుదలగా వ్యవహరించిన సందర్భాలు లేవు.

ఇప్పుడింతగా స్పందన రావడానికి కారణం తెలుగు భాషోద్యమ ప్రభావం ప్రజల మీద ప్రసరించడమే. **మైదుకూరు**లో భాషోద్యమ స్ఫూర్తితో రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి,

ధర్మిశెట్టిరమణ, అరబోలు వీరాస్వామి, వంటి రచయితలు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు పూనుకొన్న ఫలితంగా ప్రజలు ఉద్యమించారు. భాషోద్యమ పతాకాన్ని చేతపూని తెలుగు భాషోద్యమ సమాఖ్య రచయితల ద్వారా ఇది రాష్ట్ర వ్యాప్తంగా కదలిక తెచ్చింది. కొన్ని పత్రికల సంపాదకీయాలు రాశాయి. హైదరాబాద్‌లో తెలుగు భాషా చైతన్య సమితి వారు మానవహక్కుల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. అనేక జిల్లా కేంద్రాలనుంచి తెలుగు బాషోద్యమ సమాఖ్య శాఖలు, అనుబంధ సంస్థల సరసన ప్రదర్శనలు చేసి ఆయా జిల్లా కలెక్టర్లకు నిరసన పత్రాలు ఇచ్చాయి. **మైదుకూరు** లోని సెయింట్ జోసఫ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, రాష్ట్రంలో ఏ పాఠశాలలోను అవమానం జరుగకుండా ఉండేందుకు తగిన చర్యల్ని తేవాలనీ సమాఖ్య దాని అనుబంధ మిత్ర సంఘాలు డిమాండు చేశాయి. రానున్న శాసనసభలో ప్రభుత్వం ఇందుకు తగ్గ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఇంగ్లీషుమీడియం స్కూళ్ళలో తెలుగు మాట్లాడకూడదని శాసించే యాజమాన్యాలు 10వ తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు ను ఒక పాఠ్యాంశంగా బోధిస్తున్నాయా లేదా అనే విషయమై వెంటనే ప్రభుత్వం విచారణ జరపాలి. జీవోనెంబరు 86 ప్రకారం విధిగా తెలుగును ఒక సబ్జెక్టుగానైనా తెలుగును విధిగా నేర్చుకుంటున్నప్పుడు వాళ్ళను తెలుగులో మాట్లాడుకోవద్దనడంలో ఔచిత్యం ఏమిటి?

ఇంగ్లీషు మీడియంలో చదువుకోవాలా తెలుగు మాధ్యమంలో చదువుకోవాలా అనే విషయం ఇప్పుడిక్కడ చర్చనీయాంశం కాదు. ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరాన్ని తెలుగు ఉద్యమకారులెవ్వరూ కాదనడంలేదు. తల్లిభాషను బాగా నేర్చుకుంటే ఇతర భాషలను నేర్చుకోవడం చాలా తేలిక అవుతుంది. అంతేకాదు తెలుగు మాట్లాడకూడదంటే తల్లి భాష పట్ల గల జన్మహక్కును దూరం చేయడమే. ఇందుకు పాల్పడే సంస్థలు వ్యక్తులు, నేరానికి పాల్పడుతున్నారని తెలుసుకోవాలి. తల్లిభాషతోపాటు పిల్లల్లో పెంపొందే సృజనాత్మకతను అణచి వేయడం ద్వారా వారు పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారన్న మాట. జాతిని నిర్వీర్యపరిచే ప్రయత్నం చేస్తున్నారన్నమాట. ఐక్యరాజ్యసమితి ప్రపంచంలోని మాతృభాషలన్నిటిని కాపాడుకోవడం ద్వారా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాలని ఇచ్చిన పిలుపుకు వ్యతిరేకంగా చేస్తున్నారన్నమాట. అందువల్ల వెంటనే ప్రభుత్వం తెలుగు భాషను, తెలుగు జాతి గౌరవాన్ని కాపాడేందుకు కఠినచర్యలు తీసుకోవాలి. పటిష్ట చట్టాన్ని తేవాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. **మైదుకూరు**లో రాజుకున్న తెలుగు భాషోద్యమ రవ్వలు ఇప్పుడు రాష్ట్రమంతటా రగులుతున్నాయి. ఎవరికి వారుగా ఉద్యమించి అనేక రూపాల్లో తమ నిరసన తెలియజేస్తున్నారు. తెలుగులో మాట్లాడడం నా జన్మహక్కు అని నినదిస్తున్నారు. ఈ నినాదం ఇంతవరకు తెలుగు భాష విషయంలో పట్టనితనంతో ఉన్న రాజకీయ పార్టీలను, ప్రభుత్వాధికారులను పట్టి కుదిపే దశకు దారితీస్తుంది.

**–ఆంధ్రజ్యోతి దినపత్రిక,**
నవంబరు–6,2009.

# "అభినందన"



**"కళారత్న" పొట్లూరి హరికృష్ణ**
**జాతీయ అధ్యక్షులు, తెలుగు రక్షణ వేదిక**
**అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు**

*రాయలసీమలో నాటి స్వాతంత్రం నుండి నేటి స్వాభిమానం వరకు పోరాటానికి, ప్రశ్నించడానికి పోటీ పడుతుంటారు.. ఆ రెండింటిలోనూ ప్రతిభాసంపత్తిని కనపరుస్తున్న సృజనశీలురు, మహానుభావులు ఎందరో వున్నారు. వారందరికీ వందనాలు..*

*తెలుగు భాషోద్యమంలో గత రెండు దశాబ్దాలుగా.. ఎక్కడ వున్నా, ఏమి చేస్తావున్నా, సంకల్పితంగా, అసంకల్పితంగా, తెలుగు భాష – జాతి గురించి ఆలోచించే కలం–గళమే తవ్వా ఓబుల్ రెడ్డి. వీరి స్ఫూర్తే యువ/నవకుల మీద ఎనలేని ప్రభావం చూపింది..*

*చరిత్రలో ఘటనలెన్నో – ఘటనలే చరిత్రగా మార్చిన "మైదుకూరు" సంఘటన సరికొత్త భాషోద్యమానికి ఊపిరి పోసింది.. కలాలు కొట్లాడాయి.. గళాల గర్జించాయి.. సంపాదకీయాలు స్పందించాయి.. కవితలకు,వ్యాసాలకు, వాదానికి, నినాదానికి నాంది పలికిన ప్రస్థానం.. అక్షరీకృతమై తవ్వా సంపాదకత్వంలో "తెలుగు పౌరుషం" మరో చరిత్రకు స్వాగతం పలుకుతుంది..*

*తెలుగు భాషకోసం.. రాయలసీమ జాగృతికి కోసం తపిస్తున్న మా..తవ్వాకి రెండు దశాబ్దాల సాక్షిగా అభినందనలు..!*

**విజయవాడ,**
**01 నవంబర్, 2017.**

# ఆరోజు..!



**తవ్వా ఓబుల్ రెడ్డి**
*వ్యవస్థాపక అధ్యక్షుడు, **తెలుగు సమాజం,** మైదుకూరు.*

ఆరోజు అక్టోబరు 26, 2009. కడప జిల్లా మైదుకూరులోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఖాసిమ్ కాంప్లెక్స్‌లోని మెడిల్యాబ్ లో రోజూ లాగే నాతోపాటు మా 'తెలుగు సాహితీ సాంస్కృతిక వేదిక' సభ్యులైన యస్. సాదక్, ఎ. వీరాస్వామి, ధర్మిశెట్టి రమణ, ముండ్లపాటి వెంకట సుబ్బయ్య సాహిత్య, సంగీత చర్చల్లో మునిగి ఉన్నాము. అక్కడికి పాలగిరి ఇంద్రసేనారెడ్డి అనే వ్యక్తి వచ్చాడు. సెయింట్ జోసఫ్‌స్కూల్‌లో తెలుగులో మాట్లాడిన 3వ తరగతి విద్యార్థులు దేవీసాహితీ, మహేంద్ర మెడలకు 'ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు' అనే అట్ట ఫలకాలను వేసి, వారిని తరగతి గదిలో నిలబెట్టి శిక్షించారని చెప్పారు. ఈ వార్త విన్న మేము అవాక్కయ్యాము. వెంటనే పాఠశాల వద్దకు వెళ్లి నిజనిర్ధారణ చేసుకొని సంఘటనను ఖండిస్తూ పత్రికా ప్రకటన ఇచ్చేందుకు నిర్ణయించుకున్నాం. ఈ దారుణానికి పాల్పడిన పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ అప్పటికప్పుడే పత్రికాప్రకటన ఇచ్చాం. మాతృభాషకు జరిగిన అవమానానికి నిరసనగా మరుసటి ఉదయం ఒక ప్రదర్శన చేయాలని నిర్ణయించాం. ఈ సంఘటనపై రాత్రి అన్నింటిని ఛానళ్ళలో ప్రసారమైన విద్యార్థుల ఫోటో దృశ్యాలు, మమ్ములను చాలా కలవరపెట్టాయి.

తెల్లవారింది 5 గంటల సమయంలో కూడా ఈ సంఘటనపై ఛానళ్ళ లో వార్తలు వస్తూనే ఉన్నాయి. మిత్రులు అరబోలు వీరాస్వామికి, ధర్మిశెట్టి రమణలకు ఫోన్ చేశాను. బస్టాండు దగ్గర ఉన్న టీస్టాల్ వద్దకు రమ్మన్నాను. వాళ్లు వచ్చారు. పత్రికల్లో ప్రచురించిన వార్తను, మేమిచ్చిన ప్రకటనను చదివాం. నిరసన ప్రదర్శన గురించిన ప్రణాళికను రూపొందించుకున్నాము. ఆందోళనకు కావలసిన సామాగ్రి సేకరించేందుకు పూనుకున్నాము. సంస్థ ప్రతినిధులు యస్.సాదక్, ధర్మిశెట్టి రమణ, బాబయ్య లతో పాటు రైతు నాయకుడు డి.యన్. నారాయణ, బి.సి. సంఘం నాయకుడు సందిళ్ళ బాలసుబ్బయ్యలకు ఫోన్ చేసి వెంటనే రావాలని చెప్పాము. తెలుగు భాషా పరిరక్షణ నినాదాలను రాసేందుకు అట్టముక్కల కోసం సాయిబాబా కాంప్లెక్సుకు పోయాం. బట్టలషాపు యజమాని మాకు కావలసిన

అట్టముక్కలు ఇచ్చారు. బ్యానరు కోసం గుడ్డ కూడా తీసుకున్నాం. బ్యానరును ఎన్.బి.కె టైలర్ భూమాయపల్లె వెంకటసుబ్బయ్య కుట్టించి ఇచ్చినాడు. చిత్రకారుడు సింగంశెట్టి రామకృష్ణ గుడ్డ బ్యానరుపై కార్యక్రమ వివరాలను, నినాదాలను రాసిచ్చాడు. నడుస్తున్న చరిత్ర పత్రిక స్ఫూర్తితో తెలుగు పతాకాన్ని స్వయంగా అప్పటికప్పుడే రూపొందించాము. సంస్థ కార్యాలయము నుండి పాఠశాల వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వెళ్ళాము. మా సంస్థ సభ్యులతో పాలు ఎస్.టి.యు.నాయకులు ఎ.పి.శ్రీనివాసులు, మల్లేశ్వరరెడ్డి, పాలకొండయ్య, ఎ.పి.టి.ఎఫ్ నాయకులు సి.వి.ప్రసాద్, వెంకటసుబ్బయ్య, బి.జే.పి. నాయకులు బి.పి.వెంకటప్రతాప్, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, జి.సి గురప్ప, పుల్లయ్య , అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి, పూల సుబ్బరాయుడు, ఎస్.రామసుబ్బారెడ్డి, అన్నపరెడ్డి శేఖర్‌రెడ్డి, విద్యార్థి నాయకులు మద్దిలేటి చిట్టిబాబు, ఖాజావలి, యూత్‌ఫెడరేషన్ నాయకులు రమణ, శ్రీరాములు, రహమతుల్లా, యోహాన్, శంకర్, మైదుకూరు రైతు సేవాసంఘం నాయకుడు డి.యన్.నారాయణ, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కుళ్ళాయిరెడ్డి, యల్లంపల్లె మిత్రుడు యస్. వెంకటేశ్వరనాయుడు ప్రదర్శనలో పాల్గొన్నారు విలేకర్లకు సమాచారం అందజేశాం. జిల్లా కేంద్రంనుంచి వచ్చిన ఎస్.ఎఫ్.ఐ విద్యార్థి నాయకుడు శ్రీనివాసులు,సుబ్బరాయుడు,కొండయ్య, ఓబులేసు, పి.నరసింహులు లతో అందరమూ సెయింట్ జోషఫ్ ఆంగ్లమాధ్యమ పాఠశాల వద్దకు చేరుకున్నాం. బ్యానర్లు పట్టుకుని, నల్లబ్యాడ్జీ ధరించి తెలుగు పతాకాలను చేతబూని పాఠశాల ముఖద్వారం వద్ద బైఠాయించాం. పెద్ద పెట్టున నినాదాలను చేయడం ప్రారంభించాము.

కొంత సేపటికి సాహిత్య మిత్రులు, భాషాభిమానులు, కళాకారులు, విద్యావంతులు అనేకమంది అక్కడికి చేరుకున్నారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, యాజమాన్యముపై చర్య తీసుకొని కేసు పెట్టాలని నినదిస్తూనే ఉన్నాం. మంత్రి మాణిక్య వరప్రసాద్ , ఆర్డీఓ మన్మథరెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు విచారణ అధికారిగా వచ్చిన ఉప విద్యాశాఖాధికారి సుబ్బారెడ్డిగారు పాఠశాల వద్దకు చేరుకుని కరస్పాండెంట్ యన్.ప్రభాకర్‌ను విచారించడం ప్రారంభించారు. వెంటనే అధికారి బయటికి రావాలని నినాదాలు చేసినాము. ముందుగా భాషోద్యమకారులమైన మా పిర్యాదును తీసుకోవాలని నినాదాలు చేశాము. దీనితో ఆందోళన చేస్తున్న మావద్దకు విచారణాధికారి సుబ్బారెడ్డి, మండల విద్యాశాఖాధికారి సుకవనం, డి.ఎస్.పితో కలిసి వచ్చారు. ఈ సంఘటనపై బహిరంగ విచారణ జరపాలని, ముందుగా పాఠశాల యాజమాన్యంపై కేసు పెట్టి అరెస్టు చేయాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని పట్టుబట్టాము. విచారణ చేయడం వరకే తన పని అనీ, ప్రభుత్వం చర్చలను తీసుకుంటుందని విచారణాధికారి చెప్పారు. మా వాదనను విని పిర్యాదును నమోదు చేసుకున్నారు. .అప్పటికే పోలీసు సిబ్బంది కూడా అధిక సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఈ లోగా పట్టణంలోని అన్ని పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ జరుపుతూ ఆందోళనా ప్రదేశానికి చేరుకున్నారు. అప్పటికే అన్ని ఎలక్ట్రానిక్ మీడియా మరియు ప్రింట్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకున్నారు. కొన్ని ఛానెళ్లు మా ఆందోళన దృశ్యాలను

ప్రత్యక్ష ప్రసారం చేయడం ప్రారంభించాయి. పరిస్థితి ఉత్కంఠంగా మారింది. సమాచారం అందిన ప్రజలు అనేకమంది ఆందోళనకు చేయి కలిపారు. చాలా సేపటి తర్వాత విచారణాధికారి, మండల విద్యాశాఖాధికారి పోలీసులను వెంటబెట్టుకొని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ యన్.ప్రభాకర్‌ను ఆందోళనా శిబిరం దగ్గరకు తీసుకువచ్చారు. పిల్లలపై అలాంటి చర్య తీసుకోవడం తప్పని, జరిగినదానికి బాధపడుతున్నానని, తాను నిన్నటి దినం ఊర్లోలేననీ, పిల్లల మెడలకు అట్టలను వేళాడదీసిన విషయం తనకు తెలియదనీ, తెలుగంటే తనకు ప్రేమ అనీ, తాను కూడా తెలుగు సాహిత్యం చదివాననీ చెప్పుకొచ్చారు. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు చేసింది తప్పేననీ..కాబట్టి చేసిన తప్పుకు క్షమించమని పశ్చాత్తాపపడుతున్నట్టుగా చెప్పారు. దీనికి మేము స్పందిస్తూ తెలుగులో మాట్లాడిన విద్యార్థులను పాఠశాలలో రోజూ శిక్షిస్తున్న విషయం కూడా తెలిసిందనీ, నిజాన్ని దాచిపెట్టవద్దనీ గట్టిగా నిలదీశాము. తల్లిదండ్రుల, ఆందోళనకారుల ప్రశ్నలతో దిక్కుతోచని కరస్పాండెంట్ తిరిగి తన కార్యాలయానికి వెళ్లిపోయినారు. సంఘటనపై బహిరంగ విచారణ జరపాలనీ, పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలనీ, యాజమాన్యాన్ని అరెస్టు చేయాలనీ మళ్లీ పెద్ద పెట్టున నినాదాలు చేయడం ప్రారంభించాం. పాఠశాల వద్ద జనం అధిక సంఖ్యలో గుమికూడుతున్నారు.

ఆందోళన తీవ్రరూపం దాల్చింది. బహిరంగ విచారణ చేస్తే నిజాలు బయటికొస్తాయని భయపడిన యాజమాన్యం తరగతి గదిలోని పిల్లలతో అబద్ధం చెప్పించే ప్రయత్నాన్ని ప్రారంభించారు. తమ ఉపాధ్యాయులను తరగతి గదుల్లోకి పంపి పిల్లలచేత తమకు అనుకూలంగా చెప్పించుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. ఈ సంగతి తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులకు పోటీగా పాత్రికేయులు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల అభిప్రాయాలను సేకరించడం మొదలు పెట్టారు. ఈ పరిణామంతో యాజమాన్య సిబ్బంది పాత్రికేయులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. పాఠశాల సిబ్బంది వైఖరిని మీడియా ప్రతినిధులు తీవ్రంగా నిరసించి ఈ విషయాన్ని సి.ఐ.శ్రీనివాసులు దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థులు ఉద్యమకారులు కోపోద్రేకులైనారు. ఉద్యమ నాయకులను, పోలీసులు శాంతింపచేసినారు. మిషనరీ, ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో జరుగుతున్న తెలుగు వ్యతిరేక చర్యలకు చరమగీతం పాడతామనీ, సరికొత్తగా తెలుగుభాషా పునాదులను నిర్మిస్తామని నినాదాలు చేయడం ప్రారంభించాము. మరి కొంతసేపటికి పోలీసు అధికారులు ఆందోళనా శిబిరం వద్దకు వచ్చి జరిగిన సంఘటనపై పిర్యాదు రాసి ఇస్తే మేము చర్యలు తీసుకుంటామన్నారు. పిర్యాదును రాసి పోలీసులకు ఇచ్చాము. తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కమిటి అధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు ద్వారా ఈ సంఘటన గురించి తెలుసుకున్న తెలుగుభాషా వికాస ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి జె.ఎస్.ఆర్.కె శర్మ, కర్నూలు జిల్లా కార్యదర్శి కాకర్ల రాముడు కర్నూలు నుండి మైదుకూరికి వచ్చారు. సాయంత్రం స్థానిక కోదండరామాలయంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశాం. ఇటువంటి దుశ్చర్యలకు

పాల్పడుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రత్యేక జీ.వో. విడుదల చేయాలని పత్రికా సమావేశం ద్వారా ప్రభుత్వాన్ని కోరాం.

కడపకు వెళ్లి జె.ఎస్.ఆర్.కె.శర్మ , కాకర్లరాముడు, అరబోలు వీరాస్వామి, ధర్మిశెట్టి రమణ, బి.జె.పి నాయకులు బి.పి. వెంకటప్రతాప్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి లతో కలిసి ఆ రాత్రి 10 గంటలకు జిల్లా కలెక్టర్ శశిభూషణ్ కుమార్ గారిని కలిశాము. మా ఫిర్యాదును కలెక్టరుకు ఇచ్చాం.

తర్వాత 29వ తేదీ ఉదయం సెయింట్ జోసఫ్ పాఠశాల దుశ్చర్యలపై నిరసించిన ఉపాధ్యాయులు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎం.ఆర్.సి కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ నిరసన ప్రదర్శన జరిగింది. అక్కడ ఉన్న కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి తెలుగుభాషా ఔన్నత్యాన్ని గురించి మాట్లాడినాము. దేశభాషలయందు తెలుగులెస్స అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసినాము. ఈ ప్రదర్శనలో మా సంస్థ ప్రతినిధులు వీరాస్వామి, ధర్మిశెట్టి రమణ, ఉపాధ్యాయ నాయకులు పాలకొండయ్య, జి.ఆర్.మల్లేశ్వరరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, అంకన్న, వెంకటసుబ్బయ్య, బి.జె.పి నాయకుడు ముద్దం సుబ్బరామయ్య, అనేక మంది మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అప్పటికే చాలా కాలంగా 'నడుస్తున్న చరిత్ర' పత్రిక ద్వారా తెలుగు భాషోద్యమం పై అవగాహన పెంచుకుని ఉన్న మేము ఈ సంఘటన తర్వాత తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సామల రమేశ్‌బాబు గారి ఆహ్వానం మేరకు సమాఖ్యలో ప్రాతినిధ్యం పొంది తెలుగు ఉద్యమంలో మావంతు బాధ్యతల్ని పంచుకుంటూ వస్తున్నాం. ఈ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, ఉపాధ్యాయ నాయకులకు, ఉపాధ్యాయులకు, ఉద్యమానికి ఊపిరి పోసిన పత్రికా విలేకర్లకు, ఛానళ్ళ ప్రతినిధులకు భాషాభిమానులకు, సాహిత్య మిత్రులకు, కళాకారులకు సామాన్య ప్రజలకు మా సంస్థ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

**–తవ్వా ఓబుల్ రెడ్డి**

# వ్యాసాలు

# ‘పరభాషలో నవ్వలేను..ఏడ్వలేను’

- ఎ.బి.కె .ప్రసాద్

ఆమధ్య కొలది మాసాల క్రితం లండన్‌నుంచి వెలువడే ‘ది సన్’ అనే పత్రిక బ్రిటీష్ కౌన్సిల్ వారు మాతృభాషల గురించి జరిపిన ఒక సర్వేక్షణ వివరాలను ప్రచురించింది. విదేశాల్లో ఉన్న ఆంగ్లభాషా ప్రియులు 40వేల మందిని ఆంగ్లభాషలో మీకు నచ్చిన అందమైన పదం ఏమిటో చెప్పండని ఆ సర్వేలో బ్రిటీష్ కౌన్సిల్ కోరింది. అత్యధిక సంఖ్యాకులు అత్యంత ప్రియమైన అందమైన పదం మదర్ (అమ్మ/తల్లి) అని పేర్కొన్నారు.

తల్లి కడుపునుంచి భూమ్మీద పడిన మరుక్షణం నుంచి తన ఉనికిని చాటుకునేందుకు ఉగ్గుతో పాటు అమ్మా అని పిలవడానికి శిశువులు తపనపడతారు. అదే తల్లి భాష/ మాతృభాష! అలాగే అసలు భాష పుట్టుకురావడానికి, దూసుకుపోవడానికి మూలం ఎక్కడుందో ప్రపంచ ప్రసిద్ధ ఫ్లోరిడా విశ్వవిద్యాలయ మానుష శాస్త్రవేత్త ప్రొఫెసర్ డీన్‌ఫాక్ చెప్పాడు. తల్లి తన పసిబిడ్డతో గోముగా ముద్దుముద్దుగా లాలనతో చేసే సంభాషణే భాష ఆవిర్భావానికి, భావివికాసానికి మూలం అన్నాడాయన. దాని ఆయన ‘బేబీ టాక్’ అని పేరు పెట్టారు. పసివాడితో సాగించే ఈ భాషణకు ఆయన ‘మదరెని’ అని పేరుపెట్టాడు! ఇది ఇప్పుడెందుకు చెప్పవలసి వచ్చిందంటే –వర్ధమాన దేశాల మార్కెట్లను తమ సరుకులును సంతలుగా మార్చుకొని, వర్ధమాన దేశాల వస్తూత్పత్తులను దెబ్బ తీసేందుకు, ఒక సాధనంగా సమాచార సాంకేతిక వ్యవస్థలో భాగంగా ఇంగ్లీషు బాషనే వ్యాపార ప్రయోజనాలతోపాటు ప్రపంచీకరించాలన్న నిర్ణయాన్ని అమెరికా ప్రపంచబ్యాంకు ఐఎంఎఫ్ , ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) లను ఆదేశించి ఉంది గనుక! ఈదేశం వల్ల ప్రపంచంలోని మాతృభాషలకు/ స్థానిక భాషలకు/ ప్రాంతీయభాషలకు రానున్న ప్రమాదాన్ని ఐక్యరాజ్యసమితి, విధాన సాంస్కృతిక విభాగం (యునెస్కో) గుర్తించింది. సుమారు 300 సంవత్సరాలపాటు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలపై సాగిన ఆంగ్ల సామ్రాజ్య వలస విధానం వల్ల దెబ్బతిన్న దేశాలు మాతృభాషలపై ప్రపంచీకరణ పేరిట సాగనున్న సరికొత్త భాషా దురాక్రమణ గురించి 1999లోనే యునెస్కో హెచ్చరించింది. మన దేశంలో కూడా దాని ప్రభావంవల్ల ఇంతకు ముందే మాతృభాషల అభివృద్ధిని పణంగా పెట్టి శృతిమించిన రాగంలా పరభాషావ్యామోహం కొనసాగుతూ వస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం1966 లోనే సచివాలయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు తెలుగులోనే పాలనా వ్యవహారాలన్ని సజావుగా సాగాలని ఆదేశించి 40 సంవత్సరాలు కావస్తున్నా పరిస్థితి ఎదుగూ బొదుగూ లేకుండా ఉందని ఉద్యోగవర్గాలు సహా అందరూ అభిప్రాయ పడుతున్నారు. భాషలు నేర్వడానికి, మాతృభాషలో విద్యాబోధన సాగడానికి మధ్య తేడాను గుర్తించని దౌర్భాగ్యపు దశలో మనం ఉన్నాం. సర్వత్రా ప్రైవేటీకరణ మైకంలో

ప్రపంచ బ్యాంకు చేస్తున్న పని పాలనారంగంలో ప్రభుత్వం పాత్రను నిర్వీర్యం చేసి, విద్యా వ్యవస్థలో కూడా ప్రైవేటీకరణను సుసాధ్యం చేసిపెట్టే, సానుకూలపరిచే బ్రోకర్ పాత్రగామార్చడం. దీనికే 'ఫెసిలిటేటర్ 'అనే ముద్దు పేరు తగిలించారు. ఈ దశలో తామరతంపరగా ప్రైవేటు విద్యాసంస్థలు ప్రాథమిక దశనుంచి ఉన్నత స్థాయి వరకూ, ఎల్‌కేజీ నుంచి పట్టభద్రానంతరం దశ వరకూ ఇంగ్లీషును బోధనా భాషగా రుద్దుతున్నాయి. చివరికి, ప్రాథమిక విద్యాదశ నుంచి పదవతరగతి వరకు తెలుగు బోధనాభాషగా ప్రభుత్వ పాఠశాలో కొనసాగుతున్నందుకు సంతోషిస్తున్న స్థితిలో ప్రభుత్వ పాఠశాలలో కూడా ఈ ఏడాదినుంచి ఒకటి -రెండు తరగతులలో ఇంగ్లీషును బోధనా భాషగా రుద్దాలని నిర్ణయించారని వార్తలు. ఇది మాతృభాషగా తెలుగును అవమానించడమే కాకుండా మాతృభాషలో విద్యాబోధన, మాతృభాషలో పరీక్షల నిర్వహణ విధిగా జరగాలన్న 1925 నాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం తీర్మాణానికి, మాతృభాషలో పరిపాలన, మాతృభాషలో విద్యావకాశం పొందే లక్ష్యంతో ప్రారంభమైన భాషా రాష్ట్రాల ఉద్యమ స్ఫూర్తికి పరమ విరుద్ధమని, గుర్తించాలి.

ఇటీవల విశాఖనుంచి వెలువడిన వార్తల ప్రకారం, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఒకటి రెండు తరగతుల్లో ఇంగ్లీషు మాధ్యమంలోనే పాఠాలను నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఉపాధ్యాయులు నిరసించారు. అధికారులకు ఉన్నట్లుండి పేద ప్రజల బిడ్డలమీద ప్రేమ పుట్టుకొచ్చినట్లుంది. ఉద్యోగాల కోసం సాగే వేటలో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంగ్లీషు విద్య లేక వెనుకబడిపోతున్నారట!

ఒక వైపున సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా, కులవ్యవస్థలో భాగంగా అనేక సౌకర్యాలకు దూరమై ప్రాథమిక, మాధ్యమిక విద్యాదశల్లోనే చదువులు చాలించుకోవలసిన దుర్గతితో కొట్టుమిట్టాడుతున్న దశలో పేద కుటుంబాలున్నాయన్నది నగ్నసత్యం కానీ, తెలుగును బోధనాభాషగా రెండు తరగతుల నుంచి ఉపసంహరించే పక్షంలో ఈ పాఠశాలకు ప్రభుత్వ గ్రాంట్ ఎలా లభిస్తుంది? ఇంగ్లీషు బోధనా భాషగా పాఠ్యప్రణాళికను అమలు జరుపగల సామర్థ్యమున్న ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు? ఈ తప్పుడు ప్రయోగమంతా యునెస్కో హెచ్చరించినట్లు మాతృభాషల ఉనికిని క్రమంగా దెబ్బతీయడం ద్వారా, వర్ధమాన దేశాల మార్కెట్లపై పూర్తి పెత్తనం సాగించే ప్రయత్నంలో వలసవాదులు, బహుళజాతి వాణిజ్య గుత్త సంస్థలూ ఇంగ్లీషును భాషా దురాక్రమణకు ఒక సాధనంగా మార్చుకోవడానికి వస్తున్న ప్రయోగమేనని మరచిపోరాదు.

ఇంగ్లీషు సహా, ఎవరైనా ఎన్ని భాషలనైనా నేర్చుకోవచ్చు. అందుకు ప్రభుత్వాలు అవకాశాలు కల్పించడం వేరు! కానీ బోధనాభాషలుగా మాతృభాషల స్థానాన్ని తోసిరాజే స్థాయికి, పరభాషా వ్యాప్తిని అనుమతించరాదు. శాస్త్ర, సాంకేతికరంగాల పురోభివృద్ధికి ఇంగ్లీషు తప్పనిసరి అనే వాదనను (ఒక భాషగా నేర్చుకోవడంగాక) జర్మనీ, జపాన్,

రష్యా, చైనాలు తప్పుని నిరూపించాయి. అవి తమ మాతృభాషలలోనే బోధనను, శాస్త్ర సాంకేతిక విద్యా వ్యాప్తిని ప్రశంసనీయంగా చేసుకున్నాయి. అన్యభాషా పదాలను, అలవాటుగా రూఢమైన పరభాషా పదాలను తనలో ఇముడ్చుకుంటూనే స్వయంప్రకాశం పొందాయి. ఒక తెలుగు భాషా పండితుడు స్పష్టం చేసినట్లుగా పాలకుల పరాయి భాష వాడడం వల్ల పరిపాలన సౌలభ్యం కోసం పరభాషా పదాలు కలిసాయని కొందరనుకుంటారు. కాని వందల సంవత్సరాల పరభాషా పాలకుల పరిపాలనలోకంటే, మనం స్వతంత్ర భారత పౌరులమైన తరువాత యాభై సంవత్సరాలలో కలసిన పరభాషా పదాలు వందల రెట్లు ఉన్నాయి అనడం అతిశయోక్తి కాదు. నిజానికి ఈ పరిణామం పాఠకులుగాని, వీక్షకులుగాని కోరుకున్నది కాదు. ఈ పని, అధికారుల, రచయితల పరభాషా వ్యామోహం! మన పెద్దలంతా ఇప్పటికి 70వ పడిలో పడిన వాళ్ళంతా ప్రాథమిక దశనుంచి హైస్కూలు స్థాయి వరకూ తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసిన వాళ్ళేనని మరచిపోరాదు. ఒక దశలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యను ఉర్దూ మాధ్యమంలోనే సగర్వంగా, పూర్తి చేసి ప్రతిభావంతులుగా రాణించలేదూ? అందాకా ఎందుకు– చివరికి హిందీభాషా ప్రాంతాల్లో (ఉత్తరాదిన) ప్రాథమిక దశనుంచి ఉన్నత విద్య దాకా మాతృభాషలోనే విద్యాబోధన ఎలా సాధ్యం అవుతోంది? సమాధానం రాదు.

## మాతృభాషకే అన్యాయం

త్రిభాషా సూత్రం పేరిట మాతృభాషలకే అన్యాయం జరుగుతోంది. ఈ సూత్రం ద్వారా హిందీయేతర మాతృభాషలను కనీసం ఒక్కదాన్ని కూడా హిందీ ప్రాంతాల్లో ప్రోత్సహించడంలేదని గమనించాలి. దీనికి తోడు ఇప్పుడు గ్లోబలైజేషన్ పేరిట మాతృభాషలపైన ఇంగ్లీషు నయావలస సాంస్కృతిక దురాక్రమణకు తలుపులు తెరవడం! ఇక్కడ కార్పొరేట్ (ప్రైవేట్) కళాశాలల్లో తెలుగుబోధనలేదు! త్రిభాషా సూత్రం కూడా ఎగిరిపోయి మధ్యలో ఇక్కడి సంస్కృతాన్ని మార్చేశారు. బహుశా ఈ చౌరబాటును బుద్ధిపూర్వకంగానే హిందీపండితులు, తెలుగు భాషా వ్యాప్తి రుచించని కొందరు సంస్కృత పండితులు ప్రోత్సహించి ఉండాలి!

దేశంలో హిందీ మాట్లాడే జనాభా తర్వాత రెండవ పెద్ద భాషగా తెలుగు మాట్లాడే వారి సంఖ్య (16 కోట్లమంది) ఎక్కువ! ఈ త్రిభాషా సూత్రం బాధపడలేకనే ఇరుగుపొరుగైన తమిళులు, కన్నడిగులు, మలయాళీలూ పాలనాభాషలుగా, బోధనభాషలుగా మాతృభాషలను అల్లారు ముద్దుగా పెంచి, పోషించుకుంటున్నారు. స్వభాషాభిమానం దురభిమానంగా మారనంతవరకూ అన్యభాషల పట్ల ద్వేషం ఎవరికీ ఉండనక్కర్లేదు. భాష అనేది భావ ప్రకటనకు అనుకూలమైన వాహిక కాబట్టి భాషల అభివృద్ధిని కాంక్షిస్తాం. ప్రోత్సహిస్తాం తనకు మాలిన ధర్మం, మొదలు చెడిన బేరంగా ఉండకూడదన్నదే ఇక్కడి నీతి, బహుశా ఈ నీతిని మనకన్నా ఒక దశలో కొందరు పరాయిపాలకులే పాటించారేమో! ఉదాహరణకు

లార్డ్ మెకాలే. ఇంగ్లీషు భాష ద్వారా చాకిరీకి తాకట్టుగా మార్చిన విద్యావస్థను మధ్యలో కొంతకాలం అడ్డుకొని భారతదేశంలో స్థానిక/ మాతృభాషలు అభివృద్ధి కానంతకాలం ఆంగ్లభాషవైపు ఆకర్షణ పెరగదని ఈస్టిండియా కంపెనీ ఉన్నతోద్యోగిగా హ్యూటన్ హడ్సన్ తెగేసి చెప్పాడు. ఆంగ్లేయులకు, భారతీయులకు మధ్య కేవలం దుబాసీలుగా వ్యవహరించే ఒక వర్గం తయారయ్యేందుకు మనం చేయవలసినదంతా చేయాలి. రక్తంలో,రంగులో మాత్రం భారతీయుడై ఉంటూ, రుచులతో, భావాల్లో తెలివిలో ఇంగ్లీషు వాళ్ళలా వ్యవహరించే వాళ్ళుగా ఉండాలని మెకాలే కోరుకున్నాడు. బహుశా అధికార భాషలుగా మాతృభాషలను నిర్ద్వందంగా అమలు పరచడానికి మోకాలడ్డుతున్న వాళ్ళు, కొందరు అధికారులు, మెకాలే వేలు విడిచిన వర్గమే అయిఉండాలి!

1854లో సర్ 'చార్లెస్ ఉడ్ ' అనే ఉన్నతాధికారి ఎడ్యుకేషన్ డిస్పాచ్ (విద్యాపత్రం) అనే ప్రసిద్ధ పత్రం ద్వారా భారత సమాజంలోని మధ్యతరగతి ప్రజలలో విద్యావ్యాప్తికోసం మాతృభాషలలోనే విద్యాబోధన జరపాలని బ్రిటీష్ ప్రభుత్వానికి సూచించారు. 1949 నుంచి 1985–86 నవోదయా విద్యా సంస్థ వరకూ యూనివర్శిటీ ఎడ్యుకేషన్ కమీషన్‌లు మొత్తుకుంటూ వచ్చింది కూడా అదే! అందుకే కవి ఛాయరాజ్‌అన్నారు, "నా ప్రేమ నా అభిమానం మిత్రులకు అర్థం కావాలి/ నా ఆగ్రహం, నా ఆవేశం శత్రువులకు అర్థం కావాలి/ నా శ్రమ, నా శక్తీ నా భాషలోనే వ్యక్తంకావాలి/ పుట్టుక దగ్గర, చావు దగ్గర పర భాషలో నవ్వలేను, ఏడ్వలేను' అని.

నిజానికి వికృతులే మన తెలుగు ప్రకృతి పదాలు! దీనంతటికి ప్రధాన కారణం 'జనని సంస్కృతంబు సకల భాషలకును' అన్న మూఢవిశ్వాసం. ఈ తప్పుడు నమ్మకంతోనే వాడుకలో ఉన్న వేలాది దేశీపదాలను సంస్కృతీకరించారనీ, లేదా అచ్చ తెలుగు పదాలకు సంస్కృత సంబంధమైన కృతక వ్యుత్పత్తి కల్పించారని పరిశోధకులు నిగ్గుతేల్చారు. ఎందుకంటే ఈ దురభిమానమే ఓరుగల్లును ఏకశిలానగరంగాను, పెనుగొండను ఘనగిరి గానూ చెయ్యేరును బాహుదాగాను యధేచ్ఛగా మార్చింది! అలాగే ఈ దురభిమానమే కరినాడును కర్నాటక అని అత్తిరాల గ్రామాన్ని హత్యరాల అని, నార్త్ సింహాచలాన్ని నారద సింహాచలంగానూ సంస్కృతీకరించేలా చేసిందని మరువరాదు అంతేగాదు, తల్లిని మాతృ చేశారు. తండ్రిని పితృచేశారు. ఈ సంస్కృతీకరణతో మన తెలుగైన ఆకుటిల్లు పోయి పర్ణశాల వచ్చింది. దీవి, లంకపోయి ద్వీపం వచ్చింది. అడుసు/రొంపి పోయి పంకం వచ్చింది. చదువు చంకనాకి విద్యగా మారింది. కబ్బం కాస్తా కావ్యం అయింది. తిట్టుపోయి మనపాలి శాపంగా వచ్చింది. ఒట్టును గట్టుపైన పెట్టి శపథం అందలం ఎక్కింది. సేద్యం/ సాగుపోయి వ్యవసాయం వచ్చింది! వేకి పోయి ఉష్ణం/జ్వరం వచ్చాయి! ఉసురు ప్రాణంగా మారింది. నెత్తురు కాస్తా రక్తంగా మారింది! జనపదాలను, జానపదులను, వారి నేలతల్లి కళారూపాలను, గ్రామీణ స్త్రీ సాహిత్యాన్ని ఏనాడూ విడిచిపెట్టామో ఆనాటినుంచి తెలుగువాళ్ళం పదాల కోసం పడిగాపులు పడాల్సి వచ్చిందని గ్రహించాలి.

# మాతృభాషకు అవమానం

**– హెబ్బార్ నాగేశ్వరరావు,**

కందుకూరి వీరేశలింగం పంతులు నుడివినట్లు “ఈశ్వరానుగ్రహమున...” మనకు ఆంగ్లేయుల పాలన సంప్రాప్తమైన నాటినుంచీ, శతాబ్దులుగా మనం ఆత్మన్యూనతకు గురి అవుతున్నాము. కడప జిల్లా **మైదుకూరు**లోని ఒక ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తెలుగు భాషకు జరిగిన అవమానం, ఈ ఆత్మన్యూనత భావ చరిత్రలో భాగం. చిన్న పిల్లల మెడలో పలకలు వేలాడదీసి ఎండలో నిలబెట్టినందుకు పాఠశాల వారిని శిక్షిస్తారా? రెండింటికి కూడా శిక్షలు ఉన్నాయా? ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో పిల్లల నోటివెంట తెలుగు పలుకే వినబడరాదన్నది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కొనసాగుతున్న నిబంధన. దీన్ని మొదట ప్రభుత్వం తొలగించాలి!

గురజాడ అప్పారావు పంతులు కన్యాశుల్కం నాటకంలో వాచ్యంగాను, ధ్వన్యాత్మకంగాను ఆంగ్లభాష వాడకాన్ని ఆధునీకతకు ప్రతీకగా నిలబెట్టారు! అందువల్ల ఆ పరంపరను తల్లిదండ్రులం, తాతలం, బామ్మలం ఇంగ్లీషు భాష ఆధిక్యాన్ని మన అంతరాత్మలలో ఘనంగా ప్రతిష్టించుకొని ఉన్నాం! ఈ ప్రతిష్టను భారతీయ చిత్తశుద్ధితో మొదలయ్యేవరకు తెలుగునకు మాత్రమే కాదు భారతీయ మాతృభాషలన్నింటికీ కూడా ఆంగ్లభాషా సాంకర్యం తప్పదు. ఇంగ్లండులోను, అమెరికా , ఆస్ట్రేలియా, కెనడాలలో నిరక్షర కుక్షులు సైతం ధారాళంగా మాట్లాడే ఆంగ్లభాష విద్యాధికతకు చిహ్నమన్న అబద్ధాన్ని మన బుద్దులనుంచి తొలగించుకోవడం మాతృభాషల ఉద్ధరణకు మొదటి మెట్టు కాగలదు.! అప్పటి వరకూ ‘వంటగది’ అనడం బదులు ‘కిచెన్’ అని తల్లులు అంటున్నంతవరకూ –పిల్లలకు తెలుగు పట్ల మమకారం ఏర్పడబోదు! మనదేశంలో బాల బాలికలకూ, గ్రామీణ ప్రాంతాల పిల్లలకు అక్షరాస్యత వంటబట్టడం ఆంగ్లేయుల పాలన మొదలైన తరవాతనే...” అని గిడుగు రామమూర్తిపంతులు గారు గత శతాబ్ది ఆరంభంలో నిర్ధారించినట్లు చరిత్ర! మనలను మనమే కించపరచు కొనడానికి గిడుగువారి నిర్ధారణకు మించిన నిజం మరొకటి కనిపించదు. ఎందుకంటే భారతదేశంలో అనాదిగా అన్నిచోట్ల బాల బాలికలన్న విచక్షణ లేకుండా అన్ని కులాలవారు, వర్గాల వారు, విద్యలు నేర్చుకొనడం వాస్తమైన చరిత్ర! అందరూ విద్యలను నేర్చుకునే పద్ధతిని బ్రిటీష్ దురాక్రమణ దారులు పదిహేడవ, పద్దెనిమిదవ శతాబ్దులలో భూస్థాపితం చేయడం మరో వాస్తవం! అందువల్ల బ్రిటీష్ దురాక్రమణ పూర్వ భారతీయ సమాజంలో గ్రామీణులు, మహిళలు, విద్యాద్యుతులను చూడకుండా చీకటిలో మగ్గిపోయేవారు! అన్న అబద్ధాన్ని మన నెత్తిమీది నుంచి దించిపారేయాలి! అది జరగనంతవరకూ, “ఇంగ్లీషు వారి పద్ధతులు అన్నీ ఆధునీకతకు, అభ్యుదయానికి మారుపేర్లు” అన్న భ్రాంతి తొలగదు! ఆ భ్రాంతి తొలగినప్పుడు మాత్రమే భారతీయుణ్ణి భారతీయుడుగా

నిలబెట్టే చదువుకు, అందుకు తగిన బోధన మాధ్యమాలకు ఆదరణ లభిస్తుంది! మొక్కపాటి నరసింహశాస్త్రి రచించిన 'బారిస్టర్ పార్వతీశం'లో నాయకుడు బ్రిటన్‌ను ఆకాశమంత పైకి ఎత్తి అభినందించే ఘట్టాలున్నాయి. బ్రిటన్‌లో దొంగతనాలే జరగవట. వారందరూ నూటికి నూరుపాళ్ళు నిజాయితీ పరులట! వారి పద్ధతులన్నీ మనం నేర్చుకుని ఆచరించడం తప్పనిసరి అయిన విషయమని– కథానాయకుడు బ్రిటన్ నుంచి తిరిగివచ్చి పాఠశాల పిల్లలకు ఉద్బోధించాడు! చివరికి బ్రిటన్‌లో శిశువులు సైతం గుక్కపట్టి ఏడవరని నాయకుడు నిర్ధారించాడు. మనదేశంలో చిన్న పిల్లలు ఏడవడం గొప్ప అపరాధమని నవలాకారుడు నిర్దేశించి వెళ్ళాడు. "బాలానాం రోదనం బలమ్" అన్న భారతీయ చాటువును ఆయన యద్దేవా కూడా చేశారు. శ్రేష్టులైన మన విద్యావంతులు మనకు చూపించిన పాశ్చాత్యపథంలో ఇలా ఉదాహరణలు, మైలురాళ్ళు, కిలోమీటర్ రాళ్ళు కోకోల్లలు... ఇవన్నీ భారతీయుల బుద్ధికి గుదిబండలన్న సంగతి మనం ఇప్పటికీ పట్టించుకోవడంలేదు! అక్షర మాధ్యమం కంటే దృశ్యశ్రవణ మాధ్యమం మరింత బలమైనది. అందువల్ల ప్రభావం కూడ మరింత శక్తివంతంగా మన జీవన విధానంలోనికి చొచ్చుకొని పోయింది!" అదేమిటిరా... నిన్ను ఇంగ్లాండుకు పంపించినప్పటికీ  ఇంకా పాత పద్ధతేనా? అదేదో ఉందిగా షేకూ... హాండూ... అన్న డైలాగు క్రీస్తు శకం 1950 దశకం నాటి 'అప్పుచేసి పప్పుకూడు' సినిమాలోనిది. భారతీయ పద్ధతిలో నమస్కారం పెట్టడం గురించి ఇది వెక్కిరింపు. అది దుష్ట పాత్రధారి భావం. కానీ క్రమంగా మంచి పాత్రల చేత కూడా ఇలాంటి డైలాగులను పలికించారు. ఉదాత్తీకరించేవారు పెళ్ళికూతురు కాస్తో కూస్తో.. ఇంగ్లీషు కూడా చదువుకుందిలెండీ... అన్నది గుండమ్మ కథ సినిమాలోని పెళ్ళిళ్ళ పేరయ్య డైలాగు! చదువంటే ఇంగ్లీషు భాష మాత్రమేనని, చదువుకున్నవారు భారతీయమైన ఆహారఆహార్యాలకు, అలవాట్లకు, సంప్రదాయాలకు స్వస్తి చెప్పాలని చాటిచెప్పడానికి దృశ్యమాధ్యమాలు అవిరళ కృషి చేస్తున్నాయి. ఫలితంగా నేను ' తెలుగు మాట్లాడను' అన్న ఇంగ్లీషు వాక్యాన్ని పదేపదే వ్రాయడం శిక్షగా పొందిన బిడ్డలను చూసి మురిసిపోతున్న పెద్దలు అత్యధికశాతం మన ఇళ్ళలో ఉన్నారు!

త్రేతాయుగంలో సీతను వెదకుతూ లంకకు వెళ్ళిన హనుమంతునికి ఆయమ్మ అశోకవనంలో కన్పించడం చరిత్ర. సీతమ్మ పాడ్యమి రోజున చదివిన విద్యార్థి విద్యవలె–"ప్రతిపత్ పాఠశీలస్యవిద్యా ఇవ..." కృశించిపోయి ఉందట– రామాయణ ఇతిహాసకారుడైన వాల్మీకి చెప్పాడు. "పాడ్యమి రోజున పాఠాలు చెప్పరాదు, చదువరాదు, అన్న భారతీయ సంప్రదాయం సజీవంగా ఉండిన రోజులలో ఈ ఉపమానం కవికి స్ఫురించింది! ఇప్పుడు ఆ సంతతి అత్యధిక శాతం కవులకు, మేధావులకు విద్యాధికులకు తెలియదు కనుక స్ఫురించదు. వారు వాడరు. ఇప్పుడు ఐరోపా దేశాలలోని సంప్రదాయాలు, సామెతలు, పద్ధతులు భారతీయ విద్యావంతులకు స్ఫురిస్తున్నాయి. ఈ మార్పు బ్రిటీష్

దుండగుల పెత్తనం ఫలితం! ఇప్పుడు ఆదివారం పాఠశాలకు సెలవు! పాడ్యమి, చతుర్దశి, అష్టమి, అమావాస్య, పౌర్ణమి దినాలలో పాఠం చెప్పరాదన్న పద్దతిని బ్రిటీష్ దురాక్రమణదారులు దిగమింగిపోయారు. అందువల్ల ఆ రోజులలో సెలవులు లేవు!

ఆరోజుల పేర్లను సైతం మన నోళ్ళు ఇప్పుడు పలుకలేవు!!ఆదివారం ఇచ్చే పద్ధతి మంచిదా? పాడ్యమి వంటి రోజులలో సెలవు ఇవ్వడం మంచిదా? అన్న చర్చ మన దేశంలో జరగవచ్చు కానీ ఏ ఇతర దేశంలోనూ తమ పద్ధతి మంచిదా, విదేశాల నుంచి దిగబడిన పద్ధతి మంచిదా? అన్న చర్చలు జరుగవు! తమ స్వదేశ పద్దతులు మంచివని, విదేశాల పద్దతులను అనుకరించరాదని మనదేశం మినహా దాదాపు అన్ని దేశాలలోను విద్యావంతులు భావిస్తున్నారు! చంద్రుని గమనం వంటి ఖగోళ వాస్తవాలతో ముడిపడి పాడ్యమి వంటి తిథులు ఏర్పడినాయన్నది భారతీయ విద్య! సముద్రాలను సైతం అల్లకల్లోలం చేయగల ప్రభావశాలి చంద్రుడన్నది భౌతిక సత్యం! మరి విద్యార్థుల బుద్ధిని, గ్రహణశక్తిని చంద్రుడు ప్రభావితం చేయలేదా? ఎటొచ్చీ ఈ బౌద్ధిక సత్యాన్ని మనం నమ్మడంలేదు. నమ్మకుండా చేసి పోయినవాడు బ్రిటీష్ దోపిడీదారుడు! 1834నుంచి బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశపు మాతృభాష -సంస్కృత భాష చేసిన పనులన్నింటిని ఆంగ్లంలో చేయడం అలవాటు చేసింది. తల్లిని మింగిన తోడేలు పిల్లలను వదలిపెడుతుందా! అందువల్లనే భారతీయ భాషలను హత్యచేసే కార్యక్రమం సాగిపోతోంది! భారతీయ భాషలన్నీ సంస్కృత భాష నుండి పుట్టాయి. అందువల్ల సంస్కృత భాష నశించిపోయిన ప్రభావం అన్ని భారతీయ భాషలనూ ఆవహిస్తోంది. భారతీయ బాషలలో కొన్ని సంస్కృత భాష నుండి రూపొందలేదన్న కల్లల కథను బ్రిటీష్ వారు కల్పించారు. బిషప్ కాల్డ్‌వెల్ ప్రచారం చేశారు. ఆ కట్టుకథను భాషా శాస్త్రం పేరుతో విశ్వవిద్యాలయాల వారు ఇప్పటికీ విద్యార్థుల తలకెక్కిస్తున్నారు! దీన్ని మానిపించనిదే తెలుగు ఎలా వెలుగుతుంది?

విదేశీయ దురాక్రమణదారులు మన నెత్తికెక్కక పూర్వం జయకారం ఈ దేశంలో అభినందనకు, సంబోధనకు, స్వాగతానికి, వీడ్కోలునకు పర్యాయపదం... 'జయ' అని అంటే 'జయమగుగాక' అని అర్థం! దీన్ని మనం మరచిపోయాము. బ్రిటీష్‌వారి "చదువుల" సారా తాగి మరచిపోయాము. ఇప్పుడ ప్రతినోట 'బయ్ బయ్' అని అర్థం లేని పదం వినబడుతోంది! రోడ్లలో, ఇళ్ళలో బస్సులలో రైళ్ళలో, ఫోన్లలో 'బయ్ బయ్' విశృంఖల రూపమెత్తి ఉంది! తెలుగు గురించి మాతృభాష గురించి ఇంతగా తపనపడుతున్న వారం ఇక నుంచి 'బయ్ బయ్' గుడ్‌బై 'టాటా'లను మానేసి 'జయ్ జయ్' అని ఎందుకు పలకరాదు? పెద్ద పెద్దవన్నీ ప్రభుత్వాలు చేయాలి కాని ప్రజలందరూ "జయ్ జయ్' అనడానికి ఏమి కష్టం!

**-ఆంధ్రభూమి దినపత్రిక,**

05-11-2009.

# ఏమిటీ దుస్థితి..ఏమైనది తెలుగు ద్యుతి

**–అక్కిరాజు రమాపతిరావు,**

అప్పుడే యాభై మూడేళ్ళయింది తెలుగు వారమంతా ఒకటేననుకొని, మనందరి భాష తెలుగేననుకొని..ఒక భాషా సముదాయం కష్టసుఖాలు, ఆనందోల్లాసాలు, భావోద్వేగాలు, భావ సమైక్యతలు భాష ద్వారానే కదా మన భాష మనకు తల్లి వంటిది. ఏదైనా కష్టం వస్తే , బాధ అనిపిస్తే, ఏదైనా ఉల్లాసం కలిగితే, ఏదైనా ఉత్సాహం ఉరకలువేస్తే..'అమ్మా !అమ్మా!' అని ఆ ప్రతిస్పందనను వ్యక్తీకరిస్తాం. సమస్త సృష్టిలో అమ్మకన్నా దగ్గరైంది మరేముంది కనక! మనమంతా మొట్టమొదట వినే మాటలు, అనే పలుకులు అమ్మ దగ్గరనుంచే నేర్చుకుంటాం. మనభాష మన తల్లికి ప్రతినిధి.. మన నాగరికత, మన సంస్కృతి, మన సాహిత్యం, భాష, మాధ్యమం ద్వారా కాకుండా పెంపొందించడం సాధ్యమా?

అనేక యూరపు దేశాలకన్నా తెలుగువారి జనసంఖ్య ఎక్కువ. వారి కన్న ఎక్కువ చరిత్ర ఉన్నది తెలుగువారికి. అంతర్యుద్ధాలతో జాతి కలహాలతో స్వపర వ్యతిరేకతలతో ఒక చైనా చక్రవర్తి కష్టాలపాలై సాయం అర్థించగా ఒక చోళరాజు ఆయనకు సైనిక సహాయం చేసి ఆదుకున్నాడని భావరాజు వెంకట కృష్ణారావు 'ప్రాచీనాంధ్ర నౌకా జీవన చరిత్ర' లో రాశాడే. మనం మన మంచి పుస్తకాలు ఎందుకు చదవం, ఎందుకు చదివించం? తెలుగువారికి తమ భాష తెలుసు అని చెప్పుకోవడానికి నామోషి, తమ భాషలో వ్యవహారాలు నిర్వహించు కోవడానికి బిడియం, న్యూనత, శంక, అపరాధ భావం. ఇంకా వలస భాషా సంస్కృతుల పాలక పాలిత బానిస మనస్తత్వం మనలను విడిచిపెట్టలేదు. మన రాజధానిలో బస్సులు ఆగే చోట, సాగే చోట 'బస్‌బే' అని గుర్తింపు నిర్దేశ ఫలకాలు ఇంగ్లీషులో ఉంటాయి. ఏ స్కాట్లండు నుంచో ఐర్లండు నుంచో మన బస్సులు ఎక్కడానికి, దిగడానికి వచ్చేవాళ్లు  ఎక్కడ బాధపడిపోతారోనని మన మారుమూల గ్రామాలలో, నగరాలలో, పట్టణాలలోని హొటళ్ళు, దుకాణాలు ప్రభుత్వ కార్యాలయాలు ఇంగ్లీషులో కనబడతాయి. ప్రభుత్వం కలిగించే సదుపాయాలు, సౌకర్యాలు నిర్వహించే వివిధ పాలన శాఖలు వీటికి సంబంధించిన దరఖాస్తు పత్రాలు నివేదికలు, తెలివిడులు, ఇంకా ఇంగ్లీషులోనే ఉంటాయి. మన బహుళ అంతస్థుల భవన సముదాయాల పేర్లు, వీధి నిర్దేశితాలు, ఇంకా ఇంగ్లీషులోనే కనబడతాయి. ఒక వేళ రష్యానుంచో అమెరికానుంచో పనిబడో లేక పర్యాటకాపేక్షతోనో ఎవరైనా వస్తే వాళ్ళు ఎక్కడ ఇబ్బంది పడిపోతారోనని మన తెలుగు వాళ్ళం విశాల విపరీత ధృక్పథం అవలంబిస్తాం. మన పిల్లలు చదివే మాతృభాషా వాచక పుస్తకాల నిండా అవాకులూ, చెవాకులూ  వాళ్ల లేత మనసుల్లో ఆర్ధ్రతా, భాషాభిమానమూ మమత్వమూ కలగకుండా జాగ్రత్తలు చూస్తాం. లేకపోతే కాలం చెల్లిన సామాజిక రాజకీయ అభిమానులు, చిన్న పిల్లల పుస్తకాలలో ఒక్క అచ్చు తప్పు కూడా ఉండకూడదన్న ఇంగితం ఆ పుస్తకాలు

తయారు చేసే రచయితలకు, సంపాదకులకు ఉండకపోతే ఒక తరానికి తరమే నష్టపోవడమే కదా! మహీధర నళినీమోహన్ ఒక విషయం చెప్పేవారు. ఆయన మాస్కో విశ్వవిద్యాలయం నుంచి విద్యుత్, భౌతిక, అంతరిక్ష విజ్ఞాన శాస్త్రాలలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టం పొందారు. తన పరిశోధన విషయ సమర్పణ రష్యన్ భాషలోనే ఉండాలిగాని అన్య భాషలలో అక్కడి విశ్వవిద్యాలయాలు అంగీకరించవట. ఆయన పరిశోధన విషయసమర్పణ రష్యన్ భాషలోనే జరిగింది. మరి ఈయన కోనసీమ ముంగండ అగ్రహారం నుంచి రష్యా వెళ్ళినవాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతిక విజ్ఞానశాస్త్రం అధ్యయనం చేసినవాడు. అంటే ఆయా దేశాలవాళ్ళు తమ భాషలను అట్లా అభిమానిస్తారు అని తెలుసుకోవాలి.

విశ్వవిఖ్యాత విజ్ఞాన వేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు ఇంగ్లీషు రాదని ఆయనే చెప్పుకున్నాడు స్వీయచరిత్రలో. మహాత్మాగాంధీ మనిద్దరికి గుజరాతీ తెలుసు కదా అని మహమ్మదాలీ జిన్నాకు గుజరాతీలోనే ఉత్తరం రాసినట్లు చెప్పుకున్నారొకసారి. గాంధీ గారికి ఇంగ్లీషు రాదా? ఆయన ఆత్మకథ గుజరాతీలోనే రాసుకున్నాడుకదా! అభిమానం ఉండాలి. దురభిమానం ఉండకూడదు. ఎప్పుడైనా వాడుకలోనే సమస్త వ్యవహార నిర్వహణలోనే భాష విస్తృత భావ ప్రకటన శక్తిని సంపాదించుకుంటుంది. విశాలమవుతుంది. ఎల్లాప్రగడ సుబ్బారావు ఆయుర్వేద విజ్ఞానశాస్త్ర విషయాలు తెలుగులో కూడా రాశాడని ఎందరికి తెలుసు? స్వామి జ్ఞానానంద పరమాణు భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్త. ఆయన విదేశాలలో కూడా పరిశోధనలు చేశాడు. ఆయన చిన్నతనంలో వీరవాసరంలో, నర్సాపురంలో ఇంగ్లీషుమాధ్యమంలో చదవలేదే! ఎల్లా ప్రగడ సుబ్బారావు రాజమండ్రిలో కళాశాలలో చదివినప్పుడు ఇంగ్లీషు మాధ్యమంలోనే చదివాడా? ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నాడా? ఇంగ్లండులో ఉన్నత న్యాయవాదిత్వ పరీక్షకు వెళ్ళినపుడు పరీక్షా ప్రశ్నాపత్రం ఒకదాంట్లో ఆయనకు అందరికన్నా ఎక్కువ మార్కులు వచ్చాయట. ఆ శాస్త్ర విభాగంలో బోధించే ప్రొఫెసర్ స్వయంగా ప్రకాశం పంతులుగారి గదికి వచ్చి (రూముకు అనాలేమో) ఆయన్ను అభినందించారట. మనం మంచి పుస్తకాలు చదవం గదా? మనకీ విషయాలు ఎట్లా తెలుస్తాయి? ఎందుకు తెలుస్తాయి.

ప్రకాశం పంతులు గారికి తెలుగు భాష పట్ల, తెలుగు వారిపట్ల ఎంతటి ప్రేమాభిమానాలు, ఎంత మమకారం ఉండేవో ఆయన ఆత్మకథలో ప్రస్తావించాడు. పట్టభద్రస్థాయిలోనో, స్నాతకోత్తర స్థాయిలోనో ఆ పుస్తకాన్ని మన యువతీ యువకులు ఎందుకు చదవరు? విద్యా విషయ నిర్వహణ శాఖవారు ఎందుకు చదివించరు? ఇంగ్లండులో తాను చదువుకుంటున్నప్పుడు అక్కడి సామాజిక సంబంధాల గూర్చి, ప్రజా సౌకర్యాల నిర్వహణ గూర్చి ప్రస్తావిస్తూ ప్రకాశం పంతులు గారిట్లా రాశారు. " ఇట్లాంటి చిన్న విషయాలే నాకు ఆంగ్ల జాతీయ జీవనం మీదా, నీతివర్తనంలోనూ బాగా గాఢాభిమానం కలిగించాయి.

ఆ అభిప్రాయాలతోనూ అభిమానంతోనూ వెనక్కి తిరిగి మన దేశం సంగతి తలచుకొంటే నిస్పృహ కలిగింది. ఎప్పటికైనా ప్రజాస్వామ్యం ఈ ఔన్నత్యానికి రాగలదా? అని బాధ కలిగింది. అప్పట్లో నామనసు నా ఒక్కడిదేకాదు. అది సమకాలీకులందరిదీ! అదీగాక ఒక కొత్త వింతలాగా పాశ్చాత్య నాగరికతను అత్యంత వ్యామోహంతో చూస్తూ ఉండే రోజులవడం వల్ల కూడా నాకీ నిస్పృహ కలిగింది. తరువాత నా అనుభవం వల్ల మనదేశంలో మన జాతిలో కూడా ఒకప్పుడు ఇట్లాంటి నీతి నియమాల ఔన్నత్యం ఉండేదని, మాట ఘరానా ఒకటేనని ఇచ్చిపుచ్చుకోవడాలలో రాతకోతలు, రిజస్టరీలు లేవని తెలుసుకోగలిగాను. అవినీతి పరులైన విద్యావేత్తలు, ఇంజనీర్లు, వైద్యులు, మంత్రుల సంగతి చూస్తే ఆయన ఇప్పుడెంత బాధపడేవారో?

మొదటిసారి అక్కడ ఉన్న 8 మాసాలలోను ఇంగ్లండులోని ముఖ్య పట్టణాలన్నీ చూశాను. షేక్స్‌ఫియర్ మహాకవి ఇల్లు, ఆయన భార్య నివాసము మొదలైన చారిత్రక స్థలాలు ఎన్నో దర్శించాను. వాళ్ళ దేశంలోని ప్రసిద్ధ రచయితలకు వాళ్లు చూపే ఆదరణ గౌరవమూ చాలా ప్రశంసనీయాలు. ప్రభుత్వమే వాళ్ళకు ఉండే ఇల్లు వగైరాలు కొని వాటిని జాతీయ ప్రస్థాపనలుగా రక్షించి ఉంచుతారు.

మనదేశంలో ముఖ్యంగా తెలుగుదేశంలో భారతం వ్రాసిన నన్నయాదులకీ, భాగవతం వ్రాసిన పోతన్నకి, వాళ్ల గ్రంథాలు తప్ప వారి సంతతి వారికి ఉత్సాహం కలిగించి గర్వం కలిగించే చిహ్నాలేమీ లేనేలేవుకదా! అప్పుడే ఎప్పటికైనా రాజమహేంద్రవరంలో తిక్కనకి, నన్నయకి, ఎఱ్ఱనకి ఒక స్మారక చిహ్నం కట్టాలని నాకు సంకల్పం కలిగింది. కానీ తరువాత జీవితపు అంకంలో నేనా పని చేయలేకపోయాను. అన్నారు ఆంధ్రకేసరి. ఇప్పటి ముఖ్యమంత్రిగారికి కందుకూరి వీరేశలింగం పంతులు గారిపట్ల గౌరవము, మమకారమూ ఉన్నట్లు ఆయన మాటల్లో వ్యక్తమవుతున్నది కదా! ఆయన కలలను సాకారం చేయవలసిన బాధ్యత, కర్తవ్యం ప్రభుత్వం పైన ఉన్నాయి. కాబట్టి ప్రతి జిల్లాలోను తెలుగు సభలు జరుపాలి. తెలుగుపట్ల ఆదరాన్ని అభిమానాన్ని పెంపొందింపచేయాలి. రాజమహేంద్రవరంలో నన్నయకు, నెల్లూరులో పొట్టి శ్రీరాములుకు, తిక్కనకు, ఒంగోలులో ఎర్రనకు, వరంగల్‌లో పోతనకూ తెలుగు సభా భవనాలు నిర్మింపచేసి వాళ్ళ స్మారక ఉత్సవాలను మమతత్వంతో జరుపుకునేటట్లు ప్రభుత్వం చూడాలి. హిందీ, తమిళ, మలయాళ, కన్నడం ప్రాంతాల వాళ్ళ నుంచి అయినా మనం నేర్చుకోవాలి.

**–ఆంధ్రభూమి దినపత్రిక,**
31–10–2009.

# తెలుగు మాటకేదీ పలుకుబడి?

**- డాక్టర్ అద్దంకి శ్రీనివాస్**

దేశంలోనే భాషాప్రాతిపదికన ఏర్పడిన తొలిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. సుసంపన్నమైన చారిత్రక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక నేపథ్యం తెలుగు భాష సొంతం. ఆంధ్రరాష్ట్ర అస్థిత్వానికి కారణమైన అమ్మభాష-కాలం గడుస్తున్నకొద్దీ తెలుగునాట మసకబారుతుండడమే కలచివేస్తున్న అంశం. అటు బోధనలోనూ, ఇటు జన వ్యవహారంలోనూ తెలుగు మాట అప్రాధాన్యాంశంగా మారుతోంది. తెలుగు ప్రాభవం కొడిగట్టడానికి కారణాలెన్నో ఉన్నాయి. వ్యాపారం, ఉద్యోగం, సంస్కృతి, విజ్ఞానాల్లోనూ, ప్రజల వ్యాసంగాల్లోనూ కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావం తెలుగుభాషపై పడుతోంది. మనభాషపై సాంస్కృతిక పరంగా సంస్కృతం, పాలనపరంగా అరబిక్, పర్షియన్, శాస్త్ర సాంకేతికపరంగా ఆంగ్లభాషల ప్రభావం ఎక్కువ. ఈ కారణంగానే తెలుగులో అన్యభాషల పదాలు వేలకొద్దీ చేరిపోయాయి. ఫలితంగా తెలుగుభాష నిత్య వ్యవహారంనుంచి క్రమంగా పక్కకు జరుగుతోంది.

**ఆవిరై పోతున్న అధికారభాష**

తెలుగువాడు సంస్కృతంలో నిద్ర లేవడంతో తెలుగు కునుకు తీసింది. బ్రష్ చేయడంలో పందుంపుల్ల అరిగిపోయి విరిగిపోయింది. పళ్లపొడి పాడైపోయింది. టిఫిన్ దెబ్బకు చద్దన్నాలూ, అంబళ్లూ పులిసిపోయాయి. లంచ్‌లు , డిన్నర్‌ల దెబ్బకి కూడు కాస్తా నోటికి దూరం అయింది. తెలుగు కూర ఫ్రై, కర్రీ అయిపోయింది. సాయంత్రం స్నాక్స్‌లో పైటన్నం కొట్టుకుపోయింది. ఈ వాక్యాలు వినడానికి చమత్కారంగానూ, అతిశయంగానూ అనిపించినా ఇవి తెలుగుభాషపై ఆంగ్ల ప్రభావానికి దర్పణం పడతాయి. అన్యదేశాలు వాడితే తప్పేముంది? దాని వల్ల భాష విస్త ృతమవుతుంది కదా అన్న అభిప్రాయమూ వ్యాప్తిలో ఉంది. అది నిజమే కానీ , అన్యదేశాల వాడకం ప్రాథమిక పదజాలం నశించిపోయేంతగా ఉంటేనే సమస్య సాధ్యమైనంతవరకూ నూతన సంబంధాలకు సృష్టించాల్సిన చోట వాటినే వ్యాప్తిచేయాలి. కుదరని చోట అన్యభాషా పదాలను వాడితే తప్పులేదు. తమిళంలో ప్రాణవాయువు అనే తత్సమ పదం పిరాణ వాయువు అనే తద్భవంగా వ్యాప్తిలో ఉంది. తమిళులు దానితో సంతృప్తి చెందక ఉయిర్‌కాట్రు అనే దేశ్యపదాన్ని తయారుచేసి వ్యాప్తిలోకి తీసుకువచ్చారు. మన వాక్యంలో వ్యాకరణం తెలుగులో ఉంటుంది. పదాలన్నీ ఆంగ్లంలో ఉంటాయి. వాక్యరచన, క్రియలు, నామవాచకాలపై ఆంగ్ల ప్రభావం వాడకాన్ని పెంచాలంటే మన భాషలో కూడా ఆధునిక వస్తువులకు ప్రత్యామ్నాయంగా అదే అర్థం స్ఫుర్తించే విధంగా నూతన పదబంధాలను సృష్టించాలి.

ఏ అంశాన్నయినా ఆంగ్లంలో చెప్పడమే నవనాగరికతగా చెలామణి అవుతోంది. వ్యవహారంలో ఉన్న ఆంగ్ల పదాలకు సరైన ప్రత్యామ్నాయాలు తెలియకపోవడం వల్ల ఆంగ్ల పదాల సంఖ్య తెలుగులో అధికమవుతోంది. దీనివల్ల మన భాషలో రాటుదేలిన పదజాలమంతా తెలుగులోకి ప్రవేశించినపుడు ఆ పదాన్ని అలాగే వాడుతున్నారు. ఇరుభాషల్లో ప్రావీణ్యం ఉన్నవారు ఆ ఆంగ్లపదానికి సరైన ప్రత్యామ్నాయ తెలుగుపదాన్ని అన్వేషించేందుకు కృషి చేయడం లేదు. మరోవైపు కొన్ని సందర్భాల్లో అదే ఆంగ్లపదం సామాన్య జన వ్యవహారంలో సొంతభాషలోకి మారుతుంటుంది. దొంగోడ, డబ్బిళ్ల, తవ్వోడ, గ్యాసు బండ వంటివి ఎంతో సహజంగా మూలానికి దగ్గరగా ఉంటూ తెలుగుతనాన్ని పుణికిపుచ్చుకున్నాయి. వీటి సృష్టికర్తలు సామాన్యులే. ఇలాంటి వారు కొత్త పదజాలాన్ని సృష్టిస్తే దాని ప్రామాణికత ఎంత అన్న సందేహం వెన్నాడుతూనే ఉంటుంది. ఇక తెలుగు అకాడమీ, విశ్వవిద్యాలయాలు చేసిన కొద్దిపాటి కృషి ప్రజలకు సరిగ్గా అందుతున్న దాఖలాలు లేవు.

మాతృభాషలో బోధనాభ్యాసాలు చేస్తే మిగిలిన వారికంటే వెనుకబడిపోతామన్న అపోహలు సైతం తెలుగుభాష వెనుకబాటుకు కారణమవుతున్నాయి. జపాన్, రష్యా, చైనా ప్రజలు పూర్తిగా మాతృభాషలోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అంతర్జాతీయంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆ దేశాలు ఎంత ముందంజలో ఉన్నాయో తెలిసిందే. ఆంగ్లభాషను విడిచి పెట్టాలని చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. రష్యన్లు ఆంగ్లాన్ని రష్యన్ భాషలోనూ, చైనీయులు చీని భాషలోనూ అభ్యసిస్తున్నారు. కానీ తెలుగు నాట మాత్రం మాతృభాషను సైతం ఆంగ్లంలోనే నేర్చుకునే దురవస్థలో కొందరు మగ్గుతున్నారు. భారతీయ భాషలన్నీ పదసంపదలో సుసంపన్నాలు. వాడుకలో లేకపోవడంవల్లే ఈ భాషలు వెనుకబడి పోతున్నాయన్న విషయాన్ని గమనించాల్సిన తరుణమిది. ఆంగ్లభాషపై వ్యామోహంతో శాస్త్ర సాంకేతిక విద్యాబోధనకు తెలుగు పనికిరాదని చేసే వాదనలో అర్థంలేదు. వాడుకలోకి తీసుకువస్తే ఆధునిక విజ్ఞానాన్ని అలవోకగా అందించగల శక్తి మాతృభాషకు ఉంది.

తెలుగుభాషను పరిరక్షించి, పరిపుష్టం చేయాలంటే కాలానుగుణంగా వచ్చి చేరే అన్యదేశాలకు సమానార్థకాలను సృష్టించుకోవడం తక్షణావసరం. శాస్త్రీయ అంశాలతోపాటు, వ్యవహార భాషకు సంబంధించి సమానార్థక పదాలను తయారు చేసుకోవాలి. విద్యా విషయక పారిభాషిక పదకల్పనలో తత్సమ పదాలకే ప్రాధాన్యం ఎక్కువ. అది అనివార్యమేకాదు, సౌలభ్యం కూడా. వివిధ శాస్త్రాలకు సంబంధించిన పారిభాషిక పదాలు సులభగ్రాహ్యం కావని, వాటికన్నా ఆంగ్లపదాలే సులభంగా ఉన్నాయన్న వాదన ఒకటి ఉంది. శాస్త్రం బుద్ధి గ్రాహ్యం కాబట్టి కష్టంగా ఉన్నప్పటికి తత్సమ పదాలు ఉపయోగించాల్సిందే. కానీ నిత్యావ్యవహారంలోని అన్యభాషా పదాలకు సాధ్యమైనంతవరకు అచ్చ తెలుగు పదాలతో సమానార్థకాలను సృష్టించుకోవడం మంచిది. తొలినాళ్లలో పత్రికలు,

అకాడమీలు, కొన్ని విశ్వవిద్యాలయాలు పెద్ద ఎత్తున ఈ కృషి చేశాయి. కాలం గడుస్తున్నకొద్దీ కొత్త వ్యాపారాలు, వ్యవహారాలు, విద్యలు రంగప్రవేశం చేశాయి. వీటికి సంబంధించిన సాంకేతిక పారిభాషిక పదాలకు తెలుగు పదాలను సృష్టించుకోవడంలో ఎక్కడలేని అలసత్వం కనిపిస్తోంది. అన్ని రంగాల పారిభాషిక పదాలకు మారుగా తెలుగులో పదకల్పన చేయమనడం ఇక్కడ ఉద్దేశ్యం కాదు. సాధ్యమైనంతవరకు ఆయా సాంకేతిక పదాలకు ప్రాంతీయ భాషల్లో సమానార్థకాలను తయారు చేసుకోమనడం తప్పుకాదు. దీని సాధ్యాసాధ్యాలపై పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉంది. కాలానుగుణంగా భాషను తీర్చిదిద్దాల్సిన బాధ్యత భాషా శాస్త్రవేత్తలపై ఉంది. ఆంగ్లపదాలను ఉపయోగించక తప్పని పరిస్థితుల్లోనూ గట్టి ప్రయత్నం చేస్తే దేశీయంగా నూతన పదబంధాలను సృష్టించడం అసాధ్యమేమీ కాదు. ఇది మొండిగా అన్యభాషా పదాలను తిరస్కరించే ఛాందసవైఖరిగా మాత్రం మారకూడదు. రామ్‌మనోహర్ లోహియా అన్నట్లు కేవలం రెండున్నర లక్షల పదసంపద ఉన్న ఆంగ్లంలో కంటే ఆరులక్షల పదాలున్న తెలుగులో భావవ్యక్తీకరణ సులభం. ఇది తెలుగు అస్తిత్వాన్ని విస్తరింపజేసే ప్రయత్నంలో భాగం.

నూతన ఆంగ్ల పద నిర్మాణ ప్రక్రియ ఏ భాషకైనా ప్రాణావసరమే. ఆక్స్ ఫర్డ్ నిఘంటువును అయిదేళ్ళకొకసారి పునర్మిస్తుంటారు. ఈ ప్రక్రియలో భాగంగా అన్యదేశాలను చేర్చడం, కొన్నింటికి కొత్త పదాలను కల్పించడం, భాషా వ్యవహారంలో పదాలకు జతపడుతున్న కొత్త అర్థాలను స్వీకరించడం వంటివి చేస్తుంటారు. తెలుగులో ఆంగ్లభాషా పదాలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి సమానార్థక పదాలను సృష్టించుకోవడంలో ప్రయత్నలోపం తప్ప మరే కారణమూ కనిపించదు. తొలుత తెలుగులో మహా నిఘంటు నిర్మాణం జరగాలి. ఇప్పటికైనా ఆ దిశగా ప్రయత్నించాలి. తెలుగులో మహా నిఘంటువు ఏర్పడితే కనీసం పదేళ్ళకు ఒకసారయినా దాన్ని సవరించుకోవచ్చు.

**కొత్త పదాలకు శ్రీకారం**

గతంలో సమానార్థక పదసృష్టి ఓ నియమంగా జరిగేది. అర్థాన్ని బట్టి మన భాషలో ఒక పదాన్ని స్థిరపరచుకొని వాడేవారు. ఇప్పుడు శీర్షికల్లోనూ ఆంగ్లపదాలే దర్శనమిస్తున్నాయి. తొలినాళ్లలో సమానార్థక పద నిర్మాణానికి మన పత్రికా సంపాదకులు కొన్ని విధానాలను అనుసరించేవారు. తమిళ ఆకాశవాణిలో ప్రతిరోజూ కొత్త పారిభాషిక పదాలకు సంబంధించిన కార్యక్రమం ప్రసారమవుతుంది. కిందటిరోజు ఆంగ్ల పత్రికలో వచ్చిన కొత్త పారిభాషిక పదాలను తమిళంలో సమానార్థకాలను తయారుచేసి ప్రసారం చేస్తారు. ఆ రకంగా వాటిని ప్రజల నిత్యజీవన వ్యవహారంలో భాగం చేస్తారు. ఇంగ్లీషు మాటలను ఉపయోగించకుండానే రాసేందుకు హిందీ, తమిళం, కన్నడ వంటి భాషాపత్రికల్లో విలేకరులు ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకు ఇటీవల స్వైన్‌ఫ్లూ జ్వరానికి సంబంధించిన వార్తలు వివిధ పత్రికల్లో వచ్చాయి. ఆ పదాన్ని మన పత్రికలు యథాతథంగా వాడాయి తప్ప కొత్త పదాన్ని సృష్టించలేదు.

కన్నడిగులు దాన్ని హందిజ్వరమని తమ భాషలో తర్జుమా చేసుకున్నారు. స్వైన్‌ఫ్లూ వంటి పదానికే అనువాదం దొరకడం కష్టమే. చక్కటి కొత్తపదాన్ని తయారుచేసినప్పుడు అది వాడుకలో చేరిపోతుంది. రామాయణం, మహాభారతం వంటి ఉద్గ్రంథాలను తెలుగు చేసుకోగలిగిన మనకు నేటి అవసరాలను తీర్చు మాటలను కూడగట్టుకోవడం అసాధ్యమేం కాదు. కాశీనాథుని నాగేశ్వరరావు 1908లో ఆంధ్రపత్రికను వారపత్రికగా స్థాపించిన తర్వాత 1938లో పారిభాషిక పదకోశాన్ని నిర్మించారు. ఆ మాటలకు కందుకూరి వీరేశలింగం వివేకవర్ధిని ద్వారా కొండావెంకటప్పయ్య కృష్ణా పత్రిక ద్వారా ప్రచారం చేశారు. నైట్రోజన్‌కు నత్రజని, నికిల్‌కు నిఖిలం, ఆక్సిజన్‌కు ప్రాణవాయువు, ఫోటోసింథసిస్‌కు కిరణజన్య సంయోగక్రియ అని తెలుగు చేసింది కాశీనాథులవారే.

సుసంపన్నమైన భాష–జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, కీర్తి ప్రతిష్టలకు ప్రతీక. అపారమైన ప్రేమాభిమానాలుంటే అమ్మభాషను రక్షించుకోవడం, కొత్త దిశలకు విస్తరింపజేయడం అసాధ్యం కాదు. జనబాహుళ్యంలో సువ్యాప్తమైన భాషనుప్రభుత్వం అక్కున చేర్చుకుని ఆదరించాలి. ప్రభుత్వం అండగా నిలిచి పాలన వ్యవహారాల్లో చోటు కల్పించినపుడే తెలుగుకు భద్రత, గౌరవం. భాష సామాజిక ఆస్తి, ఈ భావన తమిళుల్లో బలంగా వేళ్లూనుకొని ఉంది. తమిళనాడులోని తిరుక్కురళ్ చదవనిదే ఇప్పటికీ ఏ సభా ప్రారంభం కాదు. మాతృభాష మనకి కళ్లు..ఆంగ్లభాష కళ్ళజోడు అని తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి అంటుంటారు. గుండెల్లో అంతటి అభిమానం ఉండబట్టే తల్లిభాషలోకి అన్యభాషాపదాల చొరబాటును తమిళులు అంగీకరించలేకపోతున్నారు. ఎంత మమకారం పెంచుకున్నా పరభాష ఏ రకంగానూ తల్లిభాషకు సాటికాదు, రాదు!

**ఈనాడు దినపత్రిక,**
01 నవంబర్ 2009.

---

## మీకో దండం!



# ఆంధ్రప్రదేశ్ విడిచి వెళ్లిపోండి

### సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రిన్సిపల్‌కు అర్చకుడి సాష్టాంగ నమస్కారం

**మైదుకూరు, న్యూస్‌టుడే :** మీకు శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నా... ( కరస్పాండెంట్‌కు సాష్టాంగ నమస్కారం చేశారు). మీరు ఆంధ్రప్రదేశ్ విడిచి వెళ్లిపోండి. ఏ ఫారిన్‌లోనైనా పాఠశాల నిర్వహించుకోండి అంటూ మైదుకూరు సెయింట్ జోసెఫ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌ను చిలంకూరు ఆలయ ప్రధాన అర్చకులు దుర్భాక సుబ్బ నరసింహశర్మ ఆవేదనతో కోరారు. తెలుగు మాట్లాడకూడదంటూ విద్యార్థుల మెడలో బోర్డులు ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేని ఆయన చిలంకూరు నుంచి మైదుకూరు పాఠశాల చేరుకున్నారు. అధికారులు విచారణ చేస్తున్న సమయంలో కార్యాలయ లోనికి ప్రవేశించిన శర్మ అధికారులకు సాష్టాంగ నమస్కారం చేశారు.

ాష్టాంగ నమస్కారం చేస్తున్న దుర్భాక సుబ్బనరసింహశర్మ... ఆవేదనను వ్యక్తం చేస్తున్న శర్మ

# అమ్మ భాషను అవమానించడం నేరం!

**– సహజకవి మల్లెమాల(ఎం.ఎస్.రెడ్డి)**

తెలుగు మాట్లాడే వారికొక ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న సంకల్పంతో యాభై ఎనిమిది రోజులు ఆమరణ దీక్ష సలిపి ఆత్మార్పణ గావించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. అద్వితీయమైన వారి త్యాగమే ఆంధ్రరాష్ట్ర అవతరణకు మూలం. ప్రజల భాషలోనే పరిపాలన సాగాలని, ప్రజలందరూ తెలుగులోనే మాట్లాడాలని వారభిలషించారు. ప్రభుత్వం అధికార భాషా సంఘం ద్వారా మాతృభాషాభివృద్ధికి కృషి చేస్తూనే ఉంది. అంతేకాకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా తెలుగు భాషా వ్యాప్తికి నిరంతరం కృషి చేస్తున్నాయి. మాతృభాషను విస్మరించిన ఏ దేశమైనా మృతదేహంతో సమానం.

"పచ్చిపాల నురగలా, పైరగాలి తరగలా, మలిన మింతలేనిది మన తెలుగు సంస్కృతి" అని నా అభిప్రాయం. తెలుగు ప్రజలు ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా అక్కడివారితో పాలూ నీళ్లలా కలిసిపోతూ మన భాష ప్రత్యేకతను ప్రాణసమంగా కాపాడుకుంటున్నారు. కొన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషకొక ప్రత్యేక శాఖను నిర్వహిస్తున్న సంగతి మనందరికీ తెలుసు. మన దేశంలోనైతేనేం, ఇతర దేశాలలోనైతేనేం సుమారు పదిహేను కోట్లమంది తెలుగువారున్నారన్నది ఒక అంచనా. 'దేశ భాషలయందు తెలుగు లెస్స' అని శ్రీ కృష్ణదేవరాయలంతటివాడు మన భాషను ప్రశంసించారు. విదేశీయులు సైతం తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ ' అన్నారు. వాళ్లలా అనడానికి కారణముంది. ఏమిటా కారణం ' జోల పాటకు కూడా లాలిత్వం నలంది విలువ పెంచెడు భాష తెలుగు భాష..ఒడిసెల రాయికి వడిబెంచు నేర్పును తెలియజెప్పెడు భాష తెలుగు భాష.. పడగెత్తి బుసకొట్టు పామును సైతము నిలువరించెడు భాష తెలుగుభాష..ఆకాశమార్గాన నరుగుగువ్వలనైనా అలరించగలభాష తెలుగుభాష.. పరువమెలికెడు కోయిల పాటలోన తీయదనమును మించిన తీయదనము పదపమ్మున వెదజల్లి ప్రాణికోటి అలసటను బాపగల భాష తెలుగుభాష! అంతేకాదు కోట్లాది హృదయాలు కొలువు కూటమ్ముగా ఇలనేలగల భాష తెలుగు భాష.. కవి గాయకుల పాలి కరదీపికగ నిల్చి వెలుగు జూపెడు భాష తెలుగు భాష..ఆవిరైపోయిన ఆశకు చిగురులు మొలిపించగల భాష తెలుగు భాష.. చలికాలమందు నులివెచ్చదనమును వెలయించగలభాష తెలుగు భాష.. పడుచు లేచుచు ఆగక పర్వుబెట్టు పిల్లవాగును గొంతెత్తి పిలిచి ఆపి మధుర మంజుల నాదాన హృదిని మీటి కలత తొలగించగల భాష తెలుగు భాష! ఇన్ని విధాలుగా ప్రఖ్యాతి గాంచిన తెలుగుభాష మీద జన్మత: ఆంగ్లేయుడైన సి.పి.బ్రౌన్ కడపలో నివాసమేర్పరచుకొని గొప్ప పరిశోధన చేశాడు. అలాంటి కడప జిల్లా **మైదుకూరు**లో ఒక కాన్వెంటు స్కూల్లో కొంతమంది పిల్లలు తెలుగులో మాట్లాడడం చూసిన ఇంగ్లీషు టీచరు

ఏదో కొంప మునిగినట్లు మండిపడి “I Never speak in Telugu” అని ప్లకార్డులు రాయించి ఆ చిన్నారుల మెడలో తగిలించిన సంఘటన తెలుగు ప్రజలందరినీ ఆశ్చర్యపరచింది. అంత దారుణానికి పాల్పడిన ఆ టీచర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించినా తప్పులేదని నా అభిప్రాయం. ప్రభుత్వం ఆ పాఠశాల గుర్తింపును తక్షణం రద్దు చేయాలని కోరుతున్నాను.

అంత తీవ్రమైన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి దారుణాలు కొనసాగుతూనే ఉంటాయనడానికి నిదర్శనంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్‌లోని పాఠశాలలో జరిగిన మరొక దారుణాన్ని పేర్కొనవచ్చు. ఈనాడు ఇంగ్లీషు ప్రపంచ భాషగా గుర్తించింది. అందువలన ప్రతి విద్యార్థి ఆ భాషను అభ్యసించవలసినదే. అంత మాత్రాన మన మాతృభాషను కించపరచడం మహాపరాధం. ఇప్పటికైనా కాన్వెంటు స్కూళ్ళలోని టీచర్లూ యాజమాన్యం, ఈ వాస్తవాన్ని గుర్తించకపోతే ముందు ముందు తీవ్రమైన శిక్షలకు గురికాక తప్పదు.

**–ఆంధ్రప్రభ దినపత్రిక,**
01–నవంబర్2009.

**కవిత**

## ఆంగ్ల ప్రదేశ్‌కి ప్రశ్నపత్రం!

*తెలుగు పిల్లలు తెలుగు మాట్లాడడం నేరం ?*
*బతుకుతెరువు ఆంగ్లంలో ఉండడం ఘోరం!*
*అమ్మని వృద్ధాశ్రమానికి పంపి*
*అమ్మభాషని పడమటి కబేళానికి పంపి*
*గుండె మువ్వల్లో దారాన్ని తెంపి*
*సృజన గువ్వల రెక్కలు చింపి...*
*ఈ భాషా బానిసత్వం ఎక్కడిది?*
*ఈ భావ దాస్య సంక్షోభం ఎప్పటిది?*
*ఏ సాంస్కృతిక విధ్వంసం దారిది?*
*సొంతంగా సొంతంగా ఆలోచిస్తే*
*వింతగా రోతగా చూస్తే*
*మనదీ బ్రతుకేనా?*
*మోచేతి నీళ్ళు త్రాగే బానిసతనంతో*
*మనదీ ఒక జాతేనా?*
*భాష కోసం జ్ఞానమా?*
*జ్ఞానం కోసం భాషనా?*
*ప్రజల భాషలో విద్యనేరమెలా అవుతుంది?*
*జనం భాషలో పాలన*
*హక్కెందుకు కాలేకపోతోంది?*

***పి.ఎస్. నాగరాజు,***
*ఉపాధ్యాయుడు,*
*శ్రీకాకుళం.*

# “తెలుగు తెలుస్తుంది..”

– వీరాజీ

ఎక్కడో కర్ణాటక రాష్ట్రంలో షిమోగా (శివమొగ్గ). అది కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప సొంతజిల్లా ! అక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ వారి బెంగుళూరు కేంద్రమయిన శబ్దన వారు మెథడాలజీ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ మీద ఏడు జాతీయ బాషలనుంచి రచయితల్ని భాషా వేత్తలని మొత్తం పదహారుమందితో ‘సరికొత్త పాత సాహిత్య పాఠాల్ని ఆంగ్లంలోకి అనువాదం చేయడానికి అనువాదశాస్త్రాన్ని ఎలా ఉపయోగించాలి’ అంటూ అక్టోబరు నెల 23, 24 తారీఖులలో సదస్సును నిర్వహించారు. పత్ర సమర్పణలన్నీ ఆంగ్లంలోనే. అక్కడి మొదటి సదస్సు అయ్యాక– మధ్యాహ్న భోజనం నిలబడి ఆరగించే విందు సభాస్థలి దగ్గరే పెట్టారు. కమ్మటి భాష కన్నడం (వినడం వరకే తెలుగు ) తియ్యని భాష (తెలుగు) అట్లాగే, కమ్మని భోజనం వాళ్ళది. శాఖాహారులే ఎక్కువ. పటపటలాడే కరకరమంటూ ఉండే బొబ్బట్టు –అక్కిరొట్టె (బియ్యం పిండి చపాతీ) వగైరాలని చూస్తూ (రుచి చూస్తూ ) వైట్ రైస్ కర్డ్ వుంటాయా? అనుకుంటూ గొణిగితే వెనుకనుంచి ‘అన్నం ఉంది..పెరుగు కూడా వుంది’ అంటూ గంభీరమైన కంఠం వినబడ్డది. ‘ వైట్‌రైస్ ’ అన్నది మనం ఇళ్ళలో అన్నం అనడానికి బదులు వాడేమాట–ఆ మాట నానోట విని చెంపమీద చెళ్ళున కొట్టారా? అనిపించింది. కన్నడ భాషాధ్యయనం చేసిన ఒక సాహిత్యవేత్త, ఆప్యాయంగా నవ్వాడు ‘మాకు తెలుగు తెలుస్తుంది’ అన్నాడు. ముందు రాత్రంతా రైళ్ళలో శయనించి తెల్లారేపాటికి యీ కన్నడ రాష్ట్ర మారుమూల పర్యాటక కేంద్రం చేరుకున్న తరువాత, మరి తెలుగు వినపడదు అనుకున్నాను. బెంగుళూరులో టాక్సీడ్రైవర్ తెలుగులో ‘చెప్పండి’ అన్నాడు. మనోహరమయిన తెలుగు మాట్లాడారు హోటల్స్‌లో.

రోడ్డువార మిగతా పత్రికలతోపాటు తెలుగు పత్రికలు పరచి కన్నుల పండువగా అగపడ్డాయి. ఓ గెడ్డాం సాయిబు అమ్ముతున్నాడు. వో పేపర్ అడిగాను. అట్లా తెలుగులో మన హైదరాబాద్ మహానగరంలో ఎన్నడూ అడిగిన పాపాన పోలేదు. నవ్వి నువ్వే తీసుకో అన్నట్లు సైగ చేశాడు. అచ్చా అంటూ తెలుగు పేపరు ఎత్తుకుని ఇదండీ సాయిబుగారూ అన్నాను. ‘చదువరాదు తెలుగు తెలుసు’ అన్నాడు. క్యామియా మై కహా హూం? అపనే గావ్‌మే? ఆంధ్రామే? అన్నాను. డబ్బులందిస్తూ‘ బెంగళూర్‌లో ఉండినవ్ బాబూ’ అన్నది జవాబు. షిమోగాలో పత్ర సమర్పణలన్నీ ఆంగ్లంలోనే గానీ కన్నడవేత్తలు జమాయించి ఉపోద్ఘాతం, ముక్తాయింపు– అంతా, చెవులకింపుగా ఉన్న కన్నడంలోనే సాగించారు. కన్నడ లిపి చాలావరకు తెలుగే. చదవడం మరీ సుళువు. షిమోగాలో ఓ చేతి వస్తువుల ప్రదర్శన దుకాణం ఉంది. అందులో ఏనుగంత వినాయక విగ్రహం ఉంది. ఏనుగంత ఉన్నాడీ వినాయకుడు ఎంత? అనంగానే, నవ్వేసి ‘ముప్పది తొమ్మిది వేల రూపాయలు’ అవుతుందండీ

అన్నదా అమ్మాయి, తెలుగులో స్పష్టంగా. నేను బెడవాడలోనా? షిమోగాలోనా? ఎక్కడున్నాను? హైద్రాబాద్‌లో తెలుగు మాట్లాడాలి అంటే చిక్కడపల్లి వర్తులం వదిలాక సాధ్యమవుతుందా? 'తెలుగు తెలుస్తుంది' అన్న తియ్యని మాట-తేట తెనుగు మాట ఎక్కడ వినపడుతోంది? వీరిది తెనుగు ఉద్యమంకాదు. వ్యావహారిక తెనుగు సంభాషణ. అందులో -ఉప్మాలో జీడిపప్పు పలుకుల్లాగ-అల్లంముక్కల్లాగ-ఇంగ్లీషు ఉర్దూ (పార్సీ, అరబ్బీ) పలుకులు మాట్లాడుతూ ఉంటే ఎంత హాయి? తేనెలొలుకు తెనుగుభాష ఆంధ్రావనికి అవతల కన్నడ రాజ్యలక్ష్మి (శ్రీనాథుడన్నట్లు) వొడిలో ఎంత హాయిగా ఉంది! కానీ, కడపజిల్లా **మైదుకూరు** సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూలు సంఘటన గురించి అక్కడ, వాళ్ళు వింటే- హవ్వ! నవ్విపోరూ? బెంగుళూరు లోనైతే సెయింట్ జోసఫ్ విద్యాలయం అని రాస్తారు,కన్నడంలో వాళ్ళు.

ఇట్లా తెలుగులోనే ఊపిరి పీలుస్తూనే తెలుగు పంచభూతాలలోనే నివసిస్తూ ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాల్ని నేర్వాలి- నేర్పాలి అన్న ఆశతోనే మనం పిల్లల్ని పంపాలి. వెంటనే వెర్రెత్తిపోయి, చిర్రెత్తి పోయి ఒక టీచర్‌ని లేదా ఒక విద్యాలయం నిర్వాహకుణ్ని శిక్షిస్తే చాలదు. అసలు వాళ్ళ దృక్పథం, తెలుగుపట్ల వాళ్ల ఆలోచనా సరళి మారితీరాలి. ఆవిధంగా కృషి చేయాలి పెద్దలు, ప్రభుత్వం. క్రైస్తవ మతానికి సంబంధించి అన్ని కీర్తనలు, సంకీర్తనలు తెనుగుభాషలోకి వాళ్ళు ఎందుకు మారుస్తున్నారు. అవసరం. అటువంటిదే ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లోనూ తెలుగుకోసం కలగాలి. తెలుగు పిల్లలకి దేశంలో లింకు -భాష-అనుసంధాన భాష అయిన ఇంగ్లీషు పాఠాలు చెబుతున్నాం, తప్ప వీళ్లని మతం మార్పిడి కోసం మాతృభాషావమాన దుశ్చేష్టల కోసం యిక్కడికి తల్లిదండ్రులు పంపడంలేదు అన్నది ఆంగ్లమాధ్యమ పాఠశాలల యాజమాన్యం గ్రహించాలి.

ఆటో వాడితో తెలుగు మాట్లాడగల ధైర్యం, షాపులో తెలుగులో అడిగే దమ్ములు లేని మనం థ్యాంక్స్ అనే బదులు ధన్యవాదాలు అనంగానే తెలుగు భాషోద్ధారకులం అయిపోయాము అనుకోకూడదు. రోడ్డు, షాపు, పెన్ను, స్టేషన్ పార్కు లాంటి పదాలకు నోరు తిరగని తెనుగు మాటల్ని సృష్టించుకోవడం తెనుగు ఉద్యమం కాదు. తెనుగు అంటే మన్నన, మర్యాద, గౌరవం పెరగాలి. అరసున్నాని నిండుసున్నాను వాడి అద్భుతాలు అనేకార్థాలు సృష్టించి, అందమైన విరుపులతో విన్నవాళ్లలో జాణతనం పోయే తెనుగు భాషాధ్యయనం ఒక హాబీగా చేయాలి. భాషాధ్యయనాన్ని పెద్దలు ఒక సత్కాలక్షేపంగా చేసిన రోజున పర్యాయపదాలు లేవు. సరైనమాటలు లేవు. అన్నభ్రమలు తొలగిపోతాయి. ద్వర్థి కావ్యాలను వ్రాయగల ప్రాచీన కవులున్న భాషలో అర్థశబ్ద పరిమితి ఉన్నది అనుకోవడం అమాయకత్వం. మిగతా సంగతులు ఎట్లా ఉన్నా ఇవాళ సినిమాలే ప్రాంతీయ భాషలను ప్రాచుర్యంలోకి తెస్తున్నాయి. అది చాలదు.

లెట్ దేర్ ది బ్రిడ్జెస్ బిట్‌విన్ ఆర్ట్స్ అండ్ హార్ట్స్. *

# తెలుగు గళాలకు సంకెళ్లు

**-పడాల్**

తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది అంటూ ఆపాత మధుర గీతాన్ని మరొక్కసారి మనసారా పాడుకొనే పరిస్థితి ఉందా? **మైదుకూరు** మిషనరీ పాఠశాల విద్యార్థుల మెడల్లో వేలాడదీసిన పలకలు ఏం చెబుతున్నాయి. అంతా చదివాక కూడా మా తెలుగు తల్లికి మల్లె దండలు వేసి, మా కన్న తల్లికి మంగళారతులు పట్టే అవకాశం మనకింకా మిగిలే ఉందనుకొందామా? అసలు ఇదంతా ఎందువల్ల జరుగుతోంది? ఎన్నాళ్లుగా రగులుతోంది. తెలుగు నేలపై తెలుగు మాట్లాడడమే నేరమా?

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడపిల్లలు బొట్టు పెట్టుకొంటే, గాజులు తొడుక్కుంటే ఆంగ్ల బడుద్దాయిలకు ఉలికిపాటెందుకు? అదేమన్నా అపరాధమా? ఎవరిదీ పాపం ఎందుకు శాపం? ఏ ఇద్దరు తెలుగువాళ్ళు కలుసుకున్నా వచ్చీరాని ఆంగ్లంలోనో, తెలిసీ తెలియని హిందుస్థానీలోనో, మరేదైనా పరాయి భాషలోనో మాట్లాడుకొంటారన్న విమర్శల్లో వాస్తవం పాలు కొంచెం ఎక్కువే. తెలుగులో మాట్లాడుకొంటే చుట్టుపక్కలవారు చులకనగా చూస్తారేమోనని వారు అనుకొంటూ ఉండవచ్చు. ముఖ్యంగా ఆంగ్లంలో సంభాషించుకొంటే తమ స్థాయి ఒక్కసారిగా పెరిగిపోతుందని భ్రమపడుతూ ఉండవచ్చు తెలుగులో బాగానే మాట్లాడగలిగినా- మాతృభాషలో చక్కగా నాలుగు ముక్కలు రాయలేనివారు, రాయరానివారు, తెలుగులో రాయడమంటేనే నామోషీగా భావించే మేధావులు మన మధ్యలో ఎందుకు లేరు? ఏ ఇంగ్లీషు వాళ్ళో, ఉత్తర భారతీయులో తెలుగులో మాట్లాడుకోవడం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడం, ఎవరైనా ఎప్పుడైనా విన్నారా, కన్నారా? నిజం చెప్పాలంటే, మాతృభాషను మృతభాషగా మార్చే ప్రక్రియ తెలుగువారి ఇంటినుంచే మొదలవుతోంది. బిడ్డ నోరారా అమ్మా అని పిలిచినప్పుడు ఎదకు హత్తుకుని ముద్దాడాల్సిన తల్లి-అమ్మో అంటూ గుండెలు బాదుకుంటోంది. మమ్మీ అని పిలవాలిరా కన్నా అంటూ అమ్మ భాషను మమ్మీకరిస్తోంది. అమ్మ-జీవనాదం, జీవనవేదం, మమ్మి వట్టి శవం, మమ్మీ అనేది అమ్మకు సమానార్థకం ఎలా అవుతుంది? ఆంగ్లంలో రంగరించిన ఉగ్గుపాలు, ఆంగ్లంలోనే అన్నప్రాసన, బుడిబుడి అడుగుల్లో అణువణువున ఆంగ్ల సవ్వడులు...

దీపాలు వెలిగించాల్సిన పుట్టినరోజు- హ్యాపీబర్త్‌డే అంటూనే దీపాలు ఆర్పడం... ఏమిటిదంతా?అమ్మ ఎంతైనా అమ్మే మరి ఆమెలో ఇలాంటి మార్పు ఎందుకు? తెలుగు వాచకానికి చెద పట్టింది. కనుకే, బిడ్డకు ఆంగ్లమైనా అక్కరకు రాకపోతుందా అన్నం పెట్టకపోతుందా అన్న ఆశ తప్ప అమ్మలో ఎలాంటి స్వార్థాన్ని చూడలేం. అయినప్పటికీ పరిస్థితి ఇంతలా దిగజారే క్రమంలో ఆమె కీలక పాత్రధారిగా మారడం ఎంత దురదృష్టకరం చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా... అనేది కొన్ని దశాబ్దాలనాటి స్ఫూర్తిగీతం. చెయ్యెత్తుతున్న

తెలుగోడు–ఎవరికి జైకొట్టాలో తెలియక భాష మొహం మీద చాచి కొడుతున్నాడు. ఇది నేటి నిజం! చూస్తుంటే తెలుగు పదాల మాటను సాధ్యమైనంత వరకు ఆంగ్లంలో అనువదించి చెప్పడానికే ఇష్టపడుతున్నాడు. తప్పుడు అన్వయాలైనా, తప్పదు కదా అన్నట్లుంది వాలకం! ఇంగ్లీషు మరీ మితిమీరుతోందని ఎవరైనా అంటే ఆదుకోవడానికి సంస్కృతమో, ఉర్దూనో ఉండనే ఉన్నాయి.

అసలు తెలుగు వర్ణమాల క్రమేపీ రంగు కోల్పోతుంది. తెలుగు అక్షరములు యాభై ఏడు అని ఏ పెద్దబాలశిక్షలోనో చదువుకోవడమే తప్ప వాస్తవానికి అనేక అచ్చులు, హల్లులు ఎప్పుడో అదృశ్యమైపోయాయి. ముమ్ముందు ఎన్ని మిగులుతాయో చెప్పలేం. బహుశా అందుకేనేమో..తెలుగు భాష మనుగడే ప్రమాదంలో పడిపోతోందంటూ అంతర్జాతీయ నివేదికలు ఘోషిస్తున్నాయి. కట్టెదుట కనబడుతున్న దృశ్యాలు అదే పరిస్థితిని ఆవిష్కరిస్తున్నాయి.

నాలుగైదేళ్ళ పిల్లలకోసం ఉద్దేశించిన తెలుగు వాచకాల్లో పది, పదకొండో తరగతుల వారు సైతం పలుకలేనంత కఠిన పదాలు, ఇకపై తరగతి సైన్సు పాఠ్యపుస్తకాల్లో సకశేరుకాలు, అకశేరుకాలు, శిలీంధ్రాల వంటివెన్నో! అవన్నీ తెలుగే అనుకోవాలన్నమాట! ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి, వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్న తెలుగు ప్రకటనలు – భాషా భ్రష్టత్వానికి పరాకాష్టగా నిలుస్తుంటే – పట్టించుకొంటున్నదెవరు? బస్సులపై తెలుగు అంకెలు రాసి, అదే భాషోద్ధరణ అన్నారు, కొన్నేళ్ల క్రితం. ఆ అంకెలేమిటో ఏ బడిలోనైనా విద్యార్థులకు నేర్పే ప్రయత్నంచేశారా?

ప్రాచీన భాషగా తెలుగు గుర్తింపు పొందడానికి జరుపుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్న మాట నిజమే. కానీ, వర్తమాన భాషగా దీని స్థాయి గురించి ఎవరూ ఆలోచించరేం? మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించి అయిదు దశాబ్దాలు గడిచాయి. ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళి తెలుగులో దరఖాస్తు సమర్పిస్తే, స్వీకరిస్తారేమో చూడండి! ప్రభుత్వ కార్యకలాపాలన్నీ ఆంగ్లంలోనే కొనసాగుతున్నాయి. అంతెందుకు సాక్షాత్తు శాసనసభ సమావేశాల్లో తెలుగు వినిపించేది అంతంతే!

'యథా రాజ తథా ప్రజా' అన్నది పాతమాట అని యథా ప్రజా తథా రాజ అన్నది కొత్త బాట అని చెప్పుకోవడానికైతే బాగానే ఉంటుంది. కానీ, నిజం మాత్రం అది కాదు రాజాదరణ దక్కని భాషకు మనుగడ ఎక్కడ? ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులు కనుక, జనమే తమ భాషను బతికించుకోవాలనడంలోనూ సత్యం లేకపోలేదు. అయినా –ప్రజల భాష చెల్లదన్నట్లు ప్రజల చేత ఎన్నికైనా మారాజులే ప్రవర్తిస్తుంటే వారేం చేయగలరు?

తెలుగు చదువుల వల్ల లాభం లేదని, ఆంగ్లమాధ్యమంలో చదువువుంటే తప్ప ఉన్నతస్థాయికి ఎదగడానికి తమ పిల్లలకు అవకాశం ఉండదని తల్లిదండ్రులు భావించడానికి కారణం–నిశ్చయంగా ప్రభుత్వ భాషా ద్రోహమే. సర్కారు స్వయంగా ఒకటో తరగతి నుంచే

ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నపుడు విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం భిన్నమైన దారిలో ఎందుకెళతారు? తమ పిల్లలు ధారాళంగా ఆంగ్లంలో మాట్లాడాలని కోరుకుంటున్న చాలామంది తల్లిదండ్రులు– ఇళ్ళలో సైతం వారిని తెలుగులో మాట్లాడనివ్వని సందర్భాలు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు వారి మనసెరిగి మసులుతున్నాయేమో!

తెలుగు మాధ్యమంలో చదువుకొన్నవారికి పైచదువుల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, వృత్తి విద్యాకోర్సుల్లోనూ సీట్లు ప్రత్యేకిస్తామని ఉద్యోగాల్లో అగ్రతాంబూలం వారికేనని ప్రకటించే కలేజా సర్కారుకు ఉందా? కనీసం పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లోనైనా దీన్ని అమలుపరిచేందుకు పాలకులు సిద్ధమేనా? ప్రభుత్వం మెడలు వంచైనా సరే, తెలుగుకు ప్రత్యేక గౌరవం సాధిస్తామని, తద్వారా మాతృభాషను పరిరక్షించుకొంటామని భాషాభిమానులు ఇప్పటికైనా ముందుకు వస్తారా? ఈ విషయంలో తెలుగు వారిని మేల్కొల్పడానికి **మైదుకూరు** వంటి సంఘటనలూ ఇక ముందు జరగాలా?!

**–ఈనాడు దినపత్రిక**

**తల్లిభాషే ఆయుధం** **కవిత**

*అమ్మవంటి మన మాతృభాషను*
*వేలెత్తి చూపేందుకు ఎంత ధైర్యం?*
*మన భాషను మన నోట పలికితే మనకెందుకు శిక్ష?*
*మనం మొట్టమొదటగా పలికే మాట అమ్మ*
*ఎన్ని భాషలు నేర్చినా కష్టసుఖాల్లో మాట్లాడేది ,*
*ఆలోచనలు చేసేది తల్లి భాషలోనే!*
*మధురామృతమైన భాష మనతో ఉండగా*
*ఎందుకు మనకు చింత అని అనుకుంటాం*
*మనస్సులో ఉండే భావాలను కాగితంపై పెట్టాలంటే*
*మంచి ఆయుధం మన తల్లిభాష.*
*అందుకే, తిలక్ కవిత్వ నిర్వచనం*
*తెలుగు అక్షరాలకు తగిన సిద్ధాంతం*
*మా తెలుగు అక్షరాలు*
*కన్నీటి జడులలో తడిసిన దయాపారావతాలు*
*మా తెలుగు అక్షరాలు*
*వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు*
*ప్రతి ఉదయం మనల్ని జాగృతపరిచే ముత్యాల కోవలు*
*తెలుగు అక్షరాలను పలికితే శిక్ష అన్నది ఏ పక్షులో?*
*తెలుగు తేనెయగునన్న వాక్యం*
*కావాలి జగతికంతా మధుర నినాదం*
*జన్మజన్మలకు తెలుగువాడై పుట్టాలన్నారు*
*ఆనాటి కవులు!*
*ఎన్ని జన్మలెత్తినా*
*తెలుగే నా తల్లిభాష కావాలంటున్నాను,*
*ఈనాడు నేను!!*
*అయినా వీళ్ళ పిచ్చిగాని*
*తెలుగు భాష మాట్లాడకుండా*
*తెలుగు వారు బ్రతకగలరా?*
*తెలుగు పలకవద్దని ఆంక్షలు విధిస్తే*
*నోరున్నా మూగజీవులుగా మారుతారు ఎందరో*
*తెలుగులో ఆలోచించవద్దంటే*
*నిర్లిప్తులై బ్రతుకీడుస్తారు, ఉత్సాహాన్ని కోల్పోతారు*
*తెలుగు వాడై పుట్టినందుకు*
*గర్వపడవోయి తెలుగు వాడా,*
*మన భాష*
*గొప్పదని చాటుదాం నలుమూలలా!!*

***– కె. అనూష,***
*బి.ఎ. రెండవ సంవత్సరం,*
*సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల,*
*కొత్త గూడెం.*

# తెలుగు భాష–చారిత్రక సృష్టి

–తెలకపల్లి రవి

**'ప్రాంతాలు వేరైనా,**
**మన అంతరంగమొకటేనన్నా**
**యాసలు వేరే అయినా**
**మన భాష తెలుగు భాషన్నా**
**వరాల తెలుగు ఒకటేనన్నా..'**

సినారే పాటలూ, కవితలూ రెండూ ప్రత్యేక ప్రాధాన్యత కలిగినవి. అందులో ఒకటి పైన పేర్కొన్న పాట తల్లాపెళ్ళామా చిత్రం కోసం రాసింది. మరొకటి పైనున్న మంచు కరిగినా పర్వతం మాసిపోదు అంటూసోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత సోషలిజం భవిష్యత్తు గురించి రాసింది.) దీనిలోని భావానికి ఇపుడు ఆయన కూడా పెద్దగా కట్టుబడినట్లు కనిపించదుగాని ఆయన గజల్‌లో చెప్పినట్లే మంచు కరిగినా దానిలోని మహోన్నత సత్యం పర్వత శిఖరంలా నిలిచే వుంటుంది. వచ్చిందు, వచ్చాదు మాత్రమే కాక రాయలసీమలో వలె వచ్చినాడు కూడా ఈ జాబితాకు జోడించి చూసినా అన్నీ తెలుగు తెరగులే. వెలుగు జిలుగులే. ఇందులో ఏది ఎక్కువ ఏది తక్కువ అన్న ప్రసక్తి ఉండదు. ఉండకూడదు. ఈ రాష్ట్రంలో వివిధ భాషా మండలాలకు వాటివైన పదాలున్నాయి. అర్థాలు అపార్థాలూ ఉన్నాయి.

భాష జనజీవితంలో భౌగోళిక రేఖలలో ఆర్థిక సామాజిక రాజకీయ పరిణామాల క్రమంలో పెంపొందుతుంది. ఒకే లాంటి పిల్లలను తలోచోట పెంచితే తలో విధంగా మాట్లాడతారు. వారి యాసలే కాదు భాషలు కూడా మారొచ్చు. అంత మాత్రాన వారి బాతృబంధాలు మటు మాయమై పోవు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలలోనూ వాటి వాటి చరిత్ర పరిమాణాన్ని బట్టి ఇరుగుపొరుగు ప్రాంతాల ప్రభావాలను బట్టి పదాలు ఉచ్చారణలు ఉంటాయి. తెలుగు, ఆంధ్రము, తెనుగు ఇవన్నీ ఒకే భాషకు ఉన్న పేర్లు తప్ప వేరే కాదు. ఇందులోనూ ఆంధ్రము అన్న పేరు ప్రాచీనమైందంటారు. తెలంగాణ పదంలోనూ ప్రధానంగా ధ్వనించేది తెలుగే. కనుక తర్వాతి రాజకీయ పరిణామాలను బట్టి ఆంధ్ర , తెలంగాణా, రాయలసీమ భాషలు ఉన్నాయని చెప్పుకోవడం అశాస్త్రీయం, అచారిత్రకం. అవిభక్త మద్రాసు రాష్ట్రంలో వున్న తెలుగు నాట తమిళ ప్రభావం చాలా ఉంటుంది. ఒరియా, హిందీ,కన్నడ భాషల ప్రభావంతోపాటు తెలుగును తొక్కిపట్టి రాజభాషగా చలామణి అయిన ఉర్దూ ప్రభావం కూడా విశేషంగా వుంటుంది.

ఇంతకూ ఉర్దూను రుద్దిన నిజాం నిరంకుశుడే గాని ఆ భాష మాత్రం అచ్చమైన భారతీయ భాష. కన్నడ రాజ్య రమారమణుడైన కృష్ణ దేవరాయలు ఆంధ్రభోజుడు కూడా

అయ్యాడు. ఇంగ్లీషు వారి పాలన సాగిన సర్కారు జిల్లాల్లో అది మరోవిధంగా ఉంటుంది. ఇవన్నీ చాలా సమగ్రంగాను సంయమనంతోను అర్థం చేసుకోవలసిన అంశాలు (ఇదే రాష్ట్ర సరిహద్దులలో గిరిజన తెగల ప్రజల పరిస్థితి ఇంకోలా ఉంటుంది.) ఇందులో ఏది ఎక్కువ ఏది తక్కువ అన్న మీమాంస అర్థంలేనిది.

ఎవరు ఎవరి మాండలికాల్ని అపహాస్యం చేసినా పొరబాటే. కులసంస్కారాలు ఎవరో ఎక్కడో ఏదో చేస్తే దాన్ని ప్రజా సమూహాల మధ్య వైరుధ్యంగా, ఘర్షణగా చూపించడం అనవసరం. ఇవన్నీ ఉన్నా తెలుగు పిల్లలు చదువుకుంటున్నారు. తెలుగు సినిమాలు, మీడియా అందరినీ అలరిస్తున్నాయి. అంగీకారయోగ్యమైన సంస్కారవంతమైన సామాజిక, వ్యవహార శైలిని మనం కొనసాగించుకోగలుగుతున్నాము.

రాజకీయ రాజ్యాంగ నిబంధనలు కూడా పొందుపర్చుకున్నాము. రాజకీయాల చర్చను భాషా చర్చగా మారుస్తున్న వారి ప్రయోజనా లేమిటో కూడా ఆలోచించవలసిందే కానీ చరిత్ర ఏనాడో పరిష్కరించింది. కనుక రాజకీయ అవసరాల కోసం వాటిని మళ్ళీ మళ్ళీ తిరగదోడుకోవడం అనుచితం.

ఈ భాషా పరమైన ఫర్మానాల సంగతి ఇలా ఉంటే తెలుగు మాట్లాడినందుకు జుల్మానాలు విధించే స్థితి మరోవైపున వెక్కిరిస్తోంది. రాష్ట్రావతరణ వేడుకల తరుణంలోనే ఒక పాఠశాలలో తెలుగు మాట్లాడ బోనంటూ పిల్లల మెడలో బోర్డులు వేలాడదీయించిన ఉదంతం తెలుగు బిడ్డలైన వారందరికి కనువిప్పు. పెను హెచ్చరిక. ఇంగ్లీషు వ్యామోహం ఆధిపత్యం శ్రుతి మించి ఆఖరుకు తెలుగు నేలమీద తెలుగుకే చోటు లేకుండా చేస్తున్న దిగ్భ్రాంతికరమైన స్థితి. సర్కారు కూడా తలా తోక లేని రీతిలో ఇంగ్లీషు మీడియంను ఏకపక్షంగా రుద్దుతున్న స్థితిలో ఇది మరోలా ఉంటుందని ఊహించలేము.

ప్రాచీన హోదాను సాధించుకోవడమే ఘనతగా చాటుకున్న తర్వాత ఆధునిక దిశలో పురోగమించ లేకపోతున్న వైఫల్యానికి ఇది తార్కాణం. తెలుగు ఒకటేనా, అనేకమా. ఇందులో ఏది అసలైంది, నకిలీది అని తర్జనభర్జనలు పడుతుంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ భూతం అసలు ఆ తెలుగునే తెరమరుగు చేస్తున్నది.

రాజకీయంగా ప్రపంచీకరణ ప్రైవేటీకరణలపై పోరాటం పక్కకు పోయి ఇతర వైరుధ్యాలు ముందుకు వచ్చినట్టే ఇది కూడా జరుగుతుంది. తెలుగుకు ఎదురవుతున్న అసలు ముప్పును గాక అదే భాషలో విభిన్న ప్రయోగాలపై తర్జనభర్జనలు ప్రధానమవడానికి దారితీయొచ్చు.

మాతృభాషలో ప్రాథమిక విద్య పరిపాలన అన్నవి ప్రజాస్వామిక అవసరాలు. ఆ మాతృభాష తెలుగు తప్ప మరొకటి కాదు. కనక మాండలికాల చర్చతో తెలుగు మూలాలనే కాపాడుకోలేని స్తితి తెచ్చుకోదగదు. తెలుగు తల్లి పాటను ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం చేసి చూడడం వాస్తవమూ కాదు.

గలాగలా గోదావరి బిరబిరా కృష్ణమ్మ, మల్లమ్మ పతిభక్తి, రుద్రమ్మ భుజశక్తి,

తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయుల కీర్తి అన్న ఆ పాటలోని చరణాలు తెలుగు నేలకంతటికీ వర్తించేవే. అయినా దానిపై తర్జనభర్జనలతో తెలుగు భాషను కాపాడుకోవలసిన అవసరాన్ని విస్మరిస్తే అందరికీ నష్టమే.

తెలుగులో మాట్లాడినందుకు **మైదుకూరు**లోని ఒక పాఠశాలలో 'తెలుగులో ఎప్పుడూ మాట్లాడను' అని రాసిన పలకలను పిల్లల మెడలో తగిలించారు. ఈ మధ్య ఈ వార్త రాష్ట్రంలో సంచలనం రేపింది. తెలుగు రాష్ట్రంలోనే తెలుగు భాషకు జరిగిన అవమానం పట్ల ప్రజలు క్రోధం వెలిబుచ్చారు. బాధపడ్డారు. సమంజసమైన క్రోధమే. మాతృభాషలో మాట్లాడినందుకు గాను శిక్షనెదుర్కొవాల్సిన పరిస్థితి మనం సహించాల్సి వస్తోంది. భాషాభిమానులందరికీ బాధ కలిగించే సంఘటన ఇది, కానీ ఈ సంఘటన ఆ పాఠశాలకే పరిమితమైనదా? రాష్ట్రంలో మరే బడిలోను లేదా? అసలు సమస్య అదేనా?

తెలుగు తప్ప మరో భాష రాని పసికందులను ఇంగ్లీషులో చదువుకోవాలనే.. మాట్లాడాలనే శిక్ష వేస్తున్నారు. ఎందుకు వాళ్ళకి శిక్ష? ఎవరు వేస్తున్నారీ శిక్ష?

**–ప్రజాశక్తి దినపత్రిక,**
1 నవంబర్, 2009.

**ఆశయాలకు పాతర** **కవిత**

*ఇది యావదాంధ్రకు చెంపపెట్టు*
*మానవత్వలోపమా?*
*తెలుగుమీద కోపమా?*
*తెలియదు వారికి?*
*గ్రహించలేరెప్పటికి?*
*తెలుగుతల్లీ మమ్ము మన్నించు*
*అవమానం కాదది–*
*క్షమించరాని అపచారం*
*దేశభాషలందు తెలుగులెస్సయని*
*రాయలంటే*
*ఆంగ్లభాషే బహుబాగని*
*వీళ్లంటారు.*
*నిప్పుకు గాలిలా మౌఢ్యానికి*
*భాషా వ్యామోహంతో*
*కూరుకుపోతున్నారే ఆంగ్ల ఊబిలో...*
*మునిగిపోతున్నారే,*
*పడమర కడలిలో...*
*తెలుగు పల్లెలకు వీస్తోంది*
*పడమటి భాషాగాలి*
*మైదుకూరు సుడిగాలులనుండి*
*ఎదురు నిలవాలి*
*ప్రతి తెలుగు గుండె గూడు*
*ఇది భాషా సమస్యకాదు*
*తెలుగుజాతి మనోభావాల అగ్గిబరాటా*

***–దాసుల ప్రకాశం,***
*బీఎస్సీ,*
*గౌతమీ కళాశాల.*
*నర్సాపురం,*
*ప.గో. జిల్లా*

# ఆంధ్రజనసంఘం పునరుద్ధరించుకుందామా?

**-డా॥ దేవరాజుమహారాజు**

అది నవంబర్ 11, 12వ తేదీలు 1921 సంవత్సరం హైదరాబాద్ గౌలిగూడలోని వివేకవర్ధిని ప్రాంగణం! అక్కడ హిందూ సంఘ సంస్కార మహాసభలు జరుగుతున్నాయి. వక్తలు, ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ బాషలలో ఉపన్యసిస్తున్నారు. కొందరు తెలుగు వారు కూడా ఉర్దూ, ఇంగ్లీషులలో ఉపన్యసించారు. ఈ సభలకు కార్వే పండితుడు అధ్యక్షుడు ఒక సమావేశానికి సరళాదేవి చౌధురాణి కూడా అధ్యక్షతన వహించారు. ఆనాడు ఉర్దూ రాజభాష, ముస్లీంలు, హిందువులు ఉర్దూ మాట్లాడేవారు. మహారాష్ట్రీయులు హైదరాబాద్ నగరంలో ఎక్కువ సంఖ్యలో ఉండేవారు గనుక, చాలా చోట్ల మరాఠీ ఎక్కువగా వినబడుతూ ఉండేది. ఉన్నత చదువులు చదివి, ఇంగ్లీషు నేర్చుకున్నవారు ఇంగ్లీషు కూడా మాట్లాడేవారు. ( ఏభాషకు ఆ భాష మాట్లాడేవారు. అంతేగాని ఇప్పటిలాగా అన్నీ కలగలిపి మాట్లాడడం ఉండేది కాదు.) ఆ విధంగా రెండు రోజులు జరిగిన మహా సభలలో వక్తలందరూ ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ భాషలలో ప్రసంగించారు. అధ్యక్ష స్థానంనుంచి మాట్లాడి తీర్మాణాలు ప్రవేశపెట్టిన కార్వే పండితుడు మరాఠీలోనూ, ఇంగ్లీషులోను మాట్లాడేవారు. దానితో చాలామంది తెలుగు వారు మనస్థాపానికి గురయ్యారు. విషయం అర్థం కాక కొంత, తెలుగువారు అధికసంఖ్యలో ఉన్న చోట ఎవరూ తెలుగు మాట్లాడక పోవడటమేమని కొంత ఆవేదనకు గురయ్యారు.

సభ జరుగుతూ ఉండగా మధ్యలో ఒక తెలుగువాడు, వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆలంపల్లె వెంకటరామారావు లేచి ఒక తీర్మాణంపై తెలుగులో ఉపన్యసించడం ప్రారంభించారు. అంతే! సభలోని మహారాష్ట్ర శ్రోతలు ఈలలు వేసి గోల చేశారు. చప్పట్లు చరిచి ఆటంకం కలిగించారు. తెలుగు ఉపన్యాసం ఆపాలని పట్టుబట్టారు. హేళనగా మాట్లాడారు. గత్యంతరం లేక ఆ న్యాయవాది ఉపన్యాసం ఆపి కూర్చుండిపోయాడు. ఆ సంఘటనతో తెలుగు వారి రక్తం ఉడికిపోయింది. కాసేపు వేదికకు వెన్నుచూపి నిరసన తెలిపారు. నిరసనలోని భాగంగానే సభలోంచి మధ్యలోనే వెళ్ళిపోయారు. తమకు, తమ భాషకు అవమానం జరిగిందని బాధపడ్డారు. ఒక రకంగా తెలుగు వారికి ఆ సంఘటన కనువిప్పు కలిగించింది. తమ భాషా సంస్కృతులను తామే రక్షించుకోవాల్సిన అవసరాన్ని వారు గుర్తించారు. ఉన్నపళంగా ఆ రోజు రాత్రే ఆంధ్రజనసంఘం స్థాపించుకున్నారు. నవంబర్ పన్నెండు,1921 రాత్రి ఎనిమిది గంటల సమయం ట్రూప్ బజారులో హైకోర్టు న్యాయవాది టేకుమల్ల రంగారావు ఇంట్లో పదకొండు మందితో ఒక సమావేశం జరిగింది. వారు 1. టేకుమల్ల రంగారావు, 2. మిట్లా లక్ష్మీనరసయ్య, న్యాయవాది, పచ్చబావి. 3.ఆదిరాజు వీరభద్రరావు న్యాయవాది, ఆకుల బజారు సికింద్రాబాదు, 4. నడిపల్లి

జానకిరామయ్య, రెసిడెన్సీ బజారు. 5. మందుముల నరసింగరావు, కిషన్‌గంజ్ 6. బూర్గుల రామక్రిష్ణారావు, కిషన్‌గంజ్ 7. కొమ్మవరపు సుబ్బారావు రెసిడెన్సీ బజారు, 8. బూర్గుల నరసింహారావు, కిషన్‌గంజ్9. డాక్టర్ పందిట వెంకటస్వామి నాయుడు, ట్రూప్ బజార్, 10 బొయినేపల్లి వెంకట రామారావు, గౌలిగూడ, 11. మాడపాటి హనుమంతరావు న్యాయవాది, ట్రూప్‌బజార్. ఈ సమావేశంలో నాలుగు తాత్కాలిక అంశాలు చర్చకు వచ్చాయి. అందులో ముఖ్యమైన ఒక అంశం ఇలా ఉంది.

పుట్టుకవల్లగాని, స్థిరనివాసం వల్లగాని హైదరాబాద్ రాజ్యంలోని ఆంధ్రులంతా ఈ సభలో చేరవచ్చు. వీరి వయసు 18 సంవత్సరాలకు మించి ఉండాలి. ఒకటి రెండు సమావేశాల తర్వాత ఆంధ్రజన సంఘాన్ని నిజాం రాష్ట్రాంధ్రజన సంఘం అని కూడా వ్యవహరించారు. ఇది ఆంధ్రాభ్యుదయ వ్యాప్తికి పనిచేసింది. రాష్ట్రంలోని ఎన్నో ప్రాంతాలలో ఇవి ఎన్నో మంచి పనులు చేపట్టాయి. అందులో పరిశోధన మండలి కూడా ఒక్కటి.

ఈ సంఘాల కార్యక్రమాలు ఎక్కువై విశాలమైన ప్రాతిపదికన పనిచేస్తున్నపుడు అన్నింటినీ సమన్వయ పరచుకొని, నిర్ణయాలు తీసుకోవడానికి ఒక కేంద్ర సంఘం అవసరమయింది. అందువల్ల 1923 ఏప్రిల్ ఒకటిన హనుమకొండలో ప్రముఖులంతా సమావేశమై ఆంధ్రజన కేంద్ర సంఘాన్ని ఏర్పరచుకున్నారు. 1. మాదిరాజు రామకోటేశ్వరరావు, 2. కొమ్మవరపు సుబ్బారావు, 3.కొండా వెంకట రంగారెడ్డి, 4 వొద్దిరాజు వెంకటేశ్వరరావు లాంటి ప్రముఖులు చొరవ చూపడం వల్ల అది సాధ్యమైంది.

ఆరోజు సాయంత్రమే వరంగల్ మట్టెవాడలో బహిరంగసభ జరిగింది. ఆంధ్రజనసంఘాలు తప్పనిసరిగా చేయాల్సిన పనులను కేంద్ర సంఘం నిర్ధేశించడమైనది.

1.గ్రంధాలయాలు, పఠన మందిరాలు, పాఠశాలల స్థాపన

2. విద్యార్థులకు సహాయం-ప్రోత్సాహం

3.విద్యాంసులను గౌరవించడం

4. తాళపత్ర గ్రంథాలు, శాసనాలు సంపాదించి పరిష్కరించడం

5. కరపత్రాల ద్వారా, చిన్నచిన్న పుస్తకాల ద్వారా, ఉపన్యాసాలద్వారా విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం.

6. ఆంధ్రభాషా ప్రచారానికి కావల్సిన ప్రయత్నాలు చేస్తూ ఉండడం.

7. వ్యాయామం, క్రీడలు, కళలు అభివృద్ధి పరచడం.

8. అనాథలైన వారికి అత్యవసర సహాయం అందించడం, ( పై విషయాలన్నీ 1949లో ఆంధ్ర పితామహ, పద్మభూషణ్ డాక్టరు మాడపాటి హనుమంతరావు రాసిన తెలంగాణా ఆంధ్రోద్యమంలో ఉన్నవి. 1995లో తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆ గ్రంథాన్ని పునర్ముద్రించారు.)

ఈ నవంబర్‌లో ఈ విషయాలన్నీ మళ్ళీ ఒకసారి ఎందుకు నెమరు వేసుకోవాల్సి వస్తున్నదో అందరూ ఆలోచించాలి. ఆచరణలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో ఒకసారి బేరీజు వేసుకోవడానికి కూడా ఈ విషయాలు పనికొస్తాయి. మనం ఏర్పరచుకున్న గ్రంధాలయాల్నే మనలో ఎంతమంది ఉపయోగించుకుంటున్నారూ? పాఠశాలల్లో తెలుగుకు ఎంత ప్రాధాన్యత ఉంది? విద్వాంసులు అణగదొక్కబడి, పైరవీకార్లు గౌరవించబడడం లేదా? టి.వి. మాధ్యమం విస్తరించిన నేపథ్యంలో తెలుగు స్వరూపం ఎంత మారింది. స్థాయి ఎంత తగ్గింది? రాజకీయనాయకులు పనిగట్టుకుని భాషా సాహిత్యాలపైన, సంస్కృతిపైన దాడి చేస్తూ ఉండడం ఎంత వరకు సబబు? వీటన్నిటిని తీవ్రంగా చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. ఎనభై ఎనిమిదేళ్ళ క్రితమే తెలుగువాడి పౌరుషం బయటపడింది. ఆంధ్ర జనసంఘంగా ఏర్పడి విస్తరించింది. ఆస్ఫూర్తి, ఆ పౌరుషం ఈనాడు ఏమయ్యాయి? తెలుగుకు ప్రాచీన హోదా సాధించుకున్న తర్వాత కూడా మనం దాన్ని గౌరవాన్ని నిలుపుకోలేకపోతున్నామా? ఆలోచించుకోవాలి.

కడప జిల్లా **మైదుకూరు**, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లలోని పలు పాఠశాలల్లో తెలుగుకు జరిగిన అవమానానికి ఉలిక్కిపడాల్సిన పనిలేదు. ఎన్నో చోట్ల ఎన్నో సార్లు ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి. ముందు మన ఇళ్ళలో మన స్వచ్ఛమైన తెలుగు తీయదనాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నామా? ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన తరుణమిది. ఏదో మొక్కుబడిగా బడిలో ఒక తెలుగు గీతం పాడించినంత మాత్రాన సరిపోతుందా? తెలుగుస్ఫూర్తిని అందించగలుగుతామా? ఆలోచించాల్సిన విషయం. తెలుగు భాషా సంస్కృతులను కాపాడుకోవడంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలి. అంతేకాని, వారి వారి రాజకీయ ధృక్పథాలతో రంగుకళ్ళద్దాలతో చూస్తూ వీటిని నాశనం చేయొద్దు. ఎంతోమంది త్యాగమూర్తుల త్యాగ నిరతికి ఫలితంగా ఇవి మనకు దక్కాయి. వాటిని కాపాడుకుందాం. యునెస్కో 2003లో నిర్వహించిన సర్వేలో ఆరువేల భాషల్లో మూడువేల భాషలు అంతరించి పోయే అవకాశముందని తేలింది. మన నిర్లక్ష్యం వల్ల పాలకుల విధానాలవల్ల, 2025 నాటికి తెలుగుభాష అంతరించిపోయే ప్రమాదం ఉందని మేధావులు, భాషాభిమానులు ఆందోళన పడుతున్నారు.

**–ఆంధ్రప్రభ దినపత్రిక,**

నవంబరు 16,2009.

# మా తుఝే సలామ్

**– డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు**

గడచిన రెండు మూడు వారాలలో రెండు ఆందోళనకరమయిన సంఘటనలు జరిగాయి. వాటిల్లో ఒకటి మన రాష్ట్రంలో జరిగితే, రెండవది ఉత్తరప్రదేశ్‌లో జరిగింది.

మొదటి సంఘటన తెలుగు జాతికి చెంప దెబ్బ కొడితే, రెండవది భారతీయులకు సవాలు విసిరింది. ప్రతిజాతికి, ప్రతి ప్రాంతానికి చెందిన ప్రజలు గర్వంగా చెప్పుకునే అంశాలుంటాయి. అందులో భాష, సంస్కృతి, సాహిత్యం, జాతీయ పురుషులు, జాతీయ గీతాల వంటివి కొన్ని అందరూ అంగీకరించినవి.

అనేక దశాబ్దాలు ప్రజలు గర్వంగా చెప్పుకొనే అంశాలను ప్రదర్శించి వేధించే మార్గాలు దేశంలో తలెత్తటం ఒకింత ఆందోళన కలిగిస్తున్న అంశం. మనమంతా తెలుగుజాతి మనది, తెలుగు భాష మధురమైనదని గర్వంగా చెప్పుకుంటాం. తమిళ అభిమానం మెండుగా గలిగిన ప్రముఖ కవి సుబ్రహ్మణ్య భారతి చేత సుందర తెలుంగు అని, విదేశీయుల చేత మధురమైన భాష అని అనిపించుకున్న తెలుగు భాషను తెలుగు నేలమీదున్న పాఠశాలలో మాట్లాడేందుకు వీలు లేదని ఆక్షేపించడం ఒక సాహసమే.

ఆ సాహసం చేసింది **మైదుకూరు**లోని మిషన్ స్కూల్. ఆ స్కూల్‌లో చదివే విద్యార్థులు ఇంగ్లీషులో తప్పించి తెలుగులో మాట్లాడడానికి వీలులేదని ఉత్తర్వులు ఇవ్వడమే అభ్యంతరకరమైతే, ఆ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా తెలుగులో మాట్లాడారనే ఆరోపణతో నేరస్థుల లాగా నిలబెట్టడం శిక్షార్హమే.

పైగా ఆ పసిపిల్లలను నిలబెట్టిన తీరు టెలివిజన్ తెరల మీద చూసిన భాషాభిమానులకు గుండె తరుక్కుపోయింది. 'ఇక తెలుగులో మాట్లాడను–' అని పలకమీద రాసి నేరస్థుడి మెడలో పలకపెట్టే రీతిలో పిల్లలను నిలబెట్టిన ఆ స్కూల్ నిర్వాహకులే అసలు నేరస్థులు. అయితే ఆ నేరస్థులకు ఎటువంటి శిక్షను నేటివరకు ప్రభుత్వం విధించలేకపోవడం బాధాకరం.

మాతృభాషలో చదువు మేలని, మాతృభాషలోచదువుకున్న విద్యార్థులకే మేథ వికసిస్తోందని మానసిక శాస్త్ర వేత్తలు ప్రపంచ వ్యాప్తంగా ఘోషిస్తుంటే, తెలుగు నేలమీద మాతృభాషకు నిషేధం విధించడమంటే తెలుగు భాష పరిస్థితి ఏ స్థితికి దిగజారిందో ఊహించుకోవచ్చు.

హత్యలు చేసిన వారికి, లంచాలు మరిగిన వారికి కూడా అటువంటి బిళ్ళలు మెడలో వేసి పదిమంది ముందు నిలబెట్టిన సంఘటనలు లేవు. ఒకవేళ ఎక్కడైనా ఒక చోట పోలీసులు అలాంటి పనిచేస్తే మానవ హక్కుల సంఘాలు వెనువెంటనే నానాయాగీ చేసేవి. కాని నేడు ఆ పసిపిల్లల మనసు మీద తీవ్రప్రభావం చూపిన ఈ సంఘటన మీద ఈ సంఘాల నుండి ఎటువంటి స్పందన లేకపోవడం అనేది మరో ఆశ్చర్యకరమైన అంశం.

అయితే ఇది కేవలం **మైదుకూరు** మిషన్‌పాఠశాలలో అనుకోకుండా జరిగిన ఘటన అనేందుకు వీలులేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిషన్ పాఠశాలలన్నింటిలో ఇదే తంతు. ఆ పాఠశాలల ప్రాంగణంలో తెలుగు ముక్క తెలుగు పిల్లల నోటివెంట రావడానికి వీలులేదు.

ఎక్కడైనా, ఎవరయినా పిల్లలు తెలుగులో మాట్లాడితే ఆ విషయం ఒక నేరంగా తోటి తెలుగు పిల్లలే పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసేంత పకడ్బందీగా అక్కడి నిబంధనలు ఉంటాయి. తమ మాతృభాష తెలుగులో మాట్లాడినందుకు మోకాళ్ళ మీద కూర్చున్న పిల్లలు, ఫైన్‌కట్టిన పిల్లలు చాలామంది ఉన్నారు.

మిషన్‌పాఠశాలల నిర్వాహకులు తమనుతాము ఇంగ్లండ్ నుంచి దిగబడిన దొరలు, దొరసానులుగా భావించుకుంటూ తెలుగును చిన్నబుచ్చుతున్నారు. పిల్లల్ని మాతృభాషకు దూరం చేస్తే తమ సంస్కృతి నుండి దూరం చెయ్యవచ్చన్న కుట్రలో భాగమే బలవంతంగా ఇంగ్లీషులో మాట్లాడించడం, తెలుగును దూరం చేయడం.

చాలా మిషన్ పాఠశాలల్లో బొట్టు, గాజులు, పూలు, గోరింటాకులు నిషేధమనేది బహిరంగ రహస్యమే. ఇటువంటి కఠిన నిబంధనల వల్లే మిషన్ స్కూల్స్‌కి అంత పేరొచ్చిందని భ్రమపడి మిగిలిన పాఠశాలల వారు కూడా ఆంగ్ల మత్తును అలవాటు చేసుకుంటున్నారు.

తమ భాషకు ఇంత ఘోరమైన అవమానం జరుగుతున్నా, తమ పిల్లలను పాఠశాలల్లో హింస పెడుతున్నా తల్లిదండ్రులు ఎందుకు స్పందించరు! ఇంగ్లీషును మాతృభాషగా మార్చుకునే యత్నం తెలుగింటి లోగిళ్ళలో, తల్లుల చేతుల్లోనే శ్రీకారం చుట్టుకుంటుంటే ఇక ఆ భాషను కాపాడుకునేదెలా!

ప్రపంచంలోని పలుమూలల ఉన్న భాషలు, ఆ భాషలను మాట్లాడేవారి సంఖ్య లక్షలు దాటకపోయినప్పటికి తమ భాషపట్ల వారు చక్కటి అభిమానం ప్రదర్శిస్తుంటారు. ఏ టెలివిజన్ ఛానల్ యాంకర్ మాట్లాడే పద్ధతి చూసినా ఏమున్నది గర్వకారణం మొత్తం పరభాషా పదాల సమాహారం అని చెప్పటంలో ఏ మాత్రం సందేహంలేదు. తెలుగును తెలుగుగా చదివించడంలో ప్రభుత్వం కూడా తమవంతు కృషి చేయాల్సి ఉంది. కాని ప్రభుత్వపరంగా కూడా తెలుగు నిర్లక్ష్యం చేయబడుతోంది.

తెలుగు మాట్లాడవద్దని స్కూళ్ళలో ఉత్తర్వులిస్తుంటే ప్రభుత్వం స్పందించడంలేదు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కాలేజీలో ముందు తెలుగు మాధ్యమ సెక్షన్ ఉంటేనే ఆంగ్ల మాధ్యమ సెక్షన్‌కి అనుమతి ఇచ్చేలాగా నిబంధనలను రూపొందించారు. అటువంటి తెలుగు భాషావిధానం నేడు ప్రభుత్వమే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం ప్రాథమిక స్థాయినుంచి ప్రవేశపెట్టేదిగా మార్పు చెందింది. ఇది తెలుగు భాషకు నేడు ప్రభుత్వ పరంగా లభిస్తున్న ఆదరణ, గౌరవం. ఆంగ్లభాషా వ్యామోహంలోపడి తల్లిదండ్రులు తమ పిల్లల నోటివెంట వస్తున్న మమ్మీ-డాడి పలుకులను ఎంతగానో సంబరపడి పోతున్నారు. ఇంతలో తెలుగు పత్రికలు తెప్పిస్తే పిల్లలు ఇంగ్లీషులో భాషను

సరిగా నేర్చుకోరేమోనన్నంత వెర్రి ఆలోచనలో ఈతరం తల్లిదండ్రులున్నారు. అందుకే ఆంగ్లమాధ్యమ పాఠశాలలకు అంత ఆదరణ పెరుగుతోంది.

రాష్ట్రప్రభుత్వ పరంగా, తెలుగులోగిళ్ళలో తెలుగు భాషకు ఆదరణ లేనప్పుడు ఆ తెలుగు మీద **మైదుకూరు** మిషన్ పాఠశాల వంటివారు సులభంగా దాడిచేసేందుకు సాహసిస్తారు. వారిబాటలోనే మిగిలిన పాఠశాల వారు కూడా నడుస్తారు. వెలుగు చూడనటువంటి భాష సంస్కృతిపరమైన దాడులు రాష్ట్రంలో అన్ని మూలల అనేకం జరుగుతున్నాయి.

ఆంగ్లం చదవవద్దని ఎవరూ అనటం లేదు. ఆంగ్లం వృత్తికోసం, ఉపాధికోసం ఈ రోజు ఉపయోగపడుతున్నది. దానిని అంతవరకే వాడాలి. మిగిలిన వాటన్నింట మాతృభాషే నిండాలి. తెలుగు మాధ్యమంలో చదువుకుని ఉన్నతోన్నత స్థానాలకు చేరిన తెలుగు యువతీయువకులకు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళాలి.

అప్పుడు తెలుగు మాట్లాడవద్దు అని ఇంగ్లీషులో ఉత్తర్వులిచ్చేందుకు మిషన్‌పాఠశాలలు వణికిపోతాయి. అటువంటి పరిస్థితిని తీసుకురాగలిగితేనే తెలుగువాడి ఆత్మగౌరవం నిలబడినట్లు. ఆ యత్నం చేస్తామని తెలుగువారంతా ప్రతిజ్ఞ చేయాలి.

**– స్వాతి వారపత్రిక,**
20 నవంబరు, 2009.



# అమ్మభాషకు ఆంగ్ల సంకెళ్ళు

-టి. ఉదయవర్లు

ఒకవంక విదేశీయులు లేదా ఆంధ్రేతర ప్రాంతాల్లోని విద్యాభిలాషులెందరో తేనెలొలికే తెలుగు పట్ల మక్కువ చూపుతుండగా, ఆయాచోట్ల విశ్వవిద్యాలయాల్లో తెలుగు పీఠాలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తుంటే, మరోవంక- మిడిమిడి జ్ఞానంగల స్థానిక పాఠశాలల నిర్వాహకులు కొందరికి వారు సరాసరిగా ఇంగ్లాండు వారికి వారసులైనట్లు వ్యవహరిస్తున్నారు. వారికి తెలుగంటే ఒళ్ళంతా తేళ్ళు ప్రాకుతున్నట్టున్నది.

ఒక మిషన్ స్కూలు వాడు తెలుగులో మాట్లాడినందుకు ఒక విద్యార్థికి జుర్మానా వేస్తే, తాజాగా కడప జిల్లా **మైదుకూరు**లోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగులో మాట్లాడారని వారికి అమానుషమైన దండన విధించారు. తెలుగు నేలలో, తెలుగు వారై పుట్టి, అణువణువునా తెలుగు నిండిన పసిపిల్లలు తెలుగులో మాట్లాడినందుకు వారి మెడలో 'ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు' అని ఇంగ్లీషులో వ్రాసిన అట్టలను వేలాడదీసి, ఈ అక్టోబర్ 26వ తేదీన పాఠశాల ఆవరణంలో వారిని నిలబెట్టడం, వారిపట్ల దారుణ వైఖరి అవలంభించడం ఒక విధంగా, ఆత్మాభిమానం గల ప్రభుత్వానికి, చీము నెత్తురున్న పాఠశాల విద్యాశాఖ మంత్రికి గాని చీమకుట్టినట్టుగా నైనా లేకపోవడం మన ప్రభుత్వ వ్యవస్థ ఎంత మొద్దు బారిపోతుందో సుస్పష్టమవుతుంది.

రాష్ట్రంలో తెలుగు అధికారభాషా సంఘం ఉనికి గనుక ఉండిఉంటే, ఈ నాటికి పాఠశాల గుర్తింపు రద్దు చేయమని, దీనివల్ల ఒకవేళ విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందని భావిస్తే పాఠశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి సిఫారసు చేసి ఉండేది. సెయింట్‌జోసఫ్ ఉన్నత పాఠశాల పేరుతో సెయింట్ అంతర్థానంకాగా, తెలుగు భాషను పనికట్టుకుని చంపే ప్రయత్నం చేస్తున్నది, ఆ పాఠశాల. దేశంలో మొట్టమొదట ఏర్పడిన భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇలాంటి చోటే మాతృభాష పట్ల మమకారం లేని వారిసంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నది. అధికార భాషగా తెలుగు అమలు పర్యవేక్షించడానికి రూపకల్పన చేసిన సంఘం మాటను, సూచనలను కేంద్రప్రభుత్వం ఆధీనంలోని శాఖల అధికారులు ఎంతో శిరోధార్యంగా భావించి అమలు చేస్తున్నారో, తన నాలుగు సంవత్సరాల (2005-2009) పదవీకాలంలో పలు రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు, ఉన్నతాధికారులకు ఆయన వ్రాసిన వేలాది లేఖలు, వెలువరించిన ప్రకటనలకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కూడా అంత స్పందించి ఉంటే బహుశా రాష్ట్రంలో సంపూర్ణంగా అధికార భాషగా తెలుగు ఈనాటికి అమలై పోయి ఉండేదని అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు ఎబికే ప్రసాద్ అన్నమాటల్లోని నిజాన్ని ప్రభుత్వం గ్రహించి ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే మంచిది. అసలు మన అధికారులకు గనుక ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో మాదిరిగా భాషా స్పృహ ఉండి ఉంటే-1996లో తెచ్చిన అధికార భాషా చట్టం సుమారు ఐదు దశాబ్దాలు కావస్తున్నా అంతంత మాత్రంగా అమలు కావడం దురదృష్టకరం.

పైగా అధికార భాషగా తెలుగు అమలుపరచడానికి ప్రత్యేక చట్టం చేసి 1974నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా వావిలాల గోపాలక్రిష్ణయ్య, డాక్టర్ సి. నారాయణరెడ్డి, నండూరి రామకృష్ణమాచార్య, డాక్టర్ పి. యశోదారెడ్డి, తూమాటి దోణప్ప, ఎ.బి.కె ప్రసాద్‌లాంటి హేమాహేమీలు పద్నాలుగు మంది దాకా ఇంతవరకు అధ్యక్షులుగా నియామకం చేసినా, పాలనా భాషగా తెలుగు అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందాన ఉంది. దానికి ప్రధానకారణం-వరసగా అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలకు తెలుగు అమలు పట్ల చిత్తశుద్ధి లేకపోవడం ఒక కారణం కాగా, చాలామంది ఉన్నతాధికారులు తెలుగుకు వ్యతిరేకం కావడం ప్రధాన కారణం. నిజంగా రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలుగు అమలు చేయని అధికారులపై క్రమశిక్షణ చర్య తీసుకునే అధికారాన్ని అధికార భాషా సంఘానికి కట్టబెట్టేవారు. కానీ భాషా సంఘం కేవలం సలహాలు ఇవ్వడానికే పరిమితమైన సంఘంగా ప్రభుత్వం నిబంధించినందున సచివాలయంలోని వివిధ శాఖల అధికారులు భాషా సంఘం సూచలన్నింటిని ఏమీ ఎరగనట్టుగానే నటిస్తూ తుంగలో తొక్కేస్తున్నారు.

సచివాలయంలోని అధికారులు, అధికార రీత్యాను, పాలనాపరంగానూ గొప్ప అయితే కావచ్చుకానీ, భాషా దారిద్ర్యం వారిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఇంగ్లీషులో తప్పు రాస్తే సభ్య ప్రపంచం నేరగాణ్ణి చూసినట్లు చూస్తుంది తప్ప తెలుగులో తప్పులు రాస్తే అదేదో గొప్పగా భావించడం వారి తెలియనితనానికి పరాకాష్ట.

భాషా సంఘం అధ్యక్షులైన పెద్దమనుషులు అదిగదిగో జిల్లా స్థాయిదాకా తెలుగు అమలు చేశాం, ఇదిగో సచివాలయ స్థాయిలో ఇంతశాతం అమలు చేసేందుకు ప్రతిపాదించాం అని చెప్పడమే తప్ప ప్రజలతో అనునిత్యం అత్యంత సంబంధంగల కొన్ని శాఖలలోనే తెలుగు అమలు ప్రస్తుతం 10 శాతంలోపే అని గమనిస్తే మన దౌర్భాగ్య స్థితి కన్నులకు కడుతుంది.

ఇది ఇలా ఉండగా పాఠశాలల్లోనూ తెలుగు పట్ల చిన్నచూపు చూడడం ఇటీవల కాలంలో మరీ ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వల్ల నగరంలోని అనేక కాన్వెంట్ పాఠశాలల్లో తెలుగులో మాట్లాడిన విద్యార్థుల వద్దనుంచి అపరాధ సుంకం వసూలు చేస్తున్నారు. అత్యంత దారుణమైన ఈ అంశంలో ప్రభుత్వం సరిగా స్పందించకపోవడం విడ్డూరం. ఇలా తెలుగు వారి భాషారాహిత్యం వల్లనే మన తెలుగు పిల్లలు దాదాపు 30 శాతం దాకా మాతృభాషకు దూరం అవుతున్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి. భాషా ప్రాతిపదికపై ఏర్పడిన రాష్ట్రాల్లోని జనాభాలో 30 శాతం మంది పిల్లలకు మాతృభాష రాదంటే, ఆ భాష మాతృభాషగా పరిగణించవలసిన దుస్థితి వస్తుందని యునెస్కో చేసిన హెచ్చరిక ఎంతమాత్రం విస్మరించరానిది. మాతృభాష తెలుగు మృత భాష కాకుండా ఉండాలంటే రాష్ట్రంలో ప్రాథమిక దశ అంతా తెలుగులోనే విద్యాబోధన జరిగి తీరాలి. ఎందుచేతంటే ఇవాళ ప్రపంచభాషలలో పక్షం రోజులకొక భాష చొప్పున మృతభాషలై పోతున్నాయి. మరి, నిజానికి ఒకప్పుడు సుమారు అరవై వేల ఏళ్ళ క్రితం ప్రపంచ మానవాళి

మాతృభాష ఒక్కటే. కాలక్రమంలో ప్రపంచ జనులు పరస్పరం అర్థం చేసుకోకుండా వారు వివిధ భాషలు మాట్లాడే జాతుల్లో పుట్టడం పెద్ద శాపంగా పరిణమించింది.

తొలుత ఉన్న ఒక భాష పోయి పది భాషలుగా రూపొందాయి. అవి ఆ తర్వాత వందలయ్యాయి. ఈనాటికి ఆ సంఖ్య వేలకు పెరిగింది. అయితే ఈ వేలాది భాషలు తొలితరం వారే మాట్లాడడం కాకుండా, ఏ భాషనైతే పసివాళ్ళు కూడా నేర్చుకుని మాట్లాడుతున్నారో అట్టి భాషలే నిలుస్తున్నాయి. మిగతావి అంతర్థానమైపోతున్నాయి. సుమేరియన్, ఇట్రుస్కాన్, మయన్ లాంటి భాషలకు లిపులైతే ఏర్పడ్డాయి కానీ ఆ భాషలు నిత్య జీవితంలో మాట్లాడేవారు లేక కనుమరుగైపోయాయి.

లాటిన్, సంస్కృతం, ప్రాచీన గ్రీకు భాషలు లిపుల ద్వారా పరిరక్షించడమే కాకుండా ఆ భాషలు ఆధునీకరణ చెందాయి. కొన్ని శతాబ్దాలుగా కొత్త భాషలు పుట్టుకు వస్తున్నాయి. అవి వాడుకలేక కాలగర్భంలో కలసి పోతున్నాయి. అయితే ఇటీవల కాలంలో మాత్రం చాలా తక్కువ సంఖ్యలో కొత్త భాషలు రూపొందుతున్నాయి. కాని పెద్ద సంఖ్యలో పాతభాషలు కనుమరుగైపోతున్నాయి. యాజమాన్యం గొంతుకు వారు తట్టుకోలేనంత తీవ్ర నిరసనల ఉరిబిగించేది. దేశంలో తెల్లవారి పాలన సమసిపోయినా, అక్కడక్కడ మిగిలిన వారి అక్రమ సంతానం చేసే ఇలాంటి భాషాసంబంధమైన చేటు పనులను మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోకుండా ప్రభుత్వం తక్షణం అణచివేయాలి. ఇంగ్లీషు చదువుకుంటే తప్పు ఎంతమాత్రం లేదు. కానీ కావాలని తెలుగును చిరునామా లేకుండా చేయాలనే వారి ఆటలు సాగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సమయాల్లో వెంటనే స్పందించి, తగు పరిష్కారాలు సాధించడానికి వీలుగా, అధికార భాషా సంఘానికి పూర్తి అధికారాలిచ్చి, నూతన సంఘాన్ని జరూరుగా నియామకం చేయాలి.

అధికారభాషా సంఘం అధ్యక్షుడుగా సుప్రసిద్ధ పాత్రికేయుడు ఎబికె ప్రసాద్ పదవీకాలం ముగిసి సుమారు ఆరు మాసాలైనా, ఆయన పదవీకాలం పొడిగిందో లేదో. అంతటి వాడని ప్రభుత్వం భావించిన మరొక ప్రముఖుని ఈ పాటికి నియామకం చేసి ఉంటే, సెయింట్ జోసఫ్ పాఠశాల వ్యవహారం వారు చూసుకునేవారు, సరిదిద్దేవారు. భాషా పరిశోధకుల ప్రకారం సుమారు పదివేల సంవత్సరాల క్రితం యాభైనుంచి వంద లక్షల దాకా జనాభా ఉన్న తరుణంలో వారు 12 వేల భాషలను మాట్లాడేవారు. అయితే క్రమంగా వారు వ్యవసాయ వృత్తిలో స్థిరపడడంతో కొన్ని భాషలే వారి వాడకంలో ఉండి పోయాయి. ఇటీవల శతాబ్దాలలో సహజీవనం, వాణిజ్యం, పారిశ్రామికీకరణ, దేశాభివృద్ధి, విశ్వజనీన విద్య ఇతరుల కారణంగా పరస్పర అవగాహనకు వారంతా అనేక భాషలు వదిలేసి కొన్ని భాషలలోనే మాట్లాడడానికి అలవాటుపడ్డారు. ఇకపోతే ఇటీవల ప్రపంచీకరణ ఫలితంగా సమాచార సౌకర్యం మూలంగాను ఇంగ్లీషు, స్పానిష్, చైనీస్ భాషలే ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి, ఇతర భాషలు వెనుకబడిపోయాయి.

ప్రస్తుతం ప్రపంచంలో 6,800 భాషలు ఉండగా, మరెన్నో మాండలికాలు ఉన్నాయి.

డల్లాస్‌లోని సమ్మర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ ప్రకారం ఒక్కొక్క ఖండంలో జనాభా, వైశాల్యం ఇత్యాదులకు సంబంధం లేకుండా భాషలుపుట్టాయి. ఉష్ణమండలాల్లో ఎక్కువ జనాభా కొన్ని భాషలే మాట్లాడుతున్నట్లు రికార్డులున్నాయి. యూరప్ ఖండంలో దాదాపు 200 భాషలను మాట్లాడేవారున్నారు. అమెరికాలో వెయ్యి భాషలు, ఆఫ్రికాలో 2,400 భాషలు, ఆసియాలో కేవలం పాపువాన్యూగినియా లోనే 800 భాషలను మాట్లాడేవారున్నారు.

అయితే ప్రపంచంలోని 6,800 భాషల్లో దాదాపు 400 భాషలు త్వరలో అంతర్థానమయ్యే ప్రమాదం ఉంది. వాటిలో కొన్ని భాషలు తెలిసిన వృద్ధులు ఒకరిద్దరూ కన్నుమూస్తే, ఆ భాష సైతం కాలగర్భంలో కలిసిపోయే విషాదపరిస్థితి ఇవ్వాళ దాపురించింది. కెమరూన్‌లో 'యిస్సు' భాష మాట్లాడేవారు ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. మెక్సికోలో 'చిపాన్‌కో' భాష తెలిసిన వారు నూటా యాభై మంది ఉన్నారు. అమెరికాలోని 'అవాచే ' తెలిసిన వారు కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఆస్ట్రేలియాలోని 'వాడజిగు' భాష తెలిసిన వారు ఇవాళ ఒక్కరంటే ఒక్కరు ఉన్నారు.

నిజానికి ఈ భాషలన్నీ బతికే అవకాశం లేదు. త్వరలోనే ఈ భాషలన్నీ కాలగర్భంలో కలసి పోవడం తథ్యం.

ఈ శతాబ్ది చివరికి వాడుకలో ఉండే భాషల సంఖ్య బాగా తగ్గిపోతుందని భాషా నిపుణులు చెబుతున్నారు. అయితే ఎక్కడికక్కడ ఆయా భాషల వాడకానికి, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటే కనుమరుగు కావలసిన వాటిలో సగం భాషలను పరిరక్షించవచ్చు. లేదా వందేళ్ళకాలంలో దాదాపు 90 శాతం ప్రపంచ భాషలు కాలగర్భంలో విలీనమైపోయాయి. వచ్చే కొన్ని శతాబ్దాలలో ప్రపంచం మొత్తం మీదనే కేవలం సుమారు రెండు వందల భాషలు మాత్రమే మాట్లాడేవారుంటారని భాషా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఏ భాషకైనా మానవ స్పందనలను అనుభవాలను వ్యక్తీకరించే కొన్ని విశేషమైన గుణాలుంటాయి. అందుచేత ఒక భాష చనిపోతే, దీని తాలూకు సాంస్కృతిక సాక్ష్యాలన్నీ కాలంలో కరిగిపోతాయి. అందుచేత ప్రమాదపు అంచున నిలిపి, మృతిచెందడానికి ఏ భాషను సిద్ధంగా ఉంచడమైనా అది ఆయా పాలకుల నేరం. ఒకభాష మృతిచెందిందంటే దాని తాలూకు సంస్కృతి, ప్రతిభా సంపదకు, కళాత్మకతకు నీళ్ళు వదిలినట్టేనని, నిజంగా అది మ్యూజియంపై బాంబును పేల్చినట్లేనని సుప్రసిద్ధ భాషావేత్త కీర్తిశేషులు కెన్నెత్ హాలే చెప్పిన మాట అక్షర సత్యం.

**'ఈ వారం' వార పత్రిక,**
నవంబరు 1, 2009.

# అమ్మ భాష అంటే అంత అలుసా?

**–డా॥ రామకృష్ణ**

రాయలేలిన రతనాలసీమలో కీలకమైన పోతుగడ్డ కడప. తెలుగుజాతి గర్వించే గండికోట వీరులు పుట్టిన వీర భూమి అది. అచ్చ తెలుగు అందాలకు మారుపేరుగా నిలిచిన ఈ నేలమీదే ఒంటిమిట్ట కోదండరాముడు కొలువు తీరాడు. 'దేశభాషలయందు తెలుగు లెస్స' అని కవి సార్వభౌముడు శ్రీనాథుడు అంటే దాన్ని రాజముద్రవేసి ఆమోదించాడు, ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణదేవరాయలు. మందార మకరంద మాధుర్యమున తేలే కవితలెన్నో ఈ భాషలో పుట్టాయి. చిత్ర కవితలు చిద్విలాసంగా చిత్రాలు గీస్తే గర్భ కవిత అనేక ఛందస్సులను తన కడుపులో దాచుకుని ఏ భాషా చేయని ఇంద్రజాలాలు చేసింది. ఆశు కవితను అక్షర క్రీడగా మార్చిన ఘనత తెలుగునాటి అవధానులది.

తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా? అని ఆనందంగా పాడుకొని తెలుగువారి గుండెలు కలుక్కుమనేలా ఇంగ్లీషు మీడియం చదువుల పాఠశాలలు తెలుగుపై విరుచుకుపడుతున్నాయి. తెలుగులో మాట్లాడవద్దని కట్టడి చేస్తున్నాయి. పిల్లల వయస్సు, వాలకం, వాళ్ళ ప్రవర్తన, సుతిమెత్తని అంశాలు పట్టించుకోకుండా వారి లేతమనసులు గాయపడేలా తెలుగును అవమానిస్తున్న విద్యాసంస్థలు ఈ తెలుగునేల మీద చేరి విద్యావ్యాపారం చేస్తున్నాయి. ఇందుకు కడప జిల్లా **మైదుకూరు** సెయింట్ జోసఫ్ స్కూలు ఒక ఉదాహరణ. తెలుగును బలిపీఠం ఎక్కించడంలో ఈ ఇంగ్లీషు మీడియం స్కూళ్ళన్నీ పోటీ పడుతున్నాయి.

కార్పొరేట్ కాలేజీలు తెలుగును ఏనాడో నిలువెత్తు గోతిలో పాతేశాయి. వారికి అరబిక్, సంస్కృతం, జర్మనీ, ఫ్రెంచీ, బాషలు రుచిస్తాయే తప్ప ఇంట్లో మాట్లాడుకొనే అమ్మ భాష రుచించదు. మార్కుల వేటగాళ్ళయిన వీళ్లు తెలుగును ఏనాడో ఎత్తేశారు. తెలుగుభాషపై మమకారం పెంచాలన్న ధ్యాస మన పాలకులకు, అధికారులకు లేకుండా పోయింది. తెలుగు భాషలోనే బోర్డులు, హోర్డింగులు ఉండాలని ఉత్తర్వు చేయడానికి మన వాళ్ళకు చేతులురావు. ఉన్న చట్టాలను అమలు చేయడానికి మనసురాదు. అధికార భాషా సంఘం ఎందుకు ఉందో దానికే అర్థంకాదు. ఎవ్వరికి చెప్పలేదు. ఎవ్వరినీ ఆదేశించనూ లేదు. ఆస్మదీయులకు ఒక సీటు చూపించేందుకు తప్ప ఆ సంఘం వల్ల కానీ, దాని అధ్యక్షుల వారివల్ల కాని ఒరిగేదేలేదు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించేందుకు మన ప్రభుత్వం, అధికార భాషా సంఘం పడినపాట్లు, చేసిన రాజకీయ ఫీట్లు ఇంకా స్మృతి పథం నుంచి చెరిగిపోనేలేదు. నిన్నగాక మొన్న మంత్రి గీతారెడ్డి ప్రాచీన గ్రంథాల లిఖిల ప్రతులు సేకరించేందుకు కంకణం కట్టుకున్నామని చెప్పిన మాట ఇంకా ప్రజల చెవికి గట్టిగా చేరనైనాలేదు. తెలుగు వాళ్ళం తెలుగులోనే మాట్లాడుకుందాం అని అధికార భాషా సంఘం

చేసిన నినాదం ప్రజల గుండెను ఇంకా బలంగా తాకనే లేదు. ముఖ్యమంత్రి రోశయ్య 'నేను తెలుగువాడిన నాకు తెలుగులో బాగా మాట్లాడడం వచ్చు' అని సగర్వంగా చెప్పిన మాటలు ఇంకా మీడియాలోనే సాక్ష్యంగా నిలిచే ఉన్నాయి.

దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, విపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ఇంగ్లీషులోనే అనర్గళంగా మాట్లాడగలిగినా తెలుగులోనే హాయిగా మాట్లాడడం ఆనవాయితీగా గలిగిన వారు. మంత్రి గీతారెడ్డి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, తెలుగుదేశం నాయకుడు అశోకగజపతి రాజు తడబడినా తెలుగులోనే మాట్లాడుకునేందుకు ఇష్టపడుతుంటారు. కేంద్రమంత్రులు జైపాల్‌రెడ్డి, పురంధేశ్వరి ఇంగ్లీషులోనే ఎంతో బాగా మాట్లాడగలిగి ఉండి కూడా తెలుగులోనే మాట్లాడతారు. రేణుకాచౌదరి వంటి జాతీయస్థాయి నాయకులు కూడా ఏనాడూ తెలుగులోమాట్లాడేందుకు నామోషీ పడలేదు. 15 కోట్ల మంది భారతీయులు ఎంతో ఆనందంగా అభిమానంగా మాట్లాడే భాష తెలుగు. తెలుగు తేట అని మహామహులు అంగీకరిస్తే, 'తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా' అని ఆత్రేయలాంటి మహాకవి తెలుగు మాధుర్యాన్ని కళ్ళకు కట్టాడు. ఇవి చాలా చెప్పుకోవడానికి విని ఆనందించడానికి తప్ప పిల్లలకు నేర్పుకుని, మన జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి పనికిరావడంలేదు. తెలుగు గడ్డ మీదే తెలుగు పరాయి భాష అయిపోయింది. భావి తరాలు చదువుకోవడానికి పనికిరాని భాష అయిపోతోంది.

**–ఆంధ్రప్రభ దినపత్రిక,**
28 అక్టోబర్ 2009.



# మాతృభాషలో ప్రాథమిక విద్య

-'పొద్దు'-అంతర్జాల పత్రిక

పుట్టినప్పటి నుంచి బిడ్డ తెలుగులో మాట్లాడుతూ తెలుగే నేర్చుకుంటాడు. అతడు బువ్వ తింటాడు. ఆడుకుంటాడు. నవ్వుతాడు, ఏడుస్తాడు. కొడతాడు, పాడతాడు, అంతేగానీ హి డస్ నాట్ , డస్ నాట్ ప్లే, డస్‌నాట్ లాఫ్, డస్‌నాట్ క్రై ఆర్ వీప్! తెలుగు భాషలో, తెలుగు వాతావరణంలో తెలుగు సంస్కృతిలో మూడేళ్ళు పెరిగిన పిల్లాడికి, బడిలో చేరగానే వాట్స్యువర్ నేమ్ అంటూ మాట్లాడితే ఏమర్థమౌతోంది? మనల్ని హఠాత్తుగా స్వాహిలి మాట్లాడే వాళ్ళ మధ్య పడేస్తే మన పరిస్థితి ఏమిటీ? దప్పికతో నోరు పిడచకట్టుకుపోతోంది. కాసిన్ని మంచినీళ్లు ఇప్పించండి అని తెలుగులో ప్రాధేయపడితే మంచినీళ్ళు ఇవ్వకుండా నేనో తెలుగు గాడిదను అనే బోర్డు మెడలో తగిలిస్తే మన పరిస్థితి ఎలా ఉంటుంది? ఇంగ్లీషు బడిలోకి నెట్టబడిన ఆ కసుగాయల పరిస్థితీ అదే!

తెలుగులో బోధన జరిగేటపుడు భాషతో పిల్లలకు ఇబ్బంది ఉండదు. వారికి భాషముందే వచ్చు కాబట్టి వాళ్ళకు అక్షరాలు రావంతే. పుస్తకాల్లోనివి చదివేందుకు, చదివినదాన్ని తిరిగిరాసేందుకు ముందు పిల్లలు అక్షరాలు నేర్చుకోవాలి. అవి బడిలో చేరగానే నేర్చుకుంటారు. కానీ ఇంగ్లీషులో చదివి పిల్లలు ముందు ఇంగ్లీషు భాషను నేర్చుకోవాలి. బాష నేర్చుకోవడమంటే చదవడం రాయడం నేర్చుకోవడం కాదన్న సంగతిని ఈ సందర్భంగా మనం గుర్తించుకోవాలి.

మనిషి నుంచి మనిషికి సమాచార ప్రవాహం భాషలో ఎటువంటి పాత్ర పోషిస్తుందో 'మాతృభాషలో ప్రాథమిక విద్య శాస్త్రీయ వివరణ' పుస్తకంలో డా. పమిడి శ్రీనివాసతేజ ఇలా రాశారు.

'సంభాషణ లేదా సమాచార మార్పిడి అర్థవంతంగా జరగాలంటే ఇద్దరి వ్యక్తుల మనసుల్లో ముందుగా భాషకు సంబంధించిన ప్రోగ్రామింగు జరిగి ఉండాలి. బిడ్డ పుట్టినప్పటినుంచి జరిగే ప్రోగ్రామింగే భాషాభివృద్ధి. మనకు తెలుగులో ప్రోగ్రామింగు జరిగితే తమిళులకు తమిళ భాషలో ప్రోగ్రామింగు జరుగుతుంది. ఎవరికి ఏ భాషలో ప్రోగ్రామింగు జరుగుతుందో దాన్ని మాత్రమే అర్థం చేసుకోగలరు. ఇతరు భాషను అర్థం చేసుకోలేరు. ఒకవేళ ఇతర భాషను అర్థం చేసుకోవాలంటే దానికి సంబంధించిన ప్రోగ్రామింగు జరిగి తీరాలి. అంటే ఆ భాషను నేర్చుకుని తీరాలి. అంటే మన కంప్యూటరుకు తెలుగు నేర్పకుండా తెలుగు వెబ్‌సైట్‌ను చదవడానికి ప్రయత్నించడమెలాగో తెలుగు పిల్లలకు ఇంగ్లీషులో చదువు చెప్పడమలాంటిదే'.

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలని ప్రపంచ వ్యాప్తంగా విద్యావేత్తలు, భాషావేత్తలు, అనేక పరిశోధనలు చేసి మరీ చెబుతున్నారు మచ్చుకు 'ఐరాస' పనుపున

స్థానిక భాషలపై ఏర్పాటైన అంతర్జాతీయ నిపుణుల సమావేశం ఇలా అభిప్రాయపడింది. మాతృభాషలో విద్యాబోధన పిల్లలకు మేలని గుర్తిస్తున్నారు. భాషాపరంగానూ, సాంస్కృతికపరంగాను సంబంధం ఉన్న విద్యనే బోధించడం ఆవశ్యకమన్న భావన పెరుగుతోంది. అలాగే మాతృభాషలో చదువుకున్న పిల్లలు, పరాయి భాషలో చదువుకున్న వారి కంటే మెరుగ్గా ఉన్నారని కూడా తెలుస్తోంది. ఉచిత నిర్బంధ విద్య అమలుపై కేంద్రప్రభుత్వం నియమించిన అధ్యయన సంఘం విద్యార్థి మొదటి ఐదేళ్ల చదువు మాతృభాషలోనే సాగాలని చెప్పింది. పిల్లలతో బహుభాషా ప్రావీణ్యాన్ని పెంపొందించాలని చెబుతూ, మాతృభాషలో చక్కటి ప్రావీణ్యం ఉంటేనే ఇది సాధ్యపడుతుందని 'నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ' 2005 లో తన నివేదికలో చెప్పింది.

జాతీయ, అంతర్జాతీయ నిపుణులే కాదు, స్వయంగా మన రాష్ట్రప్రభుత్వం కూడా ఈ సంగతే చెబుతోంది. మాతృభాషలో బోధన జరిగితేనే పిల్లలు ఆసక్తిగా నేర్చుకోగలుగుతున్నారన్న ఉద్దేశంతో మన రాష్ట్ర ప్రభుత్వం 8 గిరిజన భాషల్లో చదువులు చెప్పించే ఏర్పాట్లు చేసింది. సర్వశిక్షా అభియాన్ కింద ప్రయోగం చేసింది. ఆయా భాషల్లో పుస్తకాలు తయారుచేయించింది. దీనితో ఆయా గిరిజన తెగలకు చెందిన పిల్లలు బడికి హుషారుగా రావడం, బడి మానేసేవాళ్ళు తగ్గిపోవడం గమనించినట్లు ప్రభుత్వమే స్వయంగా ప్రకటించింది. గోండు, సవర వంటి భాషలలో చదువు చెప్పించే ప్రభుత్వం తెలుగు భాషలో చెప్పించకపోవడం విచిత్రంగా లేదూ?

**పిల్లలను ఇంగ్లీషులో చదివించడం పట్ల మనకు ఎందుకంత ఆసక్తి?**

1. తెలుగులో చదివించాలంటే తగిన వసతులు లేవు. తెలుగులో చదువు చెప్పే పాఠశాలలే బహు తక్కువ. ఉన్న వాటిల్లో చదువు సరిగ్గా చెప్పరు. అందుచేత ఇంగ్లీషు మాధ్యమంలో చదివించడం తప్ప గత్యంతరం లేని పరిస్థితి మనకు ఏర్పడింది. ప్రభుత్వం మనకీ దురవస్థ కల్పించింది.

2. ఇంగ్లీషులో చదివితేనే మంచి ఉద్యోగాలొస్తాయి అనేది మిథ్య. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించుకోవాలని తహతహలాడుతున్నారు అని ఒక వాదన ఉంది. నిజమే, తమ పిల్లలు బాగా చదువుకుని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలని అందరికీ ఉంటుంది. కానీ పిల్లలు ప్రాథమిక విద్యను తెలుగులో చదవడానికి, వాళ్లు డాక్టర్లు, ఇంజనీర్లు , సాఫ్టువేరు ఇంజనీర్లు కాలేకపోవడానికి సంబంధం ఏమీ లేదన్న సంగతిని గ్రహించక అలా అనుకుంటాం.

ఈ కారణాల వలన, ఎంత ఖర్చైనా భరించి, పిల్లలను ఇంగ్లీషు బడుల్లో చదివిస్తున్నాం. ప్రభుత్వానికి ఇది బాగానే ఉంది. ప్రభుత్వ పాఠశాలల మీద ఒత్తిడి తగ్గిపోయింది గదా మరి! ప్రజలు ఇంగ్లీషు కావాలని కోరుతున్నారు, అంచేత ప్రభుత్వ బడుల్లో కూడా ఇంగ్లీషు మాధ్యమంలోనే చదువు చెబుతామంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఎటొచ్చీ పిల్లలే

ఇంగ్లీషు శిక్షకు గురౌతున్నారు. వాళ్ళను ఈ శిక్షనుంచి తప్పించే ఉపాయమే లేదా? ఉంది! **ప్రభుత్వ విధానాలను మార్చాలి, మనం మారడం కాదు.**

తెలుగు భాషను, తెలుగు జాతిని, తెలుగు సంస్కృతిని కాపాడి, రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత అందరికంటే ప్రభుత్వానికి ఎక్కువగా ఉందని గ్రహించాలి. తెలుగులో ప్రాథమిక విద్య ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలోను ప్రభుత్వం నడిపేదైనా, ప్రైవేటుదైనా– ప్రాథమిక విద్యను తెలుగులోనే బోధించడాన్ని నిర్బంధం చేయాలి. ఇంటర్మీడియట్ వరకు తెలుగు ఒక బోధనాంశంగా నిర్బంధం చేయాలి. కర్నాటక కన్నడం కోసం ఈ పనులు చేసింది. మహారాష్ట్ర మరాఠీ కోసం చేసింది. మన ప్రభుత్వం తెలుగు కోసం ఎందుకు చెయ్యదు? భాషాభిమానులు ఈ విషయమై ఒత్తిడి తేవాలి. మన భాషను మనం రక్షించుకోకపోతే మరెవరూ మనకోసం ఆ పని చెయ్యరు.

'ఏను తెలుగు వల్లభుండ' అంటూ తెలుగు భాషను పోషించిన నృపుణ్ణి నేటికి –450 యేళ్ళ తర్వాత కూడా ఎల్లజనులూ కొలుస్తున్నారు. అతడికి ముందు, అతడి తర్వాత అనేక వందలమంది పాలకులు వచ్చారు. పోయారుకానీ రాయలొక్కడే మనకు జననాయకుడు. మన ప్రభుత్వాధినేతలు ఈ నిజాన్ని గుర్తెరగాలి. * *

**పరిశోధన**



LOST HERITAGE

## Relics of Buddha's footprints found

Several artefacts too such as earthen vessels and large red bricks were found in Pullur

M. V. Subramanyam

KADAPA: The relics of two footprints (paada) of Buddha, each of one sq. metre size, and ancient historical artefacts such as six "Veeragallu" dating to the fourth century A.D. were discovered in agricultural fields near Venkataramapuram and Anjaneya Kottala in Pullur village, about 15 km. from Mydukur in Kadapa district.

Telugu Bhashodyama Samakhya Rayalaseema area secretary Tavva Obul Reddy, member Dharmisetty Ramana and Assistant Director of State Archaeology Department, Ramana, recently visited Pullur and found the artefacts as well as traced the origin of an ardent devotee of Sri Venugopala Swamy Kundavaram Chowdappa. Chowdappa was a poet in the court of the Matli king, Ananthabhoopaludu, who served the Vijayanagar empire, dating to the 16th century A.D. in Pullur village.

**Stone inscriptions**

The name of Birudanka town ruled by king Birudankithudu was changed to Pullur after a "puli" (tiger) killed a pregnant woman, according to McKenzie's Kaifiyats, written two centuries ago.

A stone inscription has Buddha's footprints with the five fingers of equal size and three chakras and figurines of humans, horses and lions carved along the border. Another inscription of Buddha's footprints has flowers carved along the borders.

However, local residents believed that the footprints on the tank bund near Venkataramapuram were those of Lord Vishnu, Mr. Obul Reddy told *The Hindu*. The villagers performed abhishekam of the "paada mudrika" with water whenever they faced drought conditions.

**Artefacts, coins found**

Several artefacts such as earthen vessels and large red bricks were found in mud heaps at Pullur. An idol of Sri Venugopala Swamy, stone pillars and sculptures of the Sri Krishnadevaraya era were lying in Pullur tank, Mr. Obul Reddy said. An icon of Sri Venugopala Swamy, which was revered by poet Chowdappa, is said to have been abandoned in a dilapidated well.

The idol was that of the presiding deity in the temple to the south of Pullur, according to villagers. They told the visiting team that ancient gold and silver coins were found by local people some time ago when they dug the area in the vicinity.

**Plea to check digging**

Buddhism was prevalent in Kadapa district for nearly 600 years between the second and fourth century A.D. with the discovery of artefacts near Tallapaka, Aadapur near Nandalur and on a hillock at Kondur near Rajampet.

Samakhya members expressed concern over people digging the historical site at will and appealed to the Archaeological Survey of India and State Archaeology Department officials to conduct a detailed examination of Pullur, check indiscriminate digging in the area, retrieve and preserve the age-old artefacts.

**NEW FIND:** *The Buddha "paada" found at Venkataramapuram in Pullur village in Kadapa district.*

రచయిత, పరిశోధకుడు తవ్వా ఓబుల్‌రెడ్డి పుల్లూరు వద్ద బుద్ధ శిలాపాదాలు కనుగొన్న సందర్భంగా ది హిందూ పత్రిక ప్రచురించిన వార్త, (తేది.21 జూలై, 2012)

# తెలుగు భాష మనది..తెలుగు యాస మనది

-డా.చుక్కారామయ్య

తెలుగు చదివితే ఏమొస్తుందిరా..? అంటూ 'ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు' అని రాసిన పలకలను పిల్లల మెడలో వేసి శిక్షించిన సంఘటన ఘోరమైనది. తెలుగు అధికార భాషయని దానికి ఇటీవలే ప్రాచీనభాషా హోదా దక్కిందని చెప్పుకుంటున్నాం. హక్కుల కమీషన్ కూడా 2005 లో భాషా సంస్కృతుల పరిరక్షణకై స్పష్టమైన తీర్పునిచ్చింది. తెలుగు అధికార భాష అని ఎన్నో ఉత్తర్వులున్నాయి. ప్రభుత్వ చట్టాలు, ప్రజల ఆత్మాభిమానానికి విరుద్ధంగా కడప జిల్లా **మైదుకూరు**లో తెలుగుభాషను అవమానపర్చడం జరిగింది. ఇది తెలుగు ప్రజలను తీవ్రంగా కలతపర్చింది.

ఈ పైశాచిక కృత్యం సర్వ సభ్యసమాజానికే కాదు, ప్రపంచ మానవాళికే సిగ్గుచేటు. పిల్లలు బడిలో అడుగుపెట్టగానే చిలుకలు కారు, మనం చెప్పిన రెండక్షరాలను వల్లెవేసే జీవులు కాదు. పిల్లలు మన మాదిరిగానే ఆలోచించే మనుషులు. మనలాగా భావం వ్యక్తంచేసే భావుకత ఉన్న సృజనశీలురు. వారు నూతన సమాజ సృష్టికర్తలు.

మనిషికి కక్కొచ్చినా,ఆగదు, భావమొచ్చినా ఆగదు, కక్కేటప్పుడైనా, భావాలను వెలిబుచ్చేటప్పుడైనా, చమత్కరించేటపుడైనా తన చుట్టు పక్కల ప్రకృతిని పోల్చుకుని, తన స్థానికత నుంచి మాట్లాడతాడు. ఇప్పటికీ నా వరకు నేను చమత్కరించేటప్పుడు వచ్చీరాని తెలుగు భాషలోనే చెబుతాను. హైద్రాబాద్‌లో రోడ్డుపై తిరుగుతుంటే ఇలాంటి చమత్కారాలు, ముచ్చట్లు ఎన్నో కనబడతాయి. అదే విధంగా పిల్లలు తన కొచ్చినటువంటి భావనను తోటి పిల్లలతో చెప్పుకోవడానికి మాతృభాషనే సాధనంగా చేసుకుంటారు. ప్రపంచంలోని సామాజిక వేత్తలందరూ దీన్ని అంగీకరిస్తారు. మాతృభాషను ఆదరించమని పదేపదే చెబుతున్నారు. మాతృభాషను ఒక హక్కుగా గుర్తిస్తారు.

కానీ మన పాఠశాలలు తెలుగు మాట్లాడితేనే ఆ ప్రపంచ బ్యాంకు ఇచ్చిన వరాలు ఎక్కడ రాలిపోతాయని కాబోలు ప్రభుత్వం గజగజలాడుతున్నది. అటు యాజమాన్యాలు తెలుగులో రెండక్షరాలనగానే తను నేర్పిన చదువు ఎక్కడ కలుషితమౌతుందోనని భయపడుతున్నది. ఇది అమెరికాలో కాదు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నది. అమెరికాలో నా విద్యార్థులు ఎంతో ముచ్చటగా తెలుగులో మాట్లాడారు. తమ ఇంటి భాషలోనే మనసు విప్పి మాట్లాడారు. తెలుగులో మాట్లాడడమే కాదు మేము మీరు వచ్చాక చాలా కాలం తర్వాత హాయిగా మీతో తెలుగులో మాట్లాడుతున్నామని సంతోష పడ్డారు. తమిళులతో పోటీ పడి ఆంధ్రరాష్ట్రం సాధించుకున్నాము. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారు. తెలుగు పేరుమీద పాఠాలను ఏర్పాటు చేసుకున్నాము. ఆ పీఠాల పేర్లు చెప్పుకొని మన వాళ్ళు వెలిగిపోయారు. ఇదే తెలుగు వైభవమని చూపించారు. చివరకు పసిపిల్లలు తెలుగు రెండక్షరాలు మాట్లాడితే ప్రపంచమంతా కూడా నేరమని చాటే ధైర్యం తెచ్చుకున్నట్లయింది.

ఈ ధైర్యం వెనుక ఓ రాజకీయ శక్తి ఉన్నది. తమ విధేయత చూపించి ఊహించని మేడలు ఎక్కుదామనే ఆశలు పెరిగాయి. ఇలా ప్రవర్తించినందుకు తల్లిదండ్రులు, మొత్తం సమాజం ఎర్ర తివాచీ పరుస్తుందని ఊహించారు. కానీ ప్రజల్లో ఇంకా తమ మాతృభాష పైన, తల్లి భాషపైన, ఇంటి భాష పైన మమకారం తగ్గలేదని నిరూపించారు. ఊహించని నిరసన వ్యక్తమయింది. ఇపుడు ప్రభుత్వం దిగివచ్చి చర్య తీసుకుంటామంటోంది. వెంటనే సంబంధిత టీచరుపై చర్యలు తీసుకున్నారు.

మన పాలకులు ప్రజల నిరసనలను ఎట్లా చల్లార్చాలోనన్న విషయం బాగా తెలిసిన వాళ్ళు కదా! కానీ ప్రజలు కోరేదది కాదు. కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా తమ నాగరికతను, తమ సంప్రదాయాలను తమ ఆచారాలను, తమ ఇంటి భాషలను బతకనియ్యండని అడుగుతున్నారు. ఇప్పటికే ఎన్నో మాతృభాషలు ఈప్రపంచీకరణలో భాగంగా ప్రపంచ పటం నుంచి కనుమరుగవుతున్నాయి. గత సాంస్కృతిక వైభవాలకు, గత సమాజం అందించిన సాంస్కృతిక సంపదలైన పాటలను, ఆ యాసలను, ఆ భాషలను, ఆ ఊసులను పిల్లల నాలుకలపై సజీవంగా ఉండనిచ్చే అవకాశం తోనే రచయితలు ఎంతోగొప్ప సాహిత్యం సృష్టించారు. 'బండెనుక బండి కట్టి ' పాట రాసిన యాదగిరి విశ్వవిద్యాలయాలలో డిగ్రీలు పొందినవాడు కాదు. తన నోటి పాటలతో ప్రజా ఉద్యమాలకు ఊపిరిపోశాడు. ఊతమిచ్చాడు, తెలుగు భాషను బతికించింది పొలాల్లో నాట్లేసే ఆ తల్లులు . నైజాం రాష్ట్రంలో జనం సంస్కృతిని బతికించారు. ఇపుడు నైజాంను మించిన రాజ్యంలో మా నోటిపై కూడా తాళం వేసే ప్రయత్నం చేయడం ప్రపంచీకరణ సంస్కృతిలో భాగమేమో!

ప్రతి విద్యార్థి తనపక్క వారితో తెలుగులోమాట్లాడడం సహజం. నవంబర్ 1నాడు మేమడిగేది వచ్చే తరానికి మా భాషను, మాజీవన విధానాన్ని నాలుగు కాలాలపాటు ఉండనీయండని. మాకు ప్రాచీన భాష హెూదాకన్న మా సంస్కృతి నాగరికతలు నాలుగు కాలాలపాటు బతకటమే ప్రధానం. గతంపై విర్రవీగే వాళ్ళం కాదు మేం, గతంకన్నా భవిష్యత్తే ప్రధానం. రాజుల దర్పం కన్నా వచ్చీరాని పిల్లల అడుగులు, మాటలే గొప్ప సాహిత్యం. ఇది సెయింట్‌జోసఫ్ స్కూలుకు హెచ్చరిక కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్చరిక. ఏ పీఠం మీద మీరు కూర్చొన్నారో అది వూగిసలాడకుండా చూసుకోండి. గజనీ మహమ్మద్ దెబ్బకన్నా **మైదుకూరు**లో సెయింట్ జోసఫ్‌స్కూల్లో దెబ్బ ఎంతో ప్రమాదకరమైనది. అది సభ్య సమాజాన్ని గాయపరిచింది. గాయాలనుంచి, స్రవించిన రక్తంతోనే అసంతృప్తి జ్వాలలు అంటుకుంటాయని చెప్పవలసినపనిలేదు. ఇది భాషా ఉన్మాదం నుంచి వచ్చినస్వరం కాదు. మానవ హక్కుల కోణం నుంచి పెల్లుబుకుతున్న స్వరం. ఇది రాజ్యాధికారం కోసం మనకు భావ వ్యక్తీకరణ కోసం, భాషా సంస్కృతి పరిరక్షణ కోసం. మనమందరం మన ఇంటి పెరళ్ళలో ఉన్న మన సంస్కృతిని కాపాడుకుందాం!

**–నడుస్తున్న చరిత్ర,** నవంబర్ 2009.

# తెలుగుకు కావలసింది దండలు, దండకాలు కాదు!

**-డా. సామల రమేష్‌బాబు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన 54 ఏళ్ళకు, మరి నాలుగు రోజుల్లో అవతరణ దినోత్సవం జరుగుతుందనగా అక్టోబరు 26న కడప జిల్లా **మైదుకూరు** లో తెలుగు భాషకు జరిగిన అవమానాన్ని సహించని ప్రజలు ఉద్యమించారు. తెలుగు భాషోద్యమ పతాకను చేతబూని, ప్రదర్శనలు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వారికి తోడుగా ప్రముఖ తెలుగు దినపత్రికల విలేకరులు చురుగ్గా వ్యవహరించారు. టీవీ ఛానెళ్ళు పదేపదే ఈ సంఘటనను ప్రచారం చేశాయి. ఫలితంగా రాష్ట్రంలోనూ, బయటా తెలుగువారి గుండెలు ఉద్రేకంతో కొట్టుకున్నాయి. అవమానంతో లబలబలాడాయి. వారిలోని భాషా జాతీయత తలెత్తి నిదురిస్తున్న చైతన్యాన్ని మేల్కొపింది. ఎన్నోచోట్ల తమంతట తాముగా తోచిన రీతిలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. గత దశాబ్దంగా భాషోద్యమం కొద్దికొద్దిగా సాగుతున్న క్రమంలో **మైదుకూరు** ఉదంతం దానికి గొప్ప నైతిక శక్తినిచ్చి దారి చూపింది.

ఆ **మైదుకూరు** ఉదంతం ఏమిటో నడుస్తున్న చరిత్ర పాఠకులకు ఇప్పుడు వివరించవలసిన ఆగత్యం లేదు. వారంతా భాషోద్యమంలో ప్రత్యక్ష, పరోక్ష భాగస్వాములు లేదా సానుభూతిపరులు. **మైదుకూరు**లోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూలు యాజమాన్యపు దుర్మార్గం ఆ రోజు బయటపడింది గాని, నిజానికి అంతకుముందు చాలాకాలంగా జరుగుతున్నదే. ఆ రోజున పిల్లల మెడలో వేసిన అట్టలు చాలా కాలం నుంచి ఇందుకు వాడుతున్నవే. ఇలాంటి శిక్షే కాకపోయినా, రకరకాల శిక్షల్ని రాష్ట్రమంతటా ప్రయివేటు యాజమాన్యం క్రింద ఉన్న మిషనరీ, మైనారిటీ ఇంగ్లీషు స్కూళ్ళలోను, వారిని తలదన్నినట్లుగా అన్ని విషయాల్లో ఉండాలని పోటీపడే తక్కిన ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో పిల్లలకూ, కొండొకచో తల్లిదండ్రులకూ విధిస్తూనే ఉన్నారు. జరిమానాలు వేస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని అప్పుడప్పుడూ ప్రభుత్వం దృష్టికి తెస్తున్నా, మంత్రులు అధికారులు ఏ చర్యా తీసుకోవడంలేదు. 2005 మే 2న తెలుగు భాషోద్యమ సమాఖ్య లేఖకు వెంటనే స్పందించినట్లుగా అప్పటి పాఠశాల విద్యా శాఖ మంత్రిణి నేదురుమల్లి రాజ్యలక్ష్మి గారు తమ శాఖ ముఖ్య కార్యదర్శికి ఉత్తర్వులిచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప, తర్వాత ఆచరణ అంటూ ఏమీలేదు. ఆ ఆదేశం (3626/ఎం(ఎస్.ఇఇ)/05 తేదీ 2/5/05) .

ఇంకొక ఘోరం ఏమిటంటే మాతృభాషను ఒక్క అక్షరం నేర్చుకోకపోయినా పాఠశాల విద్యను పూర్తిచేసుకొనిపోగల దుస్థితిని పోగొట్టాలని 2003లో తెలుగు భాషోద్యమ సమాఖ్య గట్టిగా ప్రయత్నించి, ప్రభుత్వాన్ని దారికి తెచ్చి, జి.ఓ.నెం. 86/2003ను సాధించినా, దాని అమలు నత్తనడకన నడిచింది. ఇప్పటికీ పరిస్థితి అస్పష్టమే. ఆ చట్టం ప్రకారం త్రిభాషా సూత్రాన్ని అమలు పరచి తీరాలి. జి.ఓ.ని అమలు చేయని పాఠశాలల గుర్తింపును

రద్దు చేయాలని అందులో స్పష్టంగా ఉంది. తెలుగులో పిల్లలు మాట్లాడితే శిక్షించే విద్యాసంస్థలకు కూడా ఈ శిక్ష విధించాలనే బిల్లును రానున్న శాసనసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టాలి. అది చట్టమై వస్తేనే తెలుగువారి పరువు నిలుస్తుంది. అసలు ఈ **మైదుకూరు** స్కూలులాంటి ఆంగ్లమాధ్యమ పాఠశాలలు 86 జి.ఓ.ను ఆచరణలో పెట్టాయా లేదా అన్నది వెంటనే తెలుసుకోవలసిన అంశం. అమలుచేస్తున్నట్లయితే ఒక పాఠ్య విషయంగా తెలుగును నేర్పుతున్నపుడు ఆభాషలో మాట్లాడుకోవద్దనడమేమిటీ? ఈ చర్యను ఏ చట్టం, ఏ పాలనాసూత్రం సమర్థిస్తుంది? రాజ్యాంగంలోని 350 అధికరణానికి, మానవుల సహజమైన హక్కులకూ **మైదుకూరు** ఉదంతంలాంటివి భంగం కాదా?

గౌరవనీయ మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ఈ విషయంలో వెంటనే స్పందించారు. అందుకు ఆయనకు అభినందనలు. తొలినుండి తెలుగు సాహిత్యంలో ఆసక్తి, అభినివేశం కలిగిన వ్యక్తి అనీ, ఉద్యమాల్లో అనుభవం గడించి వచ్చినారనీ, పట్టుదలగలవారనీ ఆయన నియోజకవర్గంలో ప్రఖ్యాతి ఉంది. 'ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు' అని రాసి ఉన్న అట్టల్ని విద్యార్థుల మెడల్లో పాఠశాల యాజమాన్యం వేసిన సంఘటన తమను కలిచివేసిందని ఆయన ప్రకటించారు. ఈ సంఘటన తెలుగు ప్రజలందరికీ ఆగ్రహం తెప్పించిందని పాఠశాల బోధన ఏ భాషలో ఉన్నప్పటికీ తెలుగను ఒక భాషగా నేర్చుకోవాలన్నదే ప్రభుత్వ విధానమని, ఇంగ్లీష్ మీడియం అయినా, మరో మీడియం అయినా తెలుగును ఒక భాషగా నేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో జి.ఓ.86ను అమలు చేస్తున్నామని ఆయన ప్రభుత్వ విధానాన్ని ప్రస్తావించారు కూడా.

మంత్రిగారికి ఈ విషయంలో పూర్తి అవగాహనతోపాటు, తెలుగు విషయంలో నిబద్ధత ఉన్నందుకు సంతోషం. ఈ విషయమై ఆయన ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారనేది ముఖ్యం. **మైదుకూరు** పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొంటున్నట్లు మంత్రిగారు ప్రకటించారు. కడపజిల్లా విద్యాధికారి బాధ్యతలో ఉన్న ప్రాంతీయ సంచాలకుడు మన్మధరెడ్డి స్వయంగా విచారణకు వెళ్తామని, బాధ్యులెవరో తెలుసుకొని వారిపై చర్యలు తీసుకుంటామని, పాఠశాల గుర్తింపును సైతం రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ సంపాదకీయం వ్రాస్తున్న సమయానికి తెలిసిన తాజా సమాచారం ప్రకారం భారతీయ క్రిమినల్ కోడ్ 355వ సెక్షన్ క్రింద సుమోటోగా యాజమాన్యంపైన, సిబ్బందిపైన కేసులు దాఖలు చేశారు. జన మాధ్యమాలు చేసిన ఫిర్యాదు ననుసరించి ఐ.సి.సి సెక్షన్ క్రింద మీడియాను అడ్డుకున్న కరస్పాండెంట్ ప్రభాకర్, మరి ముగ్గురిపైన కేసును దాఖలు చేశారు. ఈ రెండు నామమాత్రపు జరిమానాతో తప్పించుకోవడానికి వీలున్నవే. అరెస్టయినట్లు నమోదు చేసి అరెస్టు చెయ్యబోరని అభిజ్ఞుల అభిప్రాయం.

నిజంగా ఈవిషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాబోయే శాసనసభ విషయంలో బిల్లును ప్రవేశపెట్టి చట్టంగా తేవాలి. బెయిల్‌కు అవకాశంలేని సెక్షన్ క్రింద అరెస్టు చేసి

తగిన శిక్ష పడేవిధంగా చట్టాన్ని రూపొందించాలి. అయితే ప్రభుత్వాన్నే కొంతవరకు శాసించగల బలమైన వర్గంగా విలసిల్లుతున్న ఈ విద్యాసంస్థలు అందునా మిషనరీ సంస్థలు అలాంటి చట్టాన్ని తేకుండా నిరోధించవా? వాటిని ఎదుర్కొని అడుగు ముందుకు వేయగల శక్తి మన ప్రభుత్వాలకుందా?

ఇదే సమయంలో ప్రభుత్వం తమకు తెలుగంటే ప్రేమ ఉన్నదని, పట్టుదల ఉన్నదని. తెలుగు జనాన్ని నమ్మించడం కోసం కోపంతో ఉన్న తెలుగు ప్రజలను శాంతపరచడం కోసం ఒక తమాషా చేసింది. 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' ను ప్రార్థన గీతంగా ప్రతిరోజూ పాఠశాలల్లో తప్పనిసరిగా పాడాలని ఆ దేశించింది. ఇంతమంచి పనిని తమాషా అని ఎందుకన్నామంటే– ప్రార్థనాగీతం ఇప్పుడే ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అని, తెలుగును అన్ని విధాలా నిర్లక్ష్యం చేసి పాలనలో బోధనలో తల ఎత్తకుండా అణచివేసే విధానాలవంభిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏనాటినుండో తాను పట్టించుకోకుండా ఉన్న ప్రార్థనాగీతం ఉన్నట్లుండి, గుర్తుకు రావడం తమాషా కదూ! కన్నతల్లికి తిండినీ, బట్టలనూ ఇచ్చి అన్ని విధాలుగా గౌరవంగా, ప్రేమగా చూసుకోవడం మాని, చిక్కి శల్యమై దీనంగా చూస్తున్న స్థితిలో ఆమెకు అలంకారాలు, పూజలు చేస్తామంటే, ప్రార్థనాగీతాన్ని ఆలపిస్తామంటే ఎవరు మెచ్చుకొంటారు? తెలుగుజాతిలో భాషాపరమైన, సాంస్కృతిక పరమైన అవగాహనకు సమైక్యతకు కృషి చేయాలన్న ఆలోచనే ఇన్నేళ్ళుగా లేని ప్రభుత్వానికి ఉన్నట్లుండి ఈ శ్రద్ధ ఎందుకు వచ్చినట్లు?! భావోద్రేకాలను దువ్వడం ద్వారా పోతున్న పరువును కాపాడుకొని, పరపతి పెంచుకోవడానికి కదూ! అసలు విషయాన్ని ప్రక్కకు పెట్టి బాధ్యతల్నుంచి తప్పించుకోవడం కోసం ప్రభుత్వ వర్గాలు ఇప్పుడీ తమాషా చేస్తున్నాయని భాషోద్యమకారులు కూడా గట్టిగా అనుమానిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వంపై వత్తిడి తేవడాన్ని లక్ష్యం నెరవేరేదాకా భాషోద్యమకారులు కొనసాగించాలి. ఇదే సమయంలో తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను సాధించే దిశగా కూడా ముఖ్యమంత్రిగారిని ఒప్పించాలి. ప్రభుత్వానికి సంబంధించి సాధించుకోవలసిన అత్యవసర లక్ష్యాలు ఇవే. ప్రజల్లో స్వాభిమానాన్ని, భాషా చైతన్యాన్ని పెంచుతూ ఉద్యమాన్ని పటిష్టం చేస్తూనే, ఈ తక్షణ లక్ష్యాల సాధనకు తొలి ప్రాధ్యానత నివ్వాలి.

**–నడుస్తున్న చరిత్ర మాసపత్రిక,**
నవంబర్ 2009.

# సంపాదకీయాలు

# ఏడాది గడిచినా విశిష్టత ఎక్కడ ?

తెలుగుభాషను విశిష్టభాషగా గుర్తించేందుకు అన్ని శక్తులను ఒడ్డిన రాష్ట్ర ప్రభుత్వం తీరా ప్రాచీన భాషా హెూదా లభించి ఏడాది గడుస్తున్నా ఒక్క దిశగా ఒక్క అడుగు సైతం ముందుకు వేయలేదు. ప్రాచీన భాష హెూదా సాధించిన తర్వాత తెలుగు హోదాను, తెలుగు భాషను కాపాడుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు భాషకు తమిళంతోపాటు విశిష్ట భాషా హెూదా కల్పించాలని ప్రతి పల్లె ప్రతి తెలుగు వాడు చేసిన ఉద్యమాలతో దానిని సాధించుకున్నా అనంతర కార్యక్రమాలపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ అటు కేంద్రప్రభుత్వం కానీ దృష్టి పెట్టలేదు.

తెలుగు భాష ఎంతో ప్రాచీనమైనది, బహుకాలం నాటిదని, చాలా పురాతనమైనదని పోరాడడంతో తెలుగుకు విశిష్టత భాషా హెూదా కల్పించి నేటికి సరిగా ఏడాది గడిచింది. అయితే ఉద్యమాలపై ఉన్న శ్రద్ధ ఇటు ప్రభుత్వానిక గాని అటు తెలుగు భాషాభివృద్ధి సంస్థలకు గాని లేకపోవడంతో తెలుగు భాష స్థిరీకరణకు, విస్తృతికి స్వతస్సిద్ధమైన తెలుగు భాష సొగసు పెంచేందుకు జరిగిన అదనపు కృషి లేకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వంద కోట్ల రూపాయలకోసం ప్రాచీన భాషా ఉద్యమం అనే ఆరోపణలకు రాష్ట్రప్రభుత్వ వైఖరి ఊతం ఇచ్చినట్లయింది.

తెలుగు భాషాభివృద్ధికి ఒక కౌన్సిల్ , ఒక సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌ను ఇక్కడే నెలకొల్పాలని ప్రతిపాదనలు వచ్చినా రాష్ట్రప్రభుత్వం ఇసుమంతైనా ఈ విషయంలో ముందుకు కదలలేదు. తెలుగును కేంద్రప్రభుత్వ పథకం 'భాషామందాకిని' ప్రాజెక్టులో చేర్చాలనే ప్రయత్నం కూడా బెడిసికొట్టింది. తమిళంలోనూ,సంస్కృతంలోనూ చివరికి కన్నడంలోనూ భాషా చిహ్నాలను పరీక్షించేందుకు సైతం గత ఏడాదిలో ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఆముద్రిత తాళపత్ర గ్రంథాలయం వంటి 1,2 సంస్థలు, తెలుగు భాష మూలాలపై వేసిన గ్రంథాలు మినహా ప్రభుత్వం తరపున గాని, ఇటు తెలుగు విశ్వవిద్యాలయం తరపున గత ఏడాదిలో ఎలాంటి ప్రయత్నం జరుగలేదు.

2004 సెప్టెంబర్ 17నే కేంద్రప్రభుత్వం తమిళానికి విశిష్ట భాషాహోదాను ఇచ్చింది. అప్పటికే తెలుగు భాషకు సైతం ఈ హెూదాను కల్పించే వీలు ఉన్నా ఆదిశగా కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా మౌనాన్ని వహించింది. 2005లో సంస్కృత భాషకు ఈ గౌరవం దక్కింది. 2008 నవంబర్1న చివరికి కన్నడానికి, తెలుగుకు ప్రాచీన హోదా లభించింది. ప్రాచీన భాష హెూదా ఇచ్చేందుకు ఉన్న ప్రామాణిక పారమితులను సైతం తెలుగు భాష భర్తీ చేసే పరిస్థితి ఉన్నా అందుకు తగ్గ సాహిత్యం మాత్రం ముద్రణారూపంలో లేకపోవడంతో పారమితులలో స్వల్ప మార్పులు చేసి తెలుగుకు ప్రాచీన హెూదాను

కట్టబెట్టినట్లు కేంద్రం వివరణ ఇచ్చుకొంది.

కేంద్రంతో అవుననిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక మాదిరి దాదాపు ఘర్షణకు దిగక తప్పలేదు. 2006 ఫిబ్రవరి 22నే రాష్ట్ర శాసనసభ తెలుగు భాషకు విశిష్ట హోదా కల్పించాలనే తీర్మాణం చేసింది. ఈ పోరాటాల తర్వాత తెలుగు, కన్నడ భాషలకు మాత్రం గత ఏడాది అక్టోబర్ 1న ప్రాథమికంగా ఆమోదం లభించినా ఈ ఏడాది మే 8వతేదీన కేంద్ర క్యాబినెట్ దీనికి ఆమోదముద్ర వేసింది.

ఈ ఆమోద ముద్ర లభించడానికి ముందే తెలుగు భాషకు విశిష్ట భాష హోదా కల్పించడంపై మద్రాసు హైకోర్టులో ఆర్.గాంధీ అనే న్యాయవాది కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని సవాలుచేశాడు. దీనిపై న్యాయస్థానం నుండి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో రాష్ట్ర అధికార భాషా సంఘం తరపున అప్పటి అధ్యక్షుడు ఎబికె ప్రసాద్ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్‌దాఖలు చేశారు. తర్వాత క్రిష్ణా జిల్లా రచయితల సంఘం మరో రెండు భాషా సంఘాలు కూడా ఈ కేసులలో ఇంప్లీడ్ అయ్యాయి. చివరికి ఆగష్టు 17న మరోమారు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది.

తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించి కేంద్రం ఏర్పాటు చేసిన రాజ్యాంగబద్ధమైన కమిటీ ప్రతిపత్తినే మద్రాసు హైకోర్టులో కేసు వేసిన గాంధీ ప్రశ్నించడంతో రాష్ట్రప్రభుత్వం ఈ అంశాన్ని సుప్రీం కోర్టుకు తీసుకువెళ్లింది. మరోపక్క రాష్ట్ర హైకోర్టుల్లోనూ ఈ అంశంపై ఒక పిటిషన్‌దాఖలు అయింది. ఈ కేసులేవీ ఇంతవరకు కొలిక్కిరాకపోవడం రాష్ట్రప్రభుత్వం నిర్లిప్తతకు ఊతం పలికాయి.

ఈ విషయాన్ని అసెంబ్లీలో సైతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆగష్టు 17న కాంగ్రెస్ సభ్యులు కే. వెంకట నాగేశ్వరరావు ప్రశ్నోత్తర కార్యక్రమంలో అడిగిన ప్రశ్నకు మంత్రి డి.శ్రీధర్‌బాబు సమాధానం చెబుతూ తెలుగు భాషాభివృద్ధికి ముసాయిదా తయారు చేశామని దానిని త్వరలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. అన్ని విశ్వవిద్యాలయాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను తెలుగు భాషాభివృద్ధికి ప్రారంభించే యోచన కూడా ఉందని మంత్రి చెప్పారు.

ప్రాచీన భాష హెూదా లభించడం వల్ల ఏటా 100 కోట్ల రూపాయలను భాషాభివృద్ధికి కేంద్రప్రభుత్వం భరిస్తుంది. తెలుగు క్లాసికల్ లాంగ్వేజ్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ , తెలుగు డెవలప్‌మెంట్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయడానికి వీలు కుదురుతుంది. ఈనిధులను మైసూరులోని 'సెంట్రల్ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్' సంస్థ ఆదేశాలతోనే వెచ్చించాల్సిఉంటుంది. దీనిపైన పరభాషా సంస్థల అజమాయిషి ఉంటుంది. కనుక తెలుగు భాషాభివృద్ధికి ఒక సెంట్రల్‌రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఇక్కడే నెలకొల్పాలని ప్రతిపాదనలు వచ్చినా రాష్ట్రప్రభుత్వం ఇసుమంతైనా ఈ విషయంలో ముందుకు కదలలేదు. ఈ సంస్థ ఏర్పాటైతే తెలుగు భాష ప్రాచీనతకు మూలాలు, మూల సాహిత్యం గుర్తించడం, చేతి వ్రాత ప్రతుల ఆధారాలు, శాసనాలు, సంస్కృతులు, జానపదాలను గుర్తించడం, నన్నయ్య,

పాల్కురికి సోమనాధుని నుండి శ్రీనాథుడు వరకు ప్రబంధ కవులపై, శతకాల రచయితలపై తాజాగా మరోసారి దృష్టి సారించి వాటిని డిజిటల్ రూపంలో ఆడియో, వీడియో రూపంలో కూడా తెచ్చేందుకు వీలు కలుగుతుంది. ఇండోనేషియా, మలేషియా, దక్షిణాఫ్రికా వంటి దేశాలలో తెలుగు భాషా స్వరూపం నిర్మాణంపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరిపేందుకు కూడా వీలు కలుగుతుంది. కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన భాషామందాకిని ప్రాజెక్టులో తెలుగుభాషను చేర్చడం ద్వారా పెద్ద ఎత్తున ప్రచురణలకు, పరిశోధనలకు వీలుకలుగుతుంది.

**– ఆంధ్రభూమి దినపత్రిక,**
**1 నవంబర్, 2009.**

పరిశోధన

# Copper plate inscription older than MacKenzie Kaifiyat found

M.V. SUBRAMANYAM
KURNOOL

A copper plate inscription on the history of the Gandikota fort, dating back to the 16th Century written in Telugu script and chiselled by Vijayanagaram Linganachari, has been discovered by a Mydukur-based history researcher and writer Tavva Obul Reddy.

The inscription is older than MacKenzie's Kaifiyat (manuscript), considered so far as an authoritative document on Gandikota, according to Mr. Obul Reddy. Basing on the inscription, Durvesi Subbadasari of Sri Venkateswara Devasthanam gave details, at Guriginjakona near Kottalapalle village in Jammalamadugu, to Narayana Rao Mutasaddi who wrote the Kaifiyat on Gandikota in 1813.

The inscription is in the possession of Durvesi Sanjammagari Balaiah living in Kottalapalle village in Jammalamadugu, a heir of Durvesi Venkatappa who served the Gandikota kings. The Emperor of Vijayanagara kingdom Sadasivarayalu was referred to as "Veera Sadasiva Maha Kakaraju" in the inscription, the researcher said.



The 16th century copper plate inscription.

**Historical evidence**

Mr. Obul Reddy also compiled historical evidence on Veluri Therappa Naidu, who opposed the Gandikota king Pemmasani Chinna Thimma Naidu for striking rapprochement with Golconda Vazir Mir Jumla during the Gandikota war in 1652 and fled to Mysuru.

The researcher claimed that he gathered evidence that Therappa Naidu had settled down in Bodikadirepalle village in Bagepalli taluk in Karnataka. He was a group leader in Joolapalem village where he protected people from dacoit gangs and died due to backstabbing, but is revered by the local people, Mr. Obul Reddy says. Mittemari Mazara in Bodikadirepalle village has a small Therappa Naidu temple, where people offer prayers and make offerings at the statue during all auspicious occasions. There was evidence that Therappa Naidu's wife immolated herself in "Sati Sahagamanam", he said.

రచయిత, పరిశోధకుడు తవ్వా ఓబుల్‌రెడ్డి గండికోట తామ్ర శాసనాన్ని కనుగొన్న సందర్భంగా "ది హిందూ" దినపత్రిక ప్రచురించిన వార్త (తేది. 05 జూన్ 2017)

# తెలుగుకు అవమానం

తెలుగుభాషకు తెలుగువారి రాష్ట్రంలోనే అవమానాలు అంతకంతకు ఎక్కువవుతున్నాయి. ఇది తెలుగు అభిమానులను మరింతగా నొప్పిస్తున్నది. కడపజిల్లా **మైదుకూరు**లో ఒక పాఠశాలలో తెలుగులో మాట్లాడినందుకు ఇద్దరు చిన్నారులను 'ఇక మీదట తెలుగులో మాట్లాడను' అనే వాక్యం వ్రాయించిన ప్లకార్డులను మెడలో వేలాడదీయించి శిక్షించిన సంఘటన జనం మనస్సులలో నుంచి ఇంకా చెరిగిపోక ముందే రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు కూతవేటు దూరంలోని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లోని పాఠశాలలో కూడా తెలుగులో మాట్లాడినందుకు ఒక విద్యార్థిని ఉపాధ్యాయులురాలు 'డోంటాక్ తెలుగు' అంటూ 300 సార్లు రాసి ఇవ్వవలసిందిగా ఆదేశించిన ఉదంతం భాషాభిమానులకు ఆగ్రహావేశాలు కలిగిస్తున్నాయి. తాను ఇంగ్లీషు పాఠాలు బోధిస్తాను కనుక తన క్లాసులో మాత్రమే తెలుగులో మాట్లాడవద్దని కోరానని ఆ టీచర్ వివరణ ఇచ్చారు. ఇది మరొక వివాదానికి దారి తీసే అవకాశం ఉందని గ్రహించి ఆమె ఈ విధంగా మాట మార్చినట్లు కనిపిస్తున్నది. ఈ రెండు సంఘటనలపై ప్రభుత్వం దర్యాప్తు జరిపిస్తామంటుంది.

అయితే మరీ బాధాకరమైన విషయమేమిటంటే రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలు పాశ్చాత్య మోజులలోపడి తెలుగు తల్లికి మాయని మచ్చ తీసుకురావడం తెలుగు మాధ్యమంలో విద్యార్జన చేసిన వారి కన్నా ఇంగ్లీషు మీడియంలో చదివిన విద్యార్థులకే ఎక్కువగా ఉపాధి అవకాశాలు లభిస్తుండడంతో విద్యా సంస్థలలో ఇంగ్లీషు మీడియంకు బోధనలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి దేశంలోని విద్యాసంస్థలలో అనేక సంవత్సరాల క్రితమే త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టారు. మాతృభాషను, అనుసంధాన భాష ఇంగ్లీషును, జాతీయ అధికార భాష హిందీని లేదా మరొక భారతీయ భాషను పాఠశాలల్లో బోధించాలని అప్పట్లో సూచించారు. ఇతర రాష్ట్రాల సంగతి అలా ఉంచితే ఈ సూత్రాన్ని మన రాష్ట్రంలోని పాఠశాలల్లోనే ఎక్కువగా అమలు పరుస్తున్నారు. కానీ కొన్ని చోట్ల తెలుగుకు ప్రాధాన్యాన్ని క్రమంగా తగ్గిస్తున్నట్లు కనిపిస్తున్నది.

జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహా సభలను తొలిసారి నిర్వహించిన తర్వాత రాష్ట్రంలో అధికార భాషగా తెలుగు వాడకం పెరిగింది. కానీ తెలుగు వారి ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ చిత్ర రంగంనుంచి రాజకీయ రంగంలోనికి దూకి తెలుగుదేశం పార్టీని స్థాపించి ఉధృతంగా ప్రచారం చేసి తొలి ప్రయత్నంలోనే అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు రావడమేకాకుండా తెలుగు భాష కూడా మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఎన్టీఆర్ హయాంలో అన్నిటికీ తెలుగు పేర్లు పెట్టసాగినప్పుడు ఆయన మరీ అతిగా వ్యవహరిస్తున్నారనే మాట వచ్చినా తెలుగు వాడకం స్థాయి పెరిగిందనే మాట నిజం. ఎన్టీఆర్ తర్వాత వచ్చిన అధికారం స్వీకరించిన చంద్రబాబునాయుడు మొదటిహయాంలో

తెలుగువాడకం పరిస్థితి మెరుగ్గానే ఉంది. కాని చంద్రబాబు రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత ఐటీకి ఇతోధిక ప్రాధాన్యం ఇవ్వసాగడంతో తెలుగు వాడకం స్థాయి తగ్గిపోయిన సంగతి ఎవరూ పట్టించుకోలేదు. ఆ తరువాత వై.ఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కూడా పరిస్థితి మెరుగుకాలేదు. ఎవరి హయాంలోనైనా అధికార భాషా సంఘం అనేది కొనసాగుతున్నప్పటికీ అది సూచనలు, సలహాలు ఇవ్వగలదే గాని ఆదేశాలు జారీ చేయలేదు కదా. మన పొరుగు రాష్ట్రాలలో ఆయా మాతృభాషలలోనే అధికార కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి. ఆయా రాష్ట్రాలలో ఇతర భాషల వారు ఉన్నప్పటికి ఏ దరఖాస్తులు పెట్టాలన్నా ఆ రాష్ట్రాల అధికార భాషలలోనే వాటిని స్థానికుల సాయంతో రాయించుకుంటున్నారు. కానీ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, చివరికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాచీన భాషగా గుర్తింపు ఉత్తర్వు తెచ్చుకున్నప్పటికి మనరాష్ట్రంలో రకరకాల కారణాలతో అధికార భాషగా తెలుగు వాడకం విషయంలో అలా జరగడంలేదు.

నిజానికి తెలుగుభాష ఎంతో తియ్యనైనది. సులభంగా అర్థం అవుతుంది. అందుకే ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి ఒక సందర్భంలో 'సుందర తెలుంగు' అని పేర్కొన్నారు. ఏ మాండలికంలో మాట్లాడినా అందులో ఉండే కమ్మదనం ఎంతో గొప్పది. విదేశాలలో ఉన్న ఆంధ్రులు కూడా తమ పిల్లలు తెలుగులో మాట్లాడాలనే ఆశయంతో వారికి తెలుగు నేర్పిస్తున్నారు. పండుగలు వంటి సందర్భాలలో నిర్వహించే కార్యక్రమాలలో తెలుగు వాడకానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ స్వరాష్ట్రంలో అలా చేయడం తప్పుగా కనిపిస్తున్నది. అధికసంఖ్యాక కుటుంబంలో అమ్మా.. నాన్న అనడానికి బదులు మమ్మీ... డాడీ అని లేదా మామి, డాడి అని పిలిపించుకోవడాన్ని ఇష్టపడుతున్నారు. ఆ వ్యామోహంతోనే కాన్వెంట్లలో తమ పిల్లలను చదివిస్తున్నారు. అందుకే తెలుగులో పొరబాటున మాట్లాడినందుకు విద్యాసంస్థల సిబ్బంది తమ పిల్లలను దారుణంగా శిక్షించినా అదేమని తల్లిదండ్రులు వారిని గద్దించలేకపోతున్నారు. మాతృభాషను కించపరిచే విధంగా ఎవరైనా ప్రవర్తించినపుడు ఉద్యమించడం, కళ్ళెర్ర చేయడం వంటివి తెలుగు వారు చేస్తున్నారు. కానీ ఆ తరువాత చల్లబడిపోతున్నారు. అందుకే తెలుగు వారు ఆరంభశూరులనే నిందకు గురవుతున్నారు.

రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని నగరం హైదరాబాద్‌లో కూడా తెలుగు వాడకం తగ్గిపోతున్నది. మెట్రోపాలిటన్ నగరం స్థాయిని హైదరాబాద్ అందుకోవడంతో ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి జనం వస్తుండడంతో తెలుగుకు అంతగా ప్రాధాన్యం లభించడం లేదు. ఇది అతిశయోక్తిగా అనిపించవచ్చు. కానీ నిజం 'హిందీ నై మాలూం స్పీక్ ఇన్ తెలుగు' అనే మాటలు వినిపిస్తుంటాయి. మహరాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలో ఇలా అనే ధైర్యం వారికి ఉండదు. కాని మన దగ్గర మాత్రం ఇది చెల్లుబడి అవుతోంది. తెలుగువారి సహనశీలం వారికి ఇలా అక్కరకు వస్తోంది, ఏమైనా తెలుగు భాషకు ఇటువంటి అవమానాలు జరుగకుండా ఉండడానికి అటు ప్రభుత్వంలోను, ఇటు జనంలో చైతన్యం రావాలి.

**–ఆంధ్రప్రభ దినపత్రిక,** 30 అక్టోబర్2009.

# మా టెల్గు టల్లికీ...

**"సాక్షి"**

తెలుగువాళ్ల గుండెలు తాటాకుల్లా మండుతున్నాయి. తెలుగు మాట్లాడినందుకు క్షమించమంటూ పిల్లవాడి మెడలో పలకకట్టిన **మైదుకూరు** బడిదొరల మీద..ఐ డోంట్ టాక్ తెలుగు అని 300 సార్లు బాలానగర్ బాలుడికి ఇంపోజిషన్ శిక్ష వేసిన ఇంగ్లీషు రాని పంతులమ్మ మీద తెలుగు తల్లి ముద్దు బిడ్డలెందరో సీమటపాకాయల్లా ఎగిరిపడుతున్నారు. బరితెగించిన రెండు స్కూళ్ళకూ గుర్తింపు రద్దు చేయాలని, మళ్ళీ ఇలాంటి దారుణాలు ఇంకెక్కడా జరక్కుండా చూడాలని తెలుగు యోధులెందరో ఎలుగెత్తి ఘోషిస్తున్నారు. తాము తెలుగు వాళ్ళమనే స్పృహ మిగిలిన తెలుగు వాళ్ళు ఏ ఇద్దరూ ఎక్కడ కలిసినా ఇదే చర్చ, ఎక్కడ చూసినా ఇదే రచ్చ. మంచిదే, మడిసన్నాక ఆ మాత్రం భాషాభిమానం ఉండాల్సిందే. ఇంతకీ ఆ పంతుళ్ళు చేసిన మహాపాపమేమిటీ?

ఇక తెలుగులో మాట్లాడను అని బోర్డు రాసి కుర్రాడి మెడలో కట్టినందుకు మనమందరం అగ్గిమీద గుగ్గిలమవడం బాగానే ఉంది. కాని ఎవరూ కట్టకుండానే తమకు తామే అలాంటి బోర్డులు మెడకు కట్టుకుని తిరుగుతున్న మహానుభావులు తెలుగు సమాజంలో ఎందరు లేరు? మొన్నీ మధ్య తెలుగు రాజధానిలో ఏర్పాటైన ఒకానొక సభలో పరాయి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కష్టపడి తెలుగులో మాట్లాడితే..తెలుగు గడ్డమీద పుట్టి తెలుగే మాతృభాషగా చెప్పుకొనే తెలుగు మంత్రులు ఇంగ్లీషులో స్వీకారని పత్రికల్లో చదవలేదా? తెలుగుభాషకు ఉత్తమగతులు కల్పించడానికే ప్రత్యేకంగా అవతారమెత్తిన తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలోనూ తెలుగురాని అతిథులు తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేయగా పుట్టుకతో తెలుగు వారైన పెద్దలు ఆంగ్లంలో శ్రోతలను చావగొట్టిన కబురూ తెలుగు తల్లి కడుపుచల్లగా విన్నాము కదా? అలాంటి ఘరానా శాల్తీల మెడలలోని కనపడని బోర్డులు ఎవరు విప్పిస్తారు? ఐ షల్ స్పీక్ తెలుగు అని వాళ్ళ చేత ఇంపోజిషన్లు ఎవరు రాయిస్తారు? ఇక శాసనాలను చేసి తెలుగు జనజీవితాన్ని శాసిస్తుందనుకునే తెలుగు శాసనసభలో మాన్య సభ్యులూ, మాన్య మంత్రులూ నోరు విప్పితే జాలువారేది వచ్చీరాని ఇంగ్లీషే కదా? బూతులు తిట్టుకోవడం లాంటి ప్రశస్తమైన సందర్భాల్లో తప్ప అచ్చ తెలుగు ముక్క సాధారణంగా వినపడితే ఒట్టుకదా? తెలుగు భాషకు సంబంధించిన తీర్మాణాలు కూడా శుభ్రమైన ఆంగ్లభాషలోనే కదా రూపుదిద్దుకొనేది? సమాజానికి దారి చూపాల్సిన ఇందరిందరు అతిరథులే తెలుగు మాట్లాడడం నామోషిగా భావించేటప్పుడు వారి ఆదర్శాన్నే పుణికిపుచ్చుకున్న పంతుళ్ళు ఊళ్లో పిల్లలకు బుద్ధి చెపితే వారినెందుకు ఆడిపోసుకోవడం?!

మిషనరీ స్కూళ్ళలోనే, ఖరీదైన మరో ప్రైవేటు స్కూళ్లలోనే తెలుగు మాట్లాడడాన్ని నేరంగా పరిగణించి, పనికిమాలిన పనిష్మెంట్లు ఇస్తున్నది తెలుగు మీద కక్షతో కాదు.

వాళ్ళు చేసేది చదువుల వ్యాపారం, మార్కెటు డిమాండ్‌ను బట్టి పోవడమే వారిపని. చదువుల దుకాణాల్లో ఇంగ్లీషునే ఎందుకు నేర్పిస్తున్నారంటే...దాన్ని నేర్పించి తీరాలన్న రూలు ఎక్కడా లేదు కనుక తెలుగును ఎందుకు నేర్పించరంటే దాన్ని నేర్చుకోవాలన్న రూలు ఎక్కడా లేదు కనుక. తెలుగులో ఎందుకు మాట్లాడనివ్వరంటే.. అలా మాట్లాడించకపోవడమే కరక్టని పిల్లల్ని కన్నవాళ్లే వత్తాసునిస్తారు కనుక. మా స్కూల్లో తెలుగు మాట్లాడితే ఫైను వేస్తాం పనిష్మెంటు ఇస్తాం అని చాలా స్కూళ్ళలో పిల్లల్ని నేర్పించు కునేముందే చెబుతారు. 'బాగుంది బాగుంది అలాగే చెయ్యండి' అని చాలామంది అమ్మనాన్నలు సంతోషంగా ఒప్పుకుంటారు. మావాడు హైస్కూలు కొచ్చినా తెలుగు రాయలేడు; చదువలేడు అని ఒప్పుకోవడం చాలా మంది తల్లిదండ్రులకు గొప్ప! వాళ్లూ ఇలాంటి సంకర చదువులతో వంకరలు తిరిగిన వారే కనుక వంటింట్లోనూ ఇంగ్లీషులోనూ మాట్లాడుకుంటారు. అన్నం మానేసి వైట్‌రైసునే తింటుంటారు. ఇపుడు అఘాయిత్యమేదో మొట్టమొదటిసారి వింటున్నట్లు తెగ షాకై పోతున్నామన్న మమ్మీడాడీల్లో ఎంతమంది తమ చిరంజీవులను తెలుగు మాట్లాడనివ్వని స్కూళ్ళకు వెళ్లి దెబ్బలాడుతారరో మనకి తెలియదా?

ఎక్కడో ఊళ్లోని ఏదో బళ్ళో తెలుగులో మాట్లాడినందుకు శిక్షించారని చెవినపడే ఘనత వహించిన సర్కారు వారు చప్పున కదిలి, దర్యాప్తునకు పురమాయించడం ఏడ్చినట్టే ఉంది. తెలుగుగడ్డ మీద తెలుగు విద్యార్థికి తెలుగు అక్షరం ముక్క నేర్వాల్సిన అవసరం లేకుండానే కె.జి.నుంచి పి.జి.దాకా మొత్తం చదువునూ లాగించేందుకు అనువుగా విద్యావిధానాన్ని కష్టపడి రూపొందించిన ప్రభువులు తెలుగును చులకన చేసే స్కూళ్ళమీద ఏ మొగం పెట్టుకుని చర్య తీసుకుంటారు? పొరుగున కర్ణాటక, తమిళనాడు, మహరాష్ట్రల్లో స్థానిక భాషను అది మాతృభాష కాని విద్యార్థులు కూడా విధిగా నేర్వాలన్న నిర్బంధం ఉండగా...మన తెలుగు గడ్డన తెలుగు విద్యార్థులకు కూడా ఒక లాంగ్వేజిగా తెలుగు కంపల్సరి కాదు. తెలుగుకు బదులు అరబిక్‌నో, ఫ్రెంచి భాషనో నేర్చుకున్నా ఏలిన వారికి అభ్యంతరం లేదు. రాష్ట్రంలోని సుమారు పదివేల తెలుగు మీడియం గవర్నమెంటు హైస్కూళ్ళలోను మూడింట రెండు వంతులను తెలుగుకు దూరం చేసి ... ఇంగ్లీషు మోజును రెచ్చగొట్టి తెలుగు బోధనను శాయశక్తులా నిరుత్సాహపరచి, 'సక్సెన్' పేరిట తెలుగుకు గొయ్యి తీసి బొంద పెట్టినపుడు ప్రైవేటు స్కూళ్ళలోనే తెలుగు నిరాదరణ గురించి నోరెత్తే నైతికహక్కు ప్రభుత్వానికి ఎక్కడిది? తెలుగు మీద వల్లమాలిన ప్రేమ వొలకబోసే సర్కారు వారు తెలుగుకు ప్రాచీన ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరయి ఎట్టకేలకు ప్రకటించి నేటికి సరిగా సంవత్సరం అయినా... అందుకు సంబంధించి ప్రభుత్వ పరంగా చేయాల్సిన దానిమీద చిటికెన వేలును కదిలించిన పాపాన పోలేదు. బోధన, పరిపాలన తెలుగులో సజావుగా జరిగేటట్టు చూడడానికి నలభై మూడు ఏళ్ళ కింద సృష్టించిన అధికార భాషా

సంఘానికి కమీషన్ ప్రతిపత్తి ఎంత మొత్తుకున్నా ఈ నాటికీ గతిలేదు. భాషకు గౌరవస్థానం సమకూర్చాల్సిన వ్యవస్థకే గౌరవం లేక, అధికారాల్లేక అభాసుపాలయ్యేటప్పుడు.. కనీసం అధికార భాషాసంఘానికి ఖాళీ అయిన అధ్యక్ష పదవిని భర్తీ చేసేందుకు ఏలినవారికి తీరికలేనప్పుడు తెలుగు భాషకు ప్రైవేటు స్కూళ్ళలో చిన్న చూపు గురించి గింజుకోవడం దండగ.

అడ్డగోలు విధానాలతో, అర్థంలేని నిర్ణయాలతో పనిగట్టుకుని తెలుగు భాషను భ్రష్టు పట్టించిన ప్రభువులు తెలుగుకు పట్టిన తెగులుకు పాఠశాలల్లో మా తెలుగుతల్లిని పాడించడమే పరిష్కారమని చిట్కా వైద్యం కనిపెట్టడం తెలుగు తల్లిపై పరాచికం. దేశంలో మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన అర్ధ శతాబ్దం తరవాతైనా తెలుగుతల్లికి బడిబడిలో మల్లెపూదండ వేయిస్తామంటే మెచ్చుకోవాల్సిందే. ఆ శుభ సంకల్పాన్ని కేవలం సంకల్పంగానే మిగిల్చి,ఉత్తర్వు ఏదీ ఇవ్వకుండా కేవలం డి.ఇ.ఓ లకి నోటిమాటగా చెబితే సరిపోతుందా? డి.ఇ.ఓ.లు పోయి ప్రతి బడిలో పాటను పాడిస్తారా? పాడించము పొమ్మనేవారిపై కేవలం మంత్రిమాటను ఉటంకించే చర్య తీసుకుంటారా? ఐనా తెలుగులో మాట్లాడడం నిషిద్ధమైన పాఠశాలల్లో, తెలుగు పాటను పాడించేందుకు పంతుళ్లు ఎక్కడ దొరుకుతారు? 'మా టెల్గు టల్లికి మల్లె పూదండ' అని ఇంగ్లీషు పంతులమ్మలచే స్టయిలిష్‌గా నేర్పిస్తారా?

**– ఆంధ్రభూమి దినపత్రిక**

వీక్‌పాయింట్, 31 అక్టోబరు 2009.



A.P.P.M. Orders 470,500

**FIRST INFORMATION REPORT**

**ప్రథమ సమాచార నివేదిక**

**(Under Sections 154 & 157 Cr.P.C.)**

1. Dist. Kadapa P.S. mydukur Year 2009 FIR No. 314/09 Date 6.11.2009
   జిల్లా / పోలీసు స్టేషన్ / సంవత్సరము / ప్రథమ సమాచార నెం. / తేది
2. (i) Act IPC Sections 355 IPC
   చట్టం / విభాగాలు
   (ii) Act — Sections —
   చట్టం / విభాగాలు
   (iii) Act — Sections —
   చట్టం / విభాగాలు
   (iv) Other Acts & Sections —
   ఇతర చట్టాలు & విభాగాలు
3. (a) Occurrence of Offence : Day — Date from Prior Date to 27.10.09
   జరిగిన నేరము / దినము / తేది నుండి / తేది వరకు
   Time Period — Time from — Time to —
   సమయ కాలపరిమితి / సమయం నుండి / సమయం వరకు
   (b) Information received at the Police Station : Date 6-11-2009 Time at 11Am
   పోలీసు స్టేషనులో అందిన సమాచారము తేది / సమయం
   (c) General Diary Reference : Entry No (s) — Time at 11 AM
   జనరల్ డైరి నిర్దేశం / నమోదు నెం. / సమయం
4. Type of Information : Written/Oral
   సమాచార విధము / లిఖిత / మౌఖిక
5. Place of Occurrence : (a) Direction and Distance from P.S. East - 1 KM Beat No. I

మైదుకూరు ఆంగ్లమాధ్యమ పాఠశాలపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ

# స్పందనలు,
# అభిప్రాయాలు

## మైదుకూరు ఉద్యమం స్ఫూర్తిదాయకం

**మైదుకూరు** సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల సంఘటన నేపథ్యంలో తెలుగు భాష సంరక్షణ కోసం భాషోద్యమ సంస్థ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, పత్రికలు, ప్రసారసాధనాలు నిర్వహిస్తున్న ఉద్యమం తెలుగు నేలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రముఖ రచయిత సంపాదకుడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అభినందించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన తెలుగు భాష మాట్లాడిన పసిపిల్లలపై సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం శిక్షలు అమలు చేయడం దానిపై నిరసనలు పెల్లుబికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రరూపం దాల్చడాన్ని ప్రసారసాధనాల ద్వారా తెలుసుకున్న ఆయన స్థానిక తెలుగు సాహితీ సంస్కృతిక వేదిక కన్వీనర్ తవ్వా ఓబులరెడ్డికి గురువారం అమెరికానుంచి ఫోను చేసి ఇక్కడి పరిస్థితిని, వివరాలు తెలుసుకున్నారు. ప్రపంచంలో అన్ని జాతుల వారిని, అన్నిభాషల వారిని బానిసలుగా మార్చుకునేందుకు పాశ్చాత్య శక్తులు సామ్రాజ్యవాదులు ఇంగ్లీష్ పెత్తనాన్ని పరివ్యాప్తం చేస్తున్నాయని కేతు విమర్శించారు. తెలుగుభాషను జాతిని పరిరక్షించుకోవడానికి తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**–ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి**

వార్త దినపత్రిక.

## పసిపిల్లల హృదయాల్ని కాటేసి..

అచ్చతెలుగు పదాల ఆకుపచ్చని జానపదం కడప జిల్లా, ఈనాటికీ పల్లె నోళ్ళలోఅడుగుపెడితేచాలా తెలుగుదనం మన గుండెల్ని ఆర్ద్రంగా తాకుతుంది. మనిషి లోలోపలి ఆప్యాయతలు సైతం పొదివి పెట్టుకొన్న తెలుగు మాటలు మనల్ని హృద్యంగా స్పర్శిస్తాయి. అలాంటి జిల్లాలోనే ఇంగ్లీషు విషపురుగు బుసకొట్టి పసిపిల్లల హృదయాల్ని కాటేసి ఈ గడ్డకు చెడ్డపేరు తీసుకు రావడం బాధాకరం.

తెలుగులో మాట్లాడినందుకు శిక్షగా పిల్లల మెడలో వేలాడదీసిన తెలుగు మాట్లాడను అనే బోర్డు, నెనెప్పుడూ అమ్మపాలు తాగను అని రాసినట్లుగా అనిపించి పిల్లలకు కావలసిన విటమిన్లన్నీ డబ్బా పాలలో నింపి ఉండొచ్చు. కానీ తల్లి స్పర్శను ఎక్కన్నించి తేగలరు? తల్లి ఎదలోని ప్రేమనీ, తన్మయీభావాన్ని ఆమె రొమ్ము నించే బిడ్డ పొందగలడు గాని డబ్బా పాలనుంచి కాదు. మాతృభాష కూడా అంతే. మనదైన సంస్క ృతి, సంప్రదాయాలు, అనుబంధాల తడి, ప్రేమతత్వపు ఊట మాతృభాషా పదాల పేటికల్లో అయితేనే తేనె బొట్టులా తొణకిసలాడుతూ ఉండగలవు. మాతృభాషను సంపూర్ణంగా ఒంటబట్టించుకున్న తర్వాతే మరో భాష కోసం వెంపర్లాడాలి. ముందు నడవడం నేర్చుకొంటే గదా– ఏ వాహనాన్నయినా ఎక్కి నడపగలిగేదీ! కొత్త బిక్షగాడు పొద్దెరగడన్నట్లు కొత్తగా వచ్చిన యీ ఇంగ్లీషు పాఠశాలలు తమ వికృత చేష్టలతో మహోన్నతమైన చారిత్రక నేపథ్యం కలిగిన

ఒక ప్రాంతానికి చెరుపుకోలేని మచ్చను రుద్దుతున్నాయి. తాము సృష్టించిన ఒక జుగుప్సాకర దృశ్యం తమను దిగంబరుల్ని చేసి వీధిలో నిలబెట్టిన విషయాన్ని ఇంగ్లీషు పాఠశాలలు కన్ను తెరిచి చూడగలిగాలి.

మైదుకూరు ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చిన్నారులకు ఎదురైన భాషావేదన తెలుగు భాషాభిమానులందరికీ తగిలిన గాయంగా భావిస్తూ ఆ సంఘటనను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.

**–సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి**
**కథా రచయిత.**

## రచయితల తిరుగుబాటు శుభపరిణామం

కడప జిల్లా మైదుకూరులో తెలుగుకు జరిగిన అవమానానికి నిరసనగా రచయితలు ప్రజల సహకారంతో తిరగబడ్డారంటే.. వారికి మద్దతుగా రాష్ట్రం నలుమూలలా తెలుగు ప్రజలు, మేధావులు, రచయితలు ఉద్యమించారంటే ఇందులో నిరంతరంగా తెలుగు భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలచిన మన 'నడుస్తున్న చరిత్ర' పాత్ర ఎంతైనా ఉంది. ఇందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. పత్రిక సంపాదకుడు డా॥సామల రమేష్‌బాబును అభినందిస్తున్నాను. ఈ భాషోద్యమ ఆవిర్భావానికి ఎదుగులకు, 'నడుస్తున్న చరిత్ర' సేవ ఇప్పుడూ అందరి గుర్తింపును పొందుతున్నది. అయితే పత్రిక నిర్వహించవలసిన బాధ్యత ఇప్పుడే మరింతగా పెరిగింది. విశాల జనావళి భాషా సంస్కృతులకు, చైతన్యానికి సంబంధించిన ధీర్ఘకాలిక ఉద్యమంలోనడుస్తున్న చరిత్ర తన పాత్రను మరింత సమర్థంగా నిర్వర్తించగలదని, తెలుగు జాతి నమ్మకాన్ని నిలబెట్టుకుంటుందని మనవి చేస్తూ ఇందుకు అందరి మద్దతును, సహకారాన్ని స్వాగతిస్తున్నాను.

**–ఎస్.పి.వై. రెడ్డి, బి.ఇ,**
'నడుస్తున్న చరిత్ర' పోషకులు.

## తెలుగు భాషకు సముచిత స్థానం

తెలుగు భాషకు సముచిత స్థానం ఇవ్వాలన్నదే నా ఉద్దేశ్యం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖామంత్రిగా పనిచేస్తున్నందు వల్ల నా పై కొన్ని బాధ్యతలున్నాయి. ఎక్కడైనా పాఠశాలల్లో జరిగే తప్పులను గుర్తించి సరిదిద్దాల్సిన బాధ్యత కూడా నా పై ఉంది. అదేవిధంగా కడప జిల్లాలోని **మైదుకూరు**లోని ఓ పాఠశాలలో నేను తెలుగులో మాట్లాడను (ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు) అని వ్రాసిఉన్న బోర్డులను విద్యార్థుల మెడలో పాఠశాల యాజమాన్యం వేసిన సంఘటనను నన్ను కలచివేసింది. తెలుగు ప్రజలందరికీ ఈ సంఘటన ఆగ్రహం తెప్పించింది. అందులో ఎలాంటి తప్పులేదు కూడా. పాఠశాలబోధన ఏ భాషలో ఉన్నప్పటికీ విద్యార్థులు తెలుగు మాట్లాడడం తప్పుకాదు.

మాతృభాషలో మాట్లాడవద్దనడం సముచితం కాదు. పాఠశాలలో ఏ భాషలో బోధన ఉన్నప్పటికి తెలుగును ఒక భాషగా నేర్చుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అందుకే ఇంగ్లీషు మీడియం అయిన మరోభాష మీడియంగా ఉన్నప్పటికి తెలుగును ఒక భాషగా నేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో సిలబస్‌లో తెలుగును పొందుపరిచాం. మాతృభాషను నేర్చుకోవడం మాట్లాడడం, తప్పుకాదు. అందుకే నేను తెలుగులోమాట్లాడను అన్న బోర్డులను విద్యార్థుల మెడలో వేసిన కడపజిల్లాలోని పాఠశాల యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకున్నాను. ఈసందర్భంగానే మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయాన్ని అన్ని పాఠశాలల్లో విధిగా పాడాలంటూ ఉత్వర్వులు జారీ చేశాం. తెలుగు ప్రజలను తెలుగు భాషను గౌరవించే విధంగా ఉండే మరో గేయాన్ని రాసి పాడినా ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు.

**–డి. మాణిక్య వరప్రసాదరావు,**

పాఠశాల విద్యాశాఖామంత్రి,

ఆంధ్రభూమి, నవంబర్8, 2009.

## తెలుగు తల్లిగోడు

మనరాష్ట్రంలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో తెలుగులో మాట్లాడడమే నేరమని, మన మాతృభాషకూ రాష్ట్ర భాషకూ అవమానం కలిగించే వ్యవహారం నడస్తున్నది. విద్యార్థులయందు తమ మాతృభాష ప్రాంతీయ భాషయైన తెలుగుయందు ఆదరాన్ని అభిమానాన్ని పెంపొందించు కోవడానికి సదుద్దేశంతో, మన ప్రభుత్వం మా తెలుగు తల్లికి మల్లెపూదండ అన్న గీతాన్ని ప్రతిదినం విద్యార్థులచే పాడించాలనే ఆజ్ఞను ఇచ్చింది. దీనికి సంకేతంగా కనీసం తెలుగు గీతాలాపనతో , అనుదినం విద్యాభ్యాసారంభం చేయండి అన్నది ప్రభుత్వ ఆదేశం. మా తెలుగు తల్లికి తెలంగాణేతర ప్రాంత జనితమనుకొంటే, దాశరథి గారు వ్రాసిన 'భారతీయ వీరులం భరతమాత బిడ్డలం' అన్న గీతంతో విద్యాభ్యాసం ప్రారంభించవచ్చునుకదా? తెలుగు ప్రజలకు మనోత్తేజానిచ్చే మరో గీతం 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' తెలుగు వీరుల, తెలుగునాడుల వైభవాన్ని గుర్తుచేస్తూ తెలుగునందభిరుచిని రేకెత్తించి అభ్యుదయ పథంలో పురోగమించమని ఉద్బోధించే గేయం ఇది. దీనినయినా పాడుకోవచ్చు కదా!

**– త్రిపురనేని హనుమాన్‌చౌదరి,**

ఆంధ్రభూమి దినపత్రిక.

## తెలుగు భాషకు అవమానం బాధాకరం.!

తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అవమానం జరగడం బాధాకరమంటూ సచివాలయం వద్దనున్న తెలుగుతల్లి విగ్రహానికి భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి నల్లు

ఇంద్రసేనారెడ్డి క్షీరాభిషేకం చేశారు. కడప జిల్లా **మైదుకూరు**లో సెయింట్‌జోసఫ్ పాఠశాల్లో 'నేను ఎప్పుడు తెలుగులో మాట్లాడను' అంటూ ఇద్దరి విద్యార్థుల మెడలకు పలకలను వ్రేలాడదీసిన సంఘటనపై తమ పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు.

**మైదుకూరు**లో జరిగిన ఈ సంఘటన నిరసనగానే తాము తెలుగు తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి, ఆ తల్లిని క్షమాపణ కోరుతున్నామని ఆయన చెప్పారు. బుధవారం తెలుగు తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా వాడుకలో ఉన్న ఆంగ్లభాషను పిల్లలకు నేర్పించాలనే తపనతోనే కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు, కాన్వెంట్‌లు తెలుగుభాషను అణగద్రొక్కే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.

**మైదుకూరు** సంఘటనలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన మన తెలుగు భాషను తగిన విధంగా గుర్తించడంలోనూ, వృద్ధి చేయడంలోనూ ప్రభుత్వ పరంగా లోపం ఉంది. కాబట్టే తెలుగు భాషకు అవమానం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్‌లో తెలుగు భాష వివక్షత, అవమానాలకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

**–నల్లు ఇంద్రసేనారెడ్డి**, జాతీయ కార్యదర్శి,
భారతీయ జనతా పార్టీ,
ఆంధ్రప్రభ దినపత్రిక, 29 అక్టోబరు 2009.

## మైదుకూరు ఘటన తేల్చకపోతే..

**మైదుకూరు** సెయింట్ జోసఫ్ పాఠశాలపై ఈనెల14లోగా చర్యలు తీసుకోలేకపోతే అదే రోజు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన చేపడతాం. **మైదుకూరు** ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమై మీడియా కోడై కూస్తే అధికారులు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదు. శిక్షణలేని ఉపాధ్యాయురాలిని తొలగించడం చూస్తే పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఉంది. పాఠశాల గుర్తింపును రద్దుచేయ్యాలి. మాతృభాషా ద్రోహులుగా భావించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. లేదంటే కౌన్సిల్‌లో ఈ అంశాల్ని లేవనెత్తుతాం.

**–పోచంరెడ్డి సుబ్బారెడ్డి,**
శాసనమండలి సభ్యులు,
ఈనాడు దినపత్రిక.

## అమ్మ భాషకు అవమానాలు ఇంకానా..?

ప్రజాస్వామ్యంలో పాలన పారదర్శకంగా ఉండాలి. కాబట్టి పాలనా వ్యవహారాలు ప్రజల భాషలోజరుగడం ప్రాథమిక ధర్మం. కానీ దేశానికి స్వాతంత్ర్యంవచ్చి ఆరు దశాబ్దాలు గడచినా మాతృభాషలో పాలన జరగాలని మన ప్రభుత్వాలు చట్టాలు చేసినా తెలుగుకు మాత్రం అధికార హెూదాకు దక్కడంలేదు. చర్విత చరణమే అయిన కొన్ని విషయాలు గుర్తుచేయక తప్పదు.

దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం. ఈ చారిత్రక సన్నివేశానికి 53 సంవత్సరాలు. మే 14, 1966 న తెలుగుకు అధికార భాష హోదా కల్పిస్తూ చట్టంచేశారు. కానీ ఇప్పటి వరకు ఇది అమలుకు నోచుకోలేదు. 2008లో తెలుగుకు ప్రాచీన భాష హెూదా దక్కింది. అయినా తెలుగు ప్రాంతంలో తెలుగుకు కనీస మర్యాద కూడా దక్కడంలేదు. తెలుగు మాట్లాడినందుకు పిల్లలను దండిస్తున్న పాఠశాలలు ఇబ్బడిముబ్బడిగా పరడి విల్లుతున్నాయి. ఆఖరికి విశ్వవిద్యాలయాలలో కూడా తెలుగు తుడిచి పెట్టుకుపోతోంది. ఇన్ని జరుగుతున్నా రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తున్నది. తెలుగు ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఈ రీతిగా వ్యవహరించడం .. ఇదే వైఖరి కొన్ని శతాబ్దాలుగా సాగడం విచారకరం. తెలుగునాట చాలామంది తల్లిదండ్రులు పిల్లలను ఇంగ్లీష్ మాధ్యమం వైపు మళ్ళిస్తున్నారంటే అందుకు ఇవాళ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే కారణం. అధికార వ్యవహారాలలో ఉద్యోగాలలో ఈ భాషకు తగిన స్థానంలేదు. కాబట్టి ఒకరకమైన బతుకు భయంతో తల్లిదండ్రులు ఇందుకు సాహసిస్తున్నారు. అయినా మాతృభాష పరిరక్షణలో వారి పాత్ర ముఖ్యంగా మాతృమూర్తుల పాత్ర ఎంతో ఉంది. ఇది మరచి పోరాదు. తెలుగుకు కేంద్రం విశిష్ట హెూదా ఇచ్చినా రాష్ట్రప్రభుత్వం తీసుకురావాల్సిన విషయంలో వెనుకబడి ఉందని చెప్పక తప్పదు. ప్రాచీన హెూదా లభించి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంలో అయిన ముఖ్యమంత్రి రోశయ్య తెలుగు అమలుకు ప్రత్యేకశాఖను ఏర్పాటుచేసి రాష్ట్రంలో తెలుగు భాషకు వెలుగునిచ్చే పనిని ప్రారంభించడం అవసరం. అలాగే తెలుగుకు ప్రాచీన హోదా ప్రకటనపై మద్రాసు హైకోర్టులో ఉన్న వ్యాజ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అలక్ష్యం వహించడం తగదు. ఆచరణలో తెలుగు భాషను గౌరవించడం అంటే తెలుగులో పాలనా, వ్యవహారాలు నిర్వహించడం సామాన్య తెలుగువాడిని గౌరవించడం. ఈ విషయంలో ఒక సంగతి గుర్తుంచుకోవాలి. ఒక జాతి ఉనికిని ఈ భూమండలంనుంచి చెరిపేయాలంటే ముందు వారి అమ్మ భాషను నిర్మూలించాలి. ఈ పని ఇంగ్లీషు పాలకుల కాలంలో కూడా జరుగలేదు. స్వతంత్ర పాలకులు ఏలుబడిలో జరిగితే అంతకు మించిన ఘోరం మరొకటి ఉండదు.

**– పొన్నాల గౌరి శంకర్**, హైదరాబాద్,
సాక్షి దినపత్రిక.

## ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ విపరీత ధోరణి

కడప జిల్లా **మైదుకూరు**లోని సెయింట్‌జోసఫ్ స్కూల్లో జరిగిన ఓ సంఘటన తెలుగుభాష అభిమానులను, పండితులను, మేధావులను, కవులను, కళాకారులను, రచయితలను తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేసింది. ఎందుకంటే అభం శుభం తెలియని ఇద్దరి చిన్నారి విద్యార్థులు తెలిసి తెలియక ఒకసారి తెలుగుభాషను ఉపయోగించిన పాపానికి ఆ కళాశాల ఉపాధ్యాయురాలు ఆ చిన్నారులు ఏదో నేరం చేసినట్లుగా భావించి ఆపిల్లల మెడకు 'ఐ నెవర్‌స్పీక్ ఇన్ తెలుగు' అనే బోర్డును తగిలించి మరీ వారిని దండించడం అవమానంపాలు చేయడం అనేది రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా సర్వత్రా అనేక విమర్శలకు కారణ భూతమవుతుంది.

అదే విధంగా ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ వ్యవహార శైలి ఈ మధ్యకాలంలో మరింత అదుపు తప్పి వెర్రితలలు వేయడం ఆందోళన కల్గించే విషయం. మరికొన్ని చోట్ల పిల్లలు పొరబాటున తెలుగు పదం ఉచ్చరించినట్లు తెలిస్తే పాఠశాల యాజమాన్యాలు వారినుంచి ఫైన్లు వసూలు చేయడం ఎండలో నిలబెట్టడం వంటి విపరీత చేష్టలకు పూనుకుంటుండటం హాస్యాస్పదమైన లేదా జుగుప్సాకరమైన విషయం. ఇతర రాష్ట్రాలలో అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు వారివారి సొంత భాషలకు ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అసలు ఆయా రాష్ట్ర ప్రజలు వారివారి భాషలను వాడడం ఒక పెద్ద అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు.

అదే మన రాష్ట్ర విషయానికి వచ్చే సరికి ఒక వైపు పిల్లల తల్లిదండ్రులు, మరో వైపు యాజమాన్యాలు ఇంగ్లీషు భాష మత్తులో నిత్యం త్రూలుతూ ఆ భావనే నిరంతరం నామస్మరణం చేస్తూ విష సంస్కృతి కి పాల్పడుతుండడం చాలా సిగ్గు చేటైన, హేయమైన విషయం. మాతృభాషకు అపకారం తలపెడుతున్న వారిపై కఠిన చర్యలకు ఆదేశించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**– బుగ్గన మధుసూదన్‌రెడ్డి,**
బేతంచర్ల, కర్నూలు జిల్లా.

## మచ్చుతెచ్చిన విద్యాసంస్థ

తెలుగు భాషకు వర్ణమాల 56. దీనిని క్రమక్రమాభివృద్ధి చేయక కొందరు ఆంధ్రులు నేడు వర్ణమాల స్థాయినే తగ్గించేస్తున్నారు. ఈ తెలుగు భాష మీ హక్కు కాదా? మీ సొమ్ము కాదా? అమృతంబైన తెలుగు భాషను మరచి ఆంగ్లభాషను మరచి ఆంగ్లభాష అనే పాశ్చాత్య కషాయం మరిగి మాతృభాషా రుచినే మరుస్తున్నారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనం ఇటీవలే కడపజిల్లా **మైదుకూరు** సెయింట్ జోసఫ్ పాఠశాలలో పిల్లలు మెడలో 'ఐ నెవర్ స్పీక్ ఇన్ తెలుగు' అనే ఫలకాన్ని తగిలించడం ఇది ఎంతో బాధాకర విషయం. అక్కడ తెలుగు భాషకు ఇస్తున్న గౌరవం విలువ ఎంతో విదితమవుతుంది. కావున ప్రభుత్వం

ఇటువంటి పాఠశాలలను తక్షణమే రద్దుచేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడవచ్చు. మాతృభాషకు ప్రాచీన హెూదా కల్పించినా ప్రభుత్వ వ్యవహారాలు, ఉత్తర్వులన్నీ తెలుగులోనే జరగాలని సూచించినా ఇంకా అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. ప్రతి ఆంధ్రుడు తెలుగు ఇతర భాషల సరసన తల ఎత్తుకొనేలా నిలబెట్టగలరని ఆశిస్తున్నాను.

**- వరదన్నగారి మునీంద్ర,** గుత్తి,

ఆంధ్రభూమి దినపత్రిక.

## మాతృభాషకు మరణశిక్ష

మేధావులు, రాజకీయ నాయకులు కలిసి మాతృభాషకు మరణశిక్ష విధిస్తున్నారు. అమ్మ ఒడి ఒక మహా విశ్వవిద్యాలయం. ఇతర భాషలను నేర్చవలసిందే. దానికి మాతృభాషను కించపరచి, ఖూనీ చేయనవసరంలేదు. 29.10.2009న వ్రాసిన ఎడిటోరియల్ చదివితే మేధావులు, రాజకీయ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. ఇంగ్లీషుభాష కూడా సరస్వతి రూపం. ఎంత చక్కటి విశాల దృక్పథం ఈ ఇంగ్లీషు స్కూళ్ల వల్ల మాతృభాష భారతీయమైన ప్రతి జీవనబంధువు ఆవిరైపోతుంది. మాతృభాషను రక్షించుకోవలసిన ఆగత్యం ప్రతి ఒక్కరిది. ఇంగ్లీషు పాఠశాలల్లో తెలుగు మాట్లాడనివ్వాలి, మాట్లాడవచ్చు, అన్న ఉత్తర్వు ప్రభుత్వం వెంటనే జారీ చేయాలి.

**-ఓలేటి నారాయణశాస్త్రి.** కాకరపర్రు,

ఆంధ్రభూమి దినపత్రిక .

## క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

తెలుగువాడు కాని సర్ సి.పి బ్రౌన్ దొర ఎంతో కృషి చేసి వేమన సాహిత్యాన్ని పద్యాలను మనకు తెలుగులో అందించారు. ఒక ఆంగ్లేయుడు తెలుగు భాషకు, తద్వారా తెలుగు తల్లికి చేసిన సేవ ఎన్నటికీ మరువలేనిది. కానీ తెలుగు వారు గా ఉండి కూడా కొందరు తెలుగు భాషకు చేస్తున్న అవమానం క్షమించరానిది.

కడపజిల్లా **మైదుకూరు**లో సెయింట్‌జోసఫ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జరిగిన సంఘటన చాలా తీవ్రమైనది మరియు ఎటువంటి పరిస్థితుల్లోనూ కూడా క్షమించరానిది. ఆ పాఠశాలయందు పసి పిల్లల మెడలో I Never Speak in Telugu అనే బోర్డులను తగిలించినవారి యొక్క డిగ్రీలను యూనివర్సిటీ అధికారులు రద్దుచేసి, భవిష్యత్తులో ఎవరు కూడా ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ సంఘటన పాఠశాల యాజమాన్యము వారికి తెలియకుండా జరిగిందని అనుకోకూడదు. ఎందుకంటే ఆ బోర్డులు చాలా పాతవి, చాలా కాలం క్రితమే అటువంటి బోర్డులను చాలా వాటిని తయారుచేసి ఆ పాఠశాలలో తెలుగు మాట్లాడే విద్యార్థులందరికీ అటువంటి శిక్షలు అమలు చేస్తున్నట్లుగా తెలియుచున్నది. కావున ఈ సంఘటనలో పాఠశాల యాజమాన్యము యొక్క పాత్ర చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. కావున ఆ పాఠశాల యొక్క గుర్తింపును ప్రభుత్వం

వారు వెంటనే రద్దుచేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. తద్వారా ఏ ఇతర పాఠశాలలో ఇటువంటి దురదృష్టకరమైన, అవమానకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. **- య్ ం స్ . శ్రీనివాసమూర్తి,**

బద్వేలు, ఆంధ్రభూమి దినపత్రిక.

## ఇంత నీచమా?

ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణదేవరాయలు ఏలిన గడ్డ మీద జరిగిన సంఘటనేనా అది? తెలుగును ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని భావిస్తూ విదేశీయుడైనప్పటికి తెలుగు వెలుగు కోసం అహరహం శ్రమించిన సి.పి. బ్రౌన్ నడయాడిన నేలమీదనేనా ఆ దుర్ఘటన జరిగింది? తెలుగుకు ప్రాచీనభాష హోదా తెచ్చిన స్వర్గీయ డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి సొంతగడ్డమీదనేనా అలాంటి ఆకృత్యం జరిగింది? మైదుకూరులో తెలుగు మాట్లాడిన చిన్నారులను దండించడం ఎక్కడైనా జరుగుతుందా? ఇంకెప్పుడూ తెలుగు మాట్లాడమని రాసి ఉన్నపలకలను మెడలో వేలాడదీస్తారా? వాళ్ళు చేసిన నేరం అంత దారుణమైందా?ఇదేనా మనం తెలుగుకు ఇస్తున్న హోదా? ఇదంతా ఎలా ఉన్నా ఆ చిన్నారుల మనస్సులు ఎంత క్షోభించి ఉంటాయో ఆ పాఠశాల యాజమాన్యం ఊహించిందా? నిజానికి పైకి తెలియకుండా ఇంకా ఇలాంటి నీచపు చర్యలు రాష్ట్రంలో ఎన్ని జరుగుతున్నాయో? ఇప్పటికైనా విశ్వవిద్యాలయాలు కళ్ళు తెరవడం మంచిది. మాతృభాషను అవమానించే నైచ్యానికి పాల్పడకుండా, చిన్నారులను అందుకు బలి చేయకుండా వ్యవహరించడం మంచిది.

**- రామడుగు వెంకటేశ్వర శర్మ,**

గుంటూరు, సాక్షి దినపత్రిక.

## లోపం మనలోనే!

**మైదుకూరు** పాఠశాలలో తెలుగు భాషకు జరిగిన అవమానం, యాజమాన్యంపై చర్యలు తీసుకుకోవడం అంతా వివాదంలో ఒక్క పార్శ్వం మాత్రమే! అసలు విషయానికొస్తే చదువుకున్న తెలుగువారిలోనే మాతృభాషపై మమకారం సన్నగిల్లుతున్న వైనం ప్రమాదకర సంకేతం. ఆంగ్లాన్ని చదవండి కానీ... ఆంగ్లంలోచదవకండి అనే తమిళుల ఒరవడిలోని గొప్పతనాన్ని గ్రహించాల్సిన తరుణమిది.

శాసనసభ నుంచి పాఠశాల వరకు తెలుగు పలుకుబడికి పెద్ద పీట వేయాలి. ప్రసార సాధనాలు సైతం తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాల్సిన సమయమిది. వ్యక్తుల సమూహమే వ్యవస్థ. కాబట్టి మాతృభాష వాడకానికి సంబంధించి తమ నిబద్ధతపై ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తెలుగు వారందరూ మాతృభాషపై మమకారంతో జీవించినప్పుడే జాతికి వెలుగు. **-ఎస్.మల్లేశ్వరరావు,**

హైదరాబాదు, 7 నవంబర్ 2009.

## అధికార భాషా సంఘం మేల్కొనాలి

**మైదుకూరు** ఘటన అభిమానం ఉన్న ప్రతి తెలుగువాడిని కలచివేసింది. ఖైదీలకు మెడలో పలకలు తగిలించినట్లు చిన్నారులకు పలకలు తగిలించి అంత దారుణంగా అవమానించడం, వారి మనసులను గాయపరచడం ఇంకెక్కడైనా జరిగితే ఈ పాటికి పరిణామాలు ఎలా ఉండేవి? పరిస్థితి ఇంత నికృష్టంగా ఉన్నా అధికార భాషా సంఘం తరపున ఎవరూ స్పందించకపోవడం ఏమిటి? తెలుగు భాషా సంఘం అధ్యక్ష పదవి ప్రమాణం స్వీకారం సందర్భంలో మాత్రమే తెలుగు మీద అభిమానం కనిపిస్తూ ఉంటుంది. హిందీకి, ఇంగ్లీషుకు ధీటుగా తెలుగుకు గౌరవం తీసుకువస్తామని రోజూ నేతలు బీరాలు పలుకుతూ ఉంటారు. ఆచరణలో మాత్రం ఏమీ ఉండదు. ప్రభుత్వ ఉత్వర్వులు, ప్రత్యుత్తరాలు, ఫలకాలు అన్నీ తెలుగులో ఉండేటట్లు చేస్తామని అంతా చెబుతారు కానీ జరుగుతున్నదేమిటీ? అంతో ఇంతో అధికారం ఉన్న వ్యవస్థలు కూడా ఇలా పేపరు ప్రకటనలకే పరిమితమయితే ఎలా? మిగతా హామీల సంగతి ఎలా ఉన్నా కనీసం విద్యా సంస్థలలో అయినా తెలుగు భాషకు అవమానం జరుగకుండా చూడడం అధికార భాషా సంఘం కనీస బాధ్యత దీనిని తక్షణమే గుర్తించి చర్యలు చేపట్టాలి.

**– యర్రమోతు ధర్మరాజు,**

ధవళేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా.

## మెడలో పలక పెద్దనేరం

తెలుగు భాష మాట్లాడినందుకు శిక్షగా చిన్నారుల మెడలో పలకలు తగిలించడం తెలుగు జాతికే అవమానం. కడపజిల్లా, **మైదుకూరు**కు చెందిన సెయింట్ జోసఫ్ పాఠశాల చిన్నారుల ఎడల తీవ్రమైన నేరానికి పాల్పడింది. ఇది బుద్ధిలేని చర్య. ఇంతకంటే అవివేకం ఉండదు.

చిన్నారులు నేరం చేసినట్లు ఉపాధ్యాయులు భావిస్తే అందుకు ప్రత్యేకమైన పద్ధతులు ఉంటాయి. ఆ విధంగా మాత్రమే చిన్నారులను తీర్చిదిద్దాలి. అంతేగాని కరుడుగట్టిన నేరస్తులను విచారించే రీతిలో ఇలా ప్రవర్తించడం సరికాదు. దీనిని ఉల్లంఘించడం ద్వారా ఆ పాఠశాల అశాస్త్రీయంగా వ్యవహరించింది.

అంతకు మించి దారుణమైన అప్రజాస్వామిక సంస్కృతిని అవలంభించింది. కాబట్టి ఈ పాఠశాల గుర్తింపును వెంటనేరద్దు చేయాలి. ఇందులో ప్రభుత్వాలకు బాధ్యత లేకపోలేదు. ఏ తరహా పాఠశాలయినా మాతృభాషను బోధించి తీరాలన్న నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. తెలుగు భాషను పరిరక్షించక పోయినా ధ్వంసం చేసే హక్కు ఏ సంస్థకూ లేదు. అలాంటి దుశ్చర్యకు పాల్పడితే ప్రజాసంఘాలు స్పందించవలసిన అవసరం కూడా ఉంటుంది.

**–తుమ్మల రాములు,**

హన్మకొండ, సాక్షి దినపత్రిక.

## ఉదాసీనత తగదు

తెలుగులో మాట్లాడిన ఇద్దరు చిన్నారులను **మైదుకూరు**లోని పాఠశాల యాజమాన్యం విధించిన శిక్ష-రాష్ట్రంలో తెలుగు భాషకు పట్టిన దుర్గతిని సూచిస్తోంది. రాష్ట్రప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదు. ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో రెండో భాషగా తెలుగును తప్పనిసరిగా బోధించాల్సి ఉంది. కానీ అనేక పాఠశాలల్లో అలా జరగడంలేదు. అయినా వాటి గుర్తింపును రద్దు చేయకుండా విద్యాశాఖ అధికారులు ఉదారంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ఆంగ్లమాధ్యమ పాఠశాలల తీరును పర్యవేక్షించాలి. తెలుగును బోధించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి.

**బి. ప్రేమ్‌లాల్,** నిజామాబాద్,
ఈనాడు నవంబర్ 2009.

### తెలుగు భాషోద్యమం




మైదుకూరులో తెలుగు భాషోద్యమ
సమాఖ్య గేయాల సిడిలను, ప్రచార సామాగ్రిని
ఆవిష్కరించినప్పటి దృశ్యం



# తెలుగు అంకెల్ని సమాధి చేస్తారా?

రాష్ట్ర ప్రభుత్వం ఐదవ తరగతి విద్యార్థులకు గత విద్యా సంవత్సరం నుండి కొత్తగా అమలులోకి తెచ్చిన పాఠ్యప్రణాళికలో తెలుగు అంకెలకు సంబంధించిన పాఠ్యాంశాన్ని పూర్తిగా తొలగించడంతో భావితరాల వారికి తెలుగు అంకెలు ఎలా ఉంటాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఐదవ తరగతి విద్యార్థులకు 1994-95 విద్యా సంవత్సరం నుండి 2008-09 విద్యా సంవత్సరం వరకు గణితశాస్త్రంలో తెలుగు అంకెల పరిచయం ఒక అధ్యాయంగా ఉండేది. 2009-10 విద్యా సంవత్సరం నుండి ఐదవ తరగతికి కొత్త పాఠ్య ప్రణాళికను అమలులోకి తెచ్చారు. పాత పాఠ్య ప్రణాళికలో ఉండిన తెలుగు అంకెల విభాగాన్ని పూర్తిగా తొలగించారు. ఈ క్రతువులో తెలుగు అంకెల బలి కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తి చేశారు. పాత పాఠ్యపుస్తకాల స్థానంలో కొత్త పాఠ్య పుస్తకాలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం 2009-10 విద్యా సంవత్సరంలో తనదైన క్రతువును ప్రారంభించింది. 2009-10 విద్యాసంవత్సరంలో 1వ తరగతితో పాటు, 3,5 తరగతుల పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పు చేశారు. ఆ తర్వాతి విద్యా సంవత్సరమైన 2010-11లో 2,4,6వ తరగతుల పాఠ్య పుస్తకాలను మార్పు చేశారు. ఆరవతరగతిలోని 'సంఖ్యామానం' అనే అధ్యాయంలో తెలుగు అంకెలను కనీసం పరిచయ అంశంగానైనా పొందుపరచలేదు. తెలుగు భాషపట్ల, తెలుగు సంస్కృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఈ అనాలోచిత చర్య పరాకాష్టగా చెప్పవచ్చు. పాత పాఠ్య పుస్తకంలో తెలుగు అంకెల పరిచయం ఇలా ఉంది. "తెలుగు భాషకు చెందిన ప్రాచీన గ్రంథాలు తెలుగులోనున్న జ్యోతిష్య శాస్త్ర పత్రికలు మొదలగు వాటిలో మనకు తెలుగు సంజ్ఞ విధానంలో గూడా 10 అంకెలు వాడబడినాయి. స్థాన విలువ పద్ధతి కూడా ఉంది. హిందూ, అరబిక్ విధానంలోని స్థానాల్లో తెలుగు సంజ్ఞ విధానంలో కూడా ఉన్నాయి. కనుక ఆ సంజ్ఞ విధానంలోని సదుపాయాలు, లాభాలు దీనిలో (తెలుగు సంజ్ఞ విధానంలో) కూడా ఉన్నాయి" అని పాఠ్య గ్రంథ రచయితలు తెలుగు అంకెల ప్రాధాన్యతను స్పష్టంగా పేర్కొన్నారు.

పాత పాఠ్య గ్రంథంలోని మొదటి అధ్యాయం పేరు 'సంఖ్యామానం-సంజ్ఞమానం'. ఇందులో తెలుగు అంకెల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు 4వ అభ్యాసాన్ని పొందుపరిచారు. ఈ అభ్యాసంలో రెండు సమస్యల్ని కూడా ఇచ్చారు. అయితే తెలుగు అంకెలపై పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు ఇవ్వరాదని ఒక హెచ్చరికను జారీ చేయడం గమనార్హం.

తెలుగు అంకెలపై పరీక్షల్లో ప్రశ్నలను ఇవ్వకపోవడం బాధాకరం. కాగా రోమన్ అంకెల బోధనకు మాత్రం పెద్ద పీట వేశారు. రోమన్ అంకెల్ని ఆజన్మాంతం మరచిపోకుండా ఉండేందుకు ప్రాజెక్టు పనుల్ని పకడ్బందీగానే పొందుపరిచారు. పాత పాఠ్యాంశం పరిస్థితి అలా ఉంటే కొత్త పాఠ్యాంశంలో తెలుగు అంకెల్ని ఏకంగా సమాధి చేసి రోమన్ అంకెలకు మరొక పేజీని అదనంగా కేటాయించి 'ఇటాలియన్ సంస్కృతి'పట్ల విధేయతను ప్రకటించుకున్నారు. ఈ నిర్వాకాన్ని పునరుద్ఘాటిస్తున్నట్లుగా "రాష్ట్ర ప్రమాణాలకు అనుగుణంగా గణిత పాఠ్య ప్రణాళికను సమీక్షించి" అంటూ కొత్త పాఠ్యపుస్తకానికి రాసిన ముందు మాటలో సంకల్పం చెప్పుకున్నారు. పాత పాఠ్య ప్రణాళికలోని తెలుగు అంకెల పాఠ్యాంశాన్ని ఎందుకు తొలగించాల్సి వచ్చిందో వివరించే ప్రయత్నం మాత్రం చేయలేదు.

"రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణామండలి"లో గణిత విభాగం అధిపతి శ్రీ బ్రహ్మయ్య గారిని 15 రోజుల కిందట తెలుగు అంకెల్ని గణిత పాఠ్య ప్రణాళిక నుండి తొలగించిన విషయమై సంప్రదిస్తే తాను ఇటీవల బాధ్యతలు చేపట్టానని, గతంలో ఈ నిర్ణయం జరిగి ఉండవచ్చునని వివరించారు. తెలుగు అంకెలు వినియోగంలో లేనందువల్ల ఆ పాఠ్యాంశాన్ని తొలగించి, ఉండొచ్చునని, ఏది ఏమయినా ఈ అంశాన్ని తమ మండలిలో పునఃసమీక్షిస్తామని తెలిపారు.

ఎన్.టి. రామారావు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తెలుగు భాషాభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యతను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. తెలుగును అధికార భాషగా అమలు చేసేందుకు ఎన్.టి.ఆర్. పట్టుదల వహించారు. తెలుగు అంకెల పరిరక్షణకు ప్రత్యేక ఉత్తర్వులను కూడా జారీ చేశారు. ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాల నెంబరు ప్లేట్లపై తెలుగు అంకెలతో వాహనాల నెంబర్లను రాయించారు. వావిలాల గోపాలకృష్ణయ్య, నండూరి రామకృష్ణమాచార్య, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎ.బి.కె. ప్రసాద్ వంటి వారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా తెలుగు వికాసానికి ఎంతోకొంత పాటు పడ్డారు. ప్రస్తుతానికొస్తే 2009 మే నెల ఐదవ తేదీతో అధికార భాషా సంఘానికి గడువు తీరిపోయింది. ఇంతవరకు మళ్లీ నియామకం జరుగలేదు.

తెలుగు భాషా సంస్కృతులకు ప్రపంచీకరణ ముప్పు దాపురించిందని మనం గగ్గోలు పెడుతున్నాం. ఆంగ్ల భాష ఆధిపత్యం కారణంగా తెలుగు భాష కనుమరుగైపోతోందని ఆవేదన చెందుతూ ఉద్యమబాట పడుతున్నాం. మన తెలుగు భాషను పరిరక్షించుకొనేందుకు ప్రపంచీకరణ, ఇంగ్లీషు ఆధిపత్యం లాంటి బయటి శక్తులతో అనేక రీతుల్లో పోరాటం చేస్తున్నాం. అయితే మన రాష్ట్ర ప్రభుత్వ తీరు "ఇంట్లోవాడే పెట్టే కంట్లో పుల్ల" అన్నట్లుగా మారిపోయింది. ప్రపంచానికి 'సున్నా'ను అందించింది, ఎంతో విశిష్టమయినది మన భారతీయ సంస్కృతి అని, ఈనాడు ప్రపంచంలో వాడకులో ఉన్న అంకెలు హిందూ అరబిక్ అంకెలని మనకు తెలుసు. భిన్నత్వంలో ఏకత్వం అనే స్ఫూర్తికి అనుగుణంగా భిన్న సంస్కృతులకు ఆలవాలమైన మనదేశంలో అనేక వేష భాషలు, కులమతాలు, ఆచారవ్యవహారాలు ఉన్నాయి. తెలుగు, హిందీ, బెంగాలీ, కన్నడ, మలయాళం, తమిళం, మరాఠి, గుజరాతి, తదితర భాషల్లో ఒక్కో భాషకు ప్రత్యేకమైన నుడికారాలు, సంజ్ఞలూ (అంకెలూ) ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఆ భాషా సంస్కృతులను ఆయా భాషల్లోని ప్రత్యేకతలను వారు కాపాడుకుంటూ వస్తున్నారు. మన రాష్ట్రంలో తెలుగు భాష కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖ లేకపోవడంవల్ల ఇలాంటి సందర్భాల్లో ఎవరికితోచినట్లు వారు నిర్ణయాలు చేస్తున్నారు. తెలుగు విషయంలో ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేనందున ఈ పరిస్థితి నెలకొంది. తెలుగు భాష అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, అధికార భాషా సంఘానికి విశేషాధికారాలను కల్పించి, తెలుగును రాష్ట్రంలో అన్ని స్థాయిల్లోనూ అధికార భాషగా పూర్తిగా అమలు చేయాలని, ఉద్యమకారులు ఎంత కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే పాఠ్య గ్రంథాల విషయంలో గాని, మరేదైనా విషయంలో గానీ తెలుగుకు అన్యాయం జరుక్కుండా జోక్యం చేసుకునేందుకు వీలుండేది. ఇప్పుడు తెలుగు కోసం ఏం కావాలన్నా ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి ఉంది. అధికార భాషా సంఘాన్ని వెంటనే నియమించడం, తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పర్చడం ఇవి తక్షణావసరాలు.

**తవ్వా ఓబుల్ రెడ్డి రాయలసీమ ప్రాంత కార్యదర్శి,**
**తెలుగుభాషోద్యమ సమాఖ్యమొబైల్ నెం: 9440024471**

# తెలుగు అంకెలను సమాధి చేస్తారా?

ఐదవ తరగతి విద్యార్థులకు గత విద్యా సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన గణిత పాఠ్యప్రణాళికలో తెలుగు అంకెలకు సంబంధించిన పాఠ్యాంశాన్ని పూర్తిగా తొలగించడంతో భావితరాల వారికి తెలుగు అంకెలు ఎలా ఉంటాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఐదవ తరగతి విద్యార్థులకు 1994-95 విద్యా సంవత్సరం నుండి 2008-09 విద్యా సంవత్సరం వరకు గణితశాస్త్రంలో తెలుగు అంకెల పరిచయం ఒక అధ్యాయంగా ఉండేది. 2009-10 విద్యా సంవత్సరం నుండి ఐదవ తరగతికి కొత్త పాఠ్య ప్రణాళికను అమలులోకి తెచ్చారు. పాత పాఠ్య ప్రణాళికలో ఉండిన తెలుగు అంకెల విభాగాన్ని పూర్తిగా తొలగించారు. ఈ పనిలో తెలుగు అంకెల బలి కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తి చేశారు. పాత పాఠ్యపుస్తకాల స్థానంలో కొత్త పాఠ్య పుస్తకాలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం 2009-10 విద్యా సంవత్సరంలో తనదైన క్రతువును ప్రారంభించింది. 2009-10 విద్యాసంవత్సరంలో 1వ తరగతితో పాటు, 3,5 తరగతుల పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పు చేశారు. ఆ తర్వాతి విద్యా సంవత్సరమైన 2010-11లో 2,4,6వ తరగతుల పాఠ్య పుస్తకాలను మార్పు చేశారు. ఆరవతరగతిలోని 'సంఖ్యామానం' అనే అధ్యాయంలో తెలుగు అంకెలను కనీసం పరిచయ అంశంగానైనా పొందుపరచలేదు. తెలుగు భాషపట్ల, తెలుగు సంస్కృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఈ అనాలోచిత చర్య పరాకాష్టగా చెప్పవచ్చు. పాత పాఠ్య పుస్తకంలో తెలుగు అంకెల పరిచయం ఇలా ఉంది. "తెలుగు భాషకు చెందిన ప్రాచీన గ్రంథాలు తెలుగులోనున్న జ్యోతిష్య శాస్త్ర పత్రికలు మొదలగు వాటిలో మనకు తెలుగు సంజ్ఞా విధానంలో గూడా 10 అంకెలు వాడబడినాయి.

స్థాన విలువ పద్ధతి కూడా ఉంది. హిందూ, అరబిక్ విధానంలోని స్థానాల్లో తెలుగు సంజ్ఞా విధానంలో కూడా ఉన్నాయి. కనుక ఆ సంజ్ఞావిధానంలోని సదుపాయాలు, లాభాలు దీనిలో (తెలుగు సంజ్ఞా విధానంలో) కూడా ఉన్నాయి" అని పాఠ్య గ్రంథ రచయితలు తెలుగు అంకెల ప్రాధాన్యతను స్పష్టంగా పేర్కొన్నారు.

పాత పాఠ్య గ్రంథంలోని మొదటి అధ్యాయం పేరు ' సంఖ్యామానం–సంజ్ఞామానం'. ఇందులో తెలుగు అంకెల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు 4వ అభ్యాసాన్ని పొందుపరిచారు. ఈ అభ్యాసంలో రెండు సమస్యల్ని కూడా ఇచ్చారు. అయితే తెలుగు అంకెలపై పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు ఇవ్వరాదని ఒక హెచ్చరికను జారీ చేయడం గమనార్హం.

తెలుగు అంకెలపై పరీక్షల్లో ప్రశ్నలను ఇవ్వకపోవడం బాధాకరం. కాగా రోమన్ అంకెల బోధనకు మాత్రం పెద్దపీట వేశారు. రోమన్ అంకెల్ని ఆజన్మాంతం మరచిపోకుండా ఉండేందుకు ప్రాజెక్టు పనుల్ని పకడ్బందీగానే పొందుపరిచారు. పాత పాఠ్యాంశం పరిస్థితి అలా ఉంటే కొత్త పాఠ్యాంశంలో తెలుగు అంకెల్ని ఏకంగా సమాధి చేసి రోమన్ అంకెలకు మరొక పేజీని అదనంగా కేటాయించి 'ఇటాలియన్ సంస్కృతి'పట్ల విధేయతను ప్రకటించుకున్నారు. ఈ నిర్వాకాన్ని పునరుద్ఘాటిస్తున్నట్లుగా "రాష్ట్ర ప్రమాణాలకు అనుగుణంగా గణిత పాఠ్య ప్రణాళికను సమీక్షించి" అంటూ కొత్త పాఠ్యపుస్తకానికి రాసిన ముందు మాటలో సంకల్పం చెప్పుకున్నారు. పాత పాఠ్య ప్రణాళికలోని తెలుగు అంకెల పాఠ్యాంశాన్ని ఎందుకు తొలగించాల్సి వచ్చిందో వివరించే ప్రయత్నం ఎంత మాత్రం చేయలేదు. తెలుగు అంకెల్ని గణిత పాఠ్య ప్రణాళిక నుండి తొలగించిన విషయమై 15 రోజుల కిందట "రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణామండలి"లో గణిత విభాగం అధిపతి శ్రీ బ్రహ్మయ్య గారిని సంప్రదిస్తే తాను ఇటీవల బాధ్యతలు చేపట్టానని, గతంలో ఈ నిర్ణయం జరిగి ఉండవచ్చునని వివరించారు. తెలుగు అంకెలు వినియోగంలో లేనందువల్ల ఆ పాఠ్యాంశాన్ని తొలగించి, ఉండొచ్చునని, ఏది ఏమయినా ఈ అంశాన్ని తమ మండలిలో పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఎన్.టి. రామారావు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తెలుగు భాషాభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యతను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. తెలుగును అధికార భాషగా అమలు చేసేందుకు ఎన్.టి.ఆర్. పట్టుదల వహించారు. తెలుగు అంకెల పరిరక్షణకు ప్రత్యేక ఉత్తర్వులను కూడా జారీ చేశారు. ఆ క్రమంలో ఆర్టీసి బస్సులతోపాటు ఇతర వాహనాల నెంబరు ప్లేట్లపై తెలుగు అంకెలను రాయించారు. వావిలాల గోపాలకృష్ణయ్య, నండూరి రామకృష్ణమాచార్య, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎ.బి.కె. ప్రసాద్ వంటి వారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా తెలుగు వికాసానికి ఎంతోకొంత పాటు పడ్డారు. ప్రస్తుతానికొస్తే 2009 మే నెల ఐదవ తేదీతో అధికార భాషా సంఘానికి గడువు తీరిపోయింది. ఇంతవరకు మళ్లీ నియామకం జరుగలేదు. తెలుగు భాషా సంస్కృతులకు ప్రపంచీకరణ ముప్పు దాపురించిందని మనం గగ్గోలు పెడుతున్నాం.

ఆంగ్ల భాష ఆధిపత్యం కారణంగా తెలుగు భాష కనుమరుగైపోతోందని ఆవేదన చెందుతూ ఉద్యమబాట పడుతున్నాం. తెలుగు భాషను పరిరక్షించుకొనేందుకు ప్రపంచీకరణ, ఇంగ్లీషు ఆధిపత్యం లాంటి బయటి శక్తులతో అనేక రీతుల్లో పోరాటం చేస్తున్నాం. అయితే మన రాష్ట్ర ప్రభుత్వ తీరు "ఇంట్లోవాడే పెట్టే కంట్లో పుల్ల" అన్నట్లుగా మారిపోయింది.

ప్రపంచానికి 'సున్నా'ను అందించిన ఎంతో విశిష్టమయినది మన భారతీయ సంస్కృతి. ఈనాడు ప్రపంచంలో వాడకలో ఉన్న అంకెలు హిందూ అరబిక్ అంకెలని మనకు తెలుసు. భిన్నత్వంలో ఏకత్వం అనే స్ఫూర్తికి అనుగుణంగా భిన్న సంస్కృతులకు ఆలవాలమైన మనదేశంలో అనేక వేషభాషలు, కులమతాలు, ఆచారవ్యవహారాలు ఉన్నాయి. తెలుగు, హిందీ, బెంగాలీ, కన్నడ, మలయాళం, తమిళం, మరాఠీ, గుజరాతీ, తదితర భాషల్లో ప్రతి భాషకు ప్రత్యేకమైన నుడికారాలు, సంజ్ఞలూ (అంకెలూ) ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఆ భాషా సంస్కృతులను ఆయా భాషల్లోని ప్రత్యేకతలను వారు కాపాడుకుంటూ వస్తున్నారు.

మన రాష్ట్రంలో తెలుగు భాష కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖ లేకపోవడంవల్ల ఇలాంటి సందర్భాల్లో ఎవరికితోచినట్లు వారు నిర్ణయాలు చేస్తున్నారు. తెలుగు విషయంలో ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేనందున ఈ పరిస్థితి నెలకొంది. తెలుగు భాష అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, అధికార భాషా సంఘానికి విశేషాధికారాలను కల్పించి, తెలుగును రాష్ట్రంలో అన్ని స్థాయిల్లోనూ అధికార భాషగా పూర్తిగా అమలు చేయాలని, ఉద్యమకారులు ఎంతకోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే పాఠ్య గ్రంథాల విషయంలోగాని, మరేదైనా విషయంలో గానీ తెలుగుకు అన్యాయం జరుగకుండా జోక్యం చేసుకునేందుకు వీలుండేది. ఇప్పుడు తెలుగు కోసం ఏం కావాలన్నా ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి ఉంది.

అధికార భాషా సంఘాన్ని వెంటనే నియమించడం, తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పర్చడం ఇవి తక్షణావసరాలు. విద్యార్థులకు తెలుగు అంకెల పరిచయాన్ని తక్షణమే పునరుద్ధరించాలి.

– తవ్వా ఓబుల్ రెడ్డి
అంధ్రభూమి దినపత్రిక,
19-03-2011

# తెలుగుకు లేనిదేమిటి?

తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయాలని అధికార భాషా సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని నెలల క్రితమే కోరింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి తెలుగు భాషకు ప్రాచీన హెూదా కల్పించాలని కోరుతూ మానవ వనరుల అభివృద్ధి శాఖకు ఒక లేఖ రాయడం ఎంతైనా ముదావహం. తెలుగు భాషకు ప్రాచీన భాషా హెూదా కల్పించాలంటూ చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో అసలు ప్రాచీన హెూదా విషయంలో తమిళ భాషకు ఉన్నదేమిటి? తెలుగు భాషకు లేనిదేమిటి? అనే ప్రశ్నపై చర్చ మొదలయింది. ప్రపంచంలోని ప్రజలు అత్యధిక సంఖ్యలో భాషల వరుస క్రమంలో దాదాపు 15 కోట్లమంది వ్యవహర్తలతో తెలుగు భాష 15వ స్థానంలో ఉంది. ఫ్రాన్స్, బ్రిటన్‌లతో సహా 110 దేశాల కంటే తెలుగునేల సువిశాలమైనది. తెలుగు భాషను జాతీయ భాషగా గుర్తించాలని జె బి ఎస్ హాల్డేన్ వంటి వైజ్ఞానికుడు సూచించడం జరిగింది. కాగా ప్రపంచంలో తెలుగు మాట్లాడేవారి గణాంకాలు ఇలా ఉన్నాయి: 2001 జనాభా గణన ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 7.5 కోట్లమంది, తమిళనాడులో 2.5 కోట్లు, కర్నాటకలో 1.7 కోట్లు, మహరాష్ట్రలో లో 1.5 కోట్లు, ఒరిస్సాలో 80 లక్షల మంది, కేరళ, పుదుచ్చేరి, చత్తీస్‌గఢ్‌లలో 60 లక్షల మంది, ఇంకా దేశంలోని ఇతర ప్రాంతాల్లో పది లక్షల మంది తెలుగువారు నివశిస్తున్నారు. అమెరికా, బ్రిటన్, కెనడా, దక్షిణాఫ్రికా, మారిషస్, ఫిజీ, కువైట్. సౌదీ అరేబియా తదితర దేశాల్లో 3 కోట్లమంది తెలుగువారు ఉన్నట్టు అంచనా. తమిళనాడు జనాభాలో తమిళులు 36 శాతం కాగా తెలుగు వారు 42 శాతం మేరకు ఉన్నట్టు సాక్షాత్తు ఒక తమిళ టీవీ ఛానెల్ తన క్విజ్ కార్యకమంలో ధ్రువీకరించింది. 1920 నుంచి నేటివరకూ తమిళనాడులో 15 మంది ముఖ్యమంత్రులుగా పనిచేయగా వారిలో 12 మంది తెలుగువారు. తమిళనాడుతో సహా ఆంధ్రపదేశ్‌కు వెలుపల ఉన్న తెలుగువారందరూ ఇప్పటికీ తల్లిభాషనే పలుకుతున్నారు. ఒక భాషకు ఎంతో ప్రాచీనత ఉంటేనే, భౌగోళికంగా ఇంత విస్తృతం కావడానికి అవకాశం ఉంటుందని భాషా శాస్త్రవేత్తల నిశ్చాతాభిప్రాయం. మరి ఇంత విస్తృతి గల తెలుగు భాషను పక్కన బెట్టి కేవలం తమిళ భాషకు మాత్రమే ప్రాచీన హెూదా కట్టబెట్టడం శోచనీయం.

దేశంలోని అన్ని భాషలకూ ప్రాతినిధ్యం వహిస్తోన్న కేంద్ర సాహిత్య అకాడమీ, ప్రత్యేకించి ఒక భాషను ప్రాచీన భాషగా ప్రకటించే ఉద్దేశంతో వ్యవహరించినట్లుగా ఈ సందర్భంగా స్పష్టం అయింది. ఒక నోటిఫికేషన్ ద్వారా ఔత్సాహిక భాషా ప్రతినిధుల నుంచి సూచనలు స్వీకరించి ఈ కార్యాన్ని నెరవేర్చివుంటే బాగుండేది. సాహిత్య అకాడమీ నిపుణులు అనబడేవారు రూపొందించిన మార్గదర్శకాలు కేవలం తమిళభాషకు ప్రాచీన హోదా కట్టబెట్టడానికే రూపొందించినట్లుగా ఉన్నాయి. ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య విశ్వనాథం

ఈ అంశాన్ని ధ్రువీకరిచడమే కాక ఆ మార్గదర్శకాలకు సరితూగే అర్హతలు తెలుగు భాషకు నిండుగా ఉన్నాయని తన వాదనలో నిరూపించారు. సాహిత్య అకాడెమీ నిపుణుల మొదటి నిబంధన ప్రకారం 'ప్రాచీన భాషగా గుర్తింపును కోరే భాష, ప్రాచీన సాహిత్య గ్రంథాలను కానీ, వెయ్యి సంవత్సరాల లిఖిత చరిత్రనుకానీ కలిగి ఉండాలి'. క్రీస్తు పూర్వపు ఐతరేయ బ్రాహ్మణం, అశోకుని శాసనాలలో ఆంధ్రుల ప్రస్థావన ఉంది. క్రీస్తుశకం తొలినాళ్ళలోనే రోమన్ చరిత్రకారులు ఆంధ్రుల గురించి రాశారు. క్రీ. శ. ఒకటవ శతాబ్దికి చెందిన అమరావతి స్థూప శిథిలాలలో తొలి తెలుగు పదం 'నాగబు' కనబడింది. ఇదే శతాబ్దానికి చెందిన గుణాఢ్యుని 'బృహత్కథ', హాలుని 'గాథా సప్తశతి'లో అనేక తెలుగు శబ్దాలు ఉన్నాయి. కడప జిల్లా కలమల్ల, ఎర్రగుడిపాడులలో క్రీ. శ. 575 లో రేనాటి చోళరాజులు వేయించిన తొలి తెలుగు గద్య శాసనాలు లభించాయి. తొలి తెలుగు భాషా పోషకుడైన గుణగ విజాయాదిత్యుని సేనాధిపతి పండరంగడు క్రీ. శ. 848 లో అద్దంకిలో వేయించిన శాసనం తొలి తెలుగు పద్యశాసనం గా గుర్తింపబడింది. నన్నయకు ముందుయుగంలోనే దేశీ, సంస్కృత చందస్సులతో కూడిన పద్యశాసనాలు వెలుగులోకి వచ్చాయి. తెలుగుభాషలో వెయ్యి సంవత్సరాలకు ముందే సాహిత్య గ్రంథాలుండేవని, తెలుగుభాషకు రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉందని పలు ఆధారాలతో ఆచార్య విశ్వనాథం నిరూపించారు.

నిపుణుల రెండవ నిబంధన ఇలా ఉంది. 'ఒక తరానికి చెందిన వ్యవహర్తలు విలువైన సాహిత్య పరంపరగా భావించే ప్రాచీన సాహిత్య సంపదను ఆభాష కలిగి ఉండడం'. రామాయణ, భారత, భాగవతాలూ,ప్రబంధాలు,శతకాలూ, యక్షగానాలూ తెలుగులో అమూల్య సాహిత్యసంపదగా ఉండటం వల్ల తెలుగుభాష ఈ నిబంధనకు కావాల్సిన అర్హత కలిగి ఉంది. మూడవ నిబంధన ఏమిటంటే– 'సాహిత్య సంపద ఇతర భాషా సమాజం నుంచి గ్రహించినది కాకూడదు' అని. కవిత్రయం భారతాన్ని స్వతంత్ర కావ్యంగా తీర్చి దిద్దినారేగాని కేవలం అనువాదం చేయలేదుకదా! అలా అనుకున్నా నన్నెచోడుని స్వతంత్రకావ్యం 'కుమార సంభవం' లేదా? శతక సాహిత్యం, అవధాన సంపద తెలుగుభాషకు సంక్రమించిన స్వతంత్ర వారసత్వ సంపద. ఇక నాలుగో నిబంధన– 'ప్రాచీన, అర్వాచీన భాషల మధ్య విచ్ఛిన్నత ఉన్నా అది అనర్హతకాదు'. రాసే భాషకు, మాట్లాడేభాషకు తేడా ఉండవచ్చనేది ఈ నిబంధన సారాంశం. నిపుణులు రూపొందించిన ఈ నాలుగు మార్గ దర్శకాలను సంతృప్తిపరచగలిగే సత్తా తెలుగు భాషకు ఉందని ఈ వివరణ లతో ఆచార్య విశ్వనాథం స్పష్టం చేశారు. కాబట్టి తెలుగు భాష ప్రాచీన హోదా కలిగిఉండాల్సిన అన్ని అర్హతలను కలిగిఉందని స్పష్టం అవుతోంది.

**– తవ్వా ఓబుల్‌రెడ్డి,**

ఆంధ్రజ్యోతి దినపత్రిక, సంపాదకీయ పుట వ్యాసం. 11 ఫిబ్రవరి, 2006.

# మైదుకూరు తెలుగు ఉద్యమం
# ఛాయాచిత్ర మాలిక

# మైదుకూరులో తెలుగు భాషోద్యమ సన్నివేశాలు



ఆంగ్లమాధ్యమ పాఠశాల ఎదుట నిరసన ప్రదర్శన



పాఠశాలపై చర్యకు డిమాండ్ చేస్తున్న తెలుగు భాషోద్యమకారులు



ఉద్యమకారులకు వివరణ ఇస్తున్న ఉపవిద్యాధికారి

## మైదుకూరులో తెలుగు భాషోద్యమ సన్నివేశాలు



మైదుకూరులో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



తెలుగు పతాకం చేబూని నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహంవద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం




ప్రదర్శన నిర్వహిస్తున్న భారతవిద్యార్థి ఫేడరేషన్ విద్యార్థులు



సంఘటనపై నిరసన తెలుపుతున్న వివిధ పాఠశాల విద్యార్థులు




నిరసన తెలుపుతున్న తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధులు

## మైదుకూరులో తెలుగు భాషోద్యమ సన్నివేశాలు



తహశీల్దార్ కార్యాలయం ఎదుట దర్నాలో ప్రసంగిస్తున్న తవ్వా ఓబుల్‌రెడ్డి




పాఠశాల యాజమాన్యపై చర్యకు పోలీసులను డిమాండ్‌చేస్తున్న బిజేపి నేతలు



పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న జిల్లా ఉపవిద్యాశాఖాధికారి

## మైదుకూరులో తెలుగు భాషోద్యమ సన్నివేశాలు



మైదుకూరు ఉద్యమ వివరాలతో వెలువడిన నడుస్తున్న చరిత్ర పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం



పత్రిక ఆవిష్కరణకు హాజరైన తెలుగు భాషాభిమానులు



పత్రిక ఆవిష్కరణకు హాజరైన తెలుగు భాషాభిమానులు



తెలుగు భాషోద్యమ గీతాలను ఆలపిస్తున్న భాషోద్యమ కారులు ఎ.వీరాస్వామి, దర్మిశెట్టి రమణ, టి. మహానందప్ప, యం. వెంకటసుబ్బయ్య



తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలవేస్తున్న కవి లెక్కల వెంకటరెడ్డి




సంఘటనకు నిరసనగా శిక్షణ కార్యక్రమాలు బహిష్కరించిన ఉపాధ్యాయులు



వ్యాసరచన పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న పౌరహక్కుల సంఘం కన్వీనర్ యం.జె. సుబ్బరామిరెడ్డి



తెలుగు సమాజం వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న చరిత్ర పరిశోధకుడు డాక్టర్ అవధానం ఉమామహేశ్వర శాస్త్రి, డాక్టర్ మూలె రామమునిరెడ్డి



మైదుకూరులో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం

## మైదుకూరులో తెలుగు భాషా, సంస్కృతీ వికాస కార్యక్రమాలు



తెలుగు భాషా పరీక్షలకు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు



పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు



శెట్టివారిపల్లె ఉన్నత పాఠశాలలో బహుమతులను అందజేసినప్పటి దృశ్యం

## మైదుకూరులో తెలుగు భాషా, సంస్కృతీ వికాస కార్యక్రమాలు




తెలుగు భాషా ప్రతిభ పరీక్ష నిర్వహణలో పాల్గొన్న తెలుగు సమాజం సభ్యులు, తెలుగు భాషాభిమానులు



మైదుకూరులో నిర్వహించిన "కళాపరిచయం" సంగీత శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు



తెలుగు వికాస కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## మైదుకూరులో తెలుగు భాషా, సంస్కృతీ వికాస కార్యక్రమాలు



మైదుకూరులో తెలుగు భాషాదినోత్సవం (2017) నిర్వహించినప్పటి దృశ్యం




ఉగాది రచనల పోటీలలో బహుమతులను అందజేస్తున్నప్పటి దృశ్యం



అనంతపురం జిల్లా చెన్నేకోత్తపల్లెలోని ప్రకృతి బడి గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న తవ్వా ఓబుల్‌రెడ్డి, యస్. సాదక్, టి.మహానందప్ప తదితరులు







తెలుగు సమాజం ప్రచురించిన పుస్తకాలు



4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కడప కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం




గండికోట గ్రంథానికి ఉత్తమ పర్యాటక రచన అవార్డు అందుకుంటున్న రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి



ఖాజీపేట మం॥, బోసిరెడ్డిపల్లె, పుల్లూరుల వద్ద పరిశోధకుడు తవ్వా ఓబుల్‌రెడ్డి
కనుగొన్న రాష్ట్రంలోనే అతిపెద్ద బుద్ధుని శిలాపాదాలు



ఖాజీపేట మం॥, పుల్లూరు వద్ద కనుగొన్న బుద్ధని శిలాపాదాలు



బుద్ధుని శిలాపాదాలను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు



తిప్పలూరు వద్ద గుర్తించిన విజయనగర కాలంనాటి శాసనం



మైదుకూరు మం॥, యల్లంపల్లె వద్ద కనుగొన్న 15వ శతాబ్దంనాటి సంబెట రాజుల శాసనం



ఖాజీపేట మం॥, ముత్తులూరుపాడులో కనుగొన్న బుక్కరాయలకాలంనాటి శాసనం



జమ్మలమడుగు మం॥, కొట్టాలపల్లెలో తవ్వా ఓబుల్‌రెడ్డి
వెలుగులోకి తెచ్చిన గండికోట తామ్రశాసనం



కర్ణాటకలోని బోడి కదిరేపల్లె వద్ద గండికోట రాజబంధువు
వేలూరి తేరప్పనాయుడి చారిత్రక ఆధారాలను కనుకొన్నప్పటి దృశ్యం



బోడికదిరేపల్లెలో నివశిస్తున్న తేరప్పనాయుడి వంశీకులతో తవ్వా ఓబుల్‌రెడ్డి



తెలుగు భాషోద్యమ సమాఖ్య వరంగల్ మహాసభలకు హాజరైన సందర్భంగా రామప్ప గుడిని సందర్శించిన తవ్వా ఓబుల్‌రెడ్డి, టి. మహానందప్ప



శ్రీకృష్ణదేవరాయల పంచశతాబ్ది ఉత్సవాల సందర్భంగా హంపి సమీపంలోని ఆనెగొందిలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్న మైదుకూరు ప్రతినిధులు




రాజమండ్రిలో జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య సభల సందర్భంగా డాక్టర్ సామల రమేష్‌బాబుతో  మైదుకూరు ప్రతినిధి బృందం

# మైదుకూరు సంఘటనపై ప్రచురితమైన కొన్ని వార్తలు

అభిమానం    గౌరవం    మమకారం

## గళమెత్తిన తెలుగు బిడ్డలు

### మైదుకూరు ఘటనతో విద్యాసంస్థల్లో కలకలం

**కడప నగరం, న్యూస్‌టుడే :** జిల్లాలోని విద్యాసంస్థల్లో మైదుకూరు ఘటన కలకలం రేపుతోంది. ఆంగ్లభాషలో మునిగిన సంస్థలు ఉలికి పాటుకు గురవుతున్నాయి. తెలుగు మాట్లాడితే అపరాధ రుసుం విధించే సంస్థలు.. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నాయి. విద్యార్థులు.. ఉపాధ్యాయులు.. విద్యార్థి సంఘాలు తెలుగు భాషాభిమానులు ఇలా.. ఎక్కడ చూసినా మైదుకూరు సెయింట్ జోసెఫ్ పాఠశాల గురించిన చర్చే జరుగుతోంది. జిల్లా కేంద్రం, మైదుకూరులోనూ విద్యార్థి సంఘాలు ఈ ఉదంతంపై ఆందోళన చేశాయి. పాఠ



మైదుకూరులో పాఠశాల వైఖరిపై నిరసన తెలుపుతున్న ఆందోళనకారులతో చర్చిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి

**మెడలో వేసిన బోర్డు ఏమైనట్లు..?**

---

సెయింట్ జోసెఫ్ పాఠశాల దుశ్చర్యపై....

## పెల్లుబికిన నిరసన



**మైదుకూరు, న్యూస్‌టుడే :** 'నేనెప్పుడూ తెలుగులో మాట్లాడను' అంటూ విద్యార్థుల మెడలో పలకపై రాసికట్టిన మైదుకూరు సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాల తీరుపై మంగళవారం నిరసన పెల్లుబికింది. తెలుగు సాహితీ సాంస్కృతిక వేదిక, భాజపా, సీపీఐ, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ, రైతు సంఘ నాయకులు పాఠశాల యాజమాన్య వైఖరిపై మండిపడ్డారు. పాఠశాల గుర్తింపును రద్దుచేయాలంటూ డిమాండు

---

## సర్వత్రా నిరసన



ఏపీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న విలేకర్లు

స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థులిద్దరూ తెలుగులో మాట్లాడారని అమానుషంగా శిక్షించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ఇంగ్లీషు నేర్పించడానికి ఎవరూ అభ్యంతరం చెప్పరని ఐతే తెలుగులో ఇంకెప్పుడూ మాట్లాడవద్దని బలవంతం చేయడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నించారు. ఈ పాఠశాలలో ఇదే తరహా దండన చాలా రోజులుగా జరుగుతోందని ఆరోపించారు. తెలుగులో మాట్లాడిన విద్యార్థులను అనాగరికంగా దండించిన సెయింట్ జోసెఫ్ పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ నాయకులు ఏపీ.శ్రీనివాసులు, మల్లేశ్వరరెడ్డి, పాలకొండయ్య, స్వామినాథ్, క్రిష్టయ్య, కిరణ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో కోరారు. త్రిభాషా సూత్రాన్ని పాటించని ఇలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తెలుగు భాషపై చులకనగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఏపీటీఎఫ్ నాయకులు అంకన్న, ఎం.వి.భాస్కర్, అహల్యాభాయ్ మరో ప్రకటనలో కోరారు. సంఘటనపై పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

-న్యూస్‌లైన్, మైదుకూరు

# మైదుకూరు సంఘటనపై ప్రచురితమైన కొన్ని వార్తలు

4 వైఎస్ఆర్ జిల్లా

## ప్రపంచీకరణతో మాతృభాషకు ముప్పు

### తెలుగు బాషోద్యమ సమాఖ్య రాయలసీమ కార్యదర్శి తవ్వా ఓబులరెడ్డి

**మైదుకూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :-** ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఆంగ్ల భాషకు ప్రాముఖ్యత ఏర్పడటంతో ప్రపంచంలోని వేలాది ఇతరబాషల ఉనికికి ముప్పు కలిగే పరిస్థితి ఏర్పడిందని తెలుగు బాషోద్యమ రాయలసీమ ప్రాంత కార్యదర్శి తవ్వా ఓబులరెడ్డి ఆందోళనవ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్స వాన్ని పురస్కరించుకొని మైదుకూరులోని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమములో తవ్వా ఓబులరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రజానీకం తమ మాతృబాషలను పరిరక్షించుకోవడానికి ఉద్యమించాల్సి న సమయం ఆసన్నమైందన్నారు. పొరుగురాష్ట్రలలో ప్రజలు, ప్రభుత్వాలు తమ ప్రాంతీయ బాషలకు అన్నిరంగాలలోనూ ప్రాధాన్యత ఇస్తుంటే తెలుగు బాష పరిరక్షణలో తగినంత కృషి జరగలేదని పేర్కొన్నారు. 2012 సంవత్సరం



**కార్యక్రమంలో మాట్లాడుతున్న తవ్వా ఓబులరెడ్డి**

తిరుపతిలో ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన తెలుగు మహాసభలలో చేసిన తీర్మాణాలు కాగితాలకే పరిమిత మయ్యాయని పాఠశాలలో తెలుగు ఒక అంశంగా బోదనలు తప్పనిసరి చేస్తూ జారీ చేసిన 86వ జీవో కార్యరూపం దాల్చలేదని వివరించారు. కె.జి నుండి పీజి వరకూ సాదారణ విద్యనుండి సాంకేతిక విద్య వరకూ బోధనా బాషగా తెలుగు బాషను అమలు చేసేందుకు అవసరమైన ఎా ం · ా ్య ం శ ా ల న ం

రూపొందించుకోవాల్సి న అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గౌరవ అధ్యక్షుడు పి. మహానందప్ప మాట్లాడుతూ తెలుగు బాషా అభివృద్ధి కోసం సి.పి బ్రౌన్‌లాంటి విదేశీయులు అంకిత బావంతో కృషి చేశారని పేర్కొన్నారు. తెలుగు బాషా సమాఖ్య మైదుకూరు శాఖ అద్యక్షుడు వీరాస్వామి మాట్లాడుతూ ఆటలలో పాటలలో ప్రతి సాహిత్యంలో తెలుగు బాషా, తెలుగుదనం మెండుగా ఉందని, రాగయుక్తంగా పాఠలలో వివరించారు. కవి ఎ.కొండారెడ్డి మాట్లాడుతూ తెలుగు విఘాతానికి పాల్పడుతున్న పత్రికల గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ సుందరేషన్ తమ పాఠశాలలో ఆంగ్ల బాషతో పాటు తెలుగు బాషా బోదనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, నాగార్జునరెడ్డి, ఖాజామొద్దిన్, ఒబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష పరిరక్షణకు ఉద్యమించాలి

మైదుకూరు టౌన్: మాతృభాష పరిరక్ష ణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం వుందని తెలుగు భాషో ద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు, కథా రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి పేర్కొ న్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ తో ఆంగ్ల భాష ప్రాముఖ్యత పెరిగి ఎన్నో మాతృభాషలు అంతరించి పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. తిరుప తిలో 2012లో జరిగిన తెలుగు మహాసభల్లో కేజి నుంచి పిజి వరకు తెలుగును అమలు చేయాలని తీర్మా ణిస్తూ ఆమేరకు జారీ చేసిన జివో 86



**తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం**

ఇప్పటికి అమలు కాలేదన్నారు. తెలుగు భాషకు విదేశీయుడైనా సీపీ బ్రౌన్ సేవ చేసినా మన పాలకులు పట్టించుకోవడం లేదని ఆరో పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధులు మహనందప్ప, వీరాస్వామి, పాఠశాల యజమాని సుందరేషన్, ఉపాధ్యా యులు కొండారెడ్డి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకలనకర్త

# తవ్వా ఓబుల్ రెడ్డి పరిచయం

సాహిత్య సృజన, పత్రికా రచన, చరిత్ర పరిశోధన, తెలుగు భాషోద్యమం ప్రవృత్తులుగా తన జీవన గమనాన్ని నిర్దేశించుకున్న రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. కడప జిల్లా, ఖాజీపేట మండలం బక్కాయపల్లెలో రైతు కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు గంగమ్మ, ఓబులరెడ్డి. జీవిత భాగస్వామి పార్వతి. కుమార్తె లక్ష్మీప్రసూన.

### *సాహిత్య సృజన*

గ్రామీణ రైతాంగ జీవన స్థితిగతులపై, రాయలసీమ సాంస్కృతిక జీవనంపై, విద్యావ్యవస్థపై , రాజకీయ పరిస్థితులపై తవ్వా ఓబుల్ రెడ్డి అనేక కథలను రచించారు. ఓబుల్ రెడ్డి రచించిన "ఇనుపగజ్జెల సవ్వడి", "మాయాజాలం" కథలు ఉగాది కథలపోటీలో బహుమతులకు ఎంపికయ్యాయి. కడుపాత్రం, ముంపు, నవవసంతం, ఉచ్చు, కేరింత, సూతకం కథలు విమర్శకుల ప్రశంసలను అందుకున్నాయి. అనేక కథలు వివిధ కథా సంకలనాల్లో మలిముద్రణకు నోచుకున్నాయి. వీరి సంపాదకత్వంలో " కడప కథ, రాయలసీమ వైభవం" "సంగీత పరిచయదీపిక" సంకలనాలు కూడా వెలువడ్డాయి. పత్రికల్లో , రేడియోలో కథలూ, కవితలూ, వ్యాసాలూ ప్రచురితం, ప్రసారం అయ్యాయి.

### *పాఠ్యపుస్తకాల రచన*

తవ్వా ఓబుల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయితగా కూడా వ్యవహరించారు. 2012-13 విద్యా సంవత్సరంలో వెలువడిన 3వ తరగతి ప్రథమ భాష, 6,7 తరగతుల ద్వితీయ భాషా తెలుగు పాఠ్యపుస్తకాల రచయితల బృందంలో ఈయన ఒకరు.

### *చరిత్ర పరిశోధన*

గండికోటపై తవ్వా ఓబుల్ రెడ్డి పరిశోధనాత్మకమైన పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకం రాష్ట్రప్రభుత్వం నుంచి 2013 లో ఉత్తమ రచయిత అవార్డును సాధించడమే కాకుండా మూడు ముద్రణలను పొందింది. కడప జిల్లా పుల్లూరు, వెంకటరామాపురం గ్రామాల సమీపంలో అన్వేషణ జరిపి అతిపెద్ద బుద్ధుని పాద ముద్రికలను వెలుగులోనికి తెచ్చారు. సిద్ధవటం కేంద్రంగా పరిపాలన సాగించిన మట్లి రాజుల కొలువులో వెలుగొందిన ప్రముఖ

కవి కుందవరపు  చౌడప్ప పుల్లూరు వద్ద నివసించినట్లుగా ఆధారాలను వెల్లడించారు. గండికోట చరిత్రకు సంబంధించిన కొట్టాలపల్లె తామ్ర శాసనాన్ని వెలుగులోకి తెచ్చారు. గండికోట రాజ్యంలో ప్రధాన నాయకుడిగా వ్యవహరించిన వేలూరి తేరప్పనాయుడి చారిత్రక ఆనవాళ్ళను కర్నాటక ప్రాంతంలోని బోడికదిరేపల్లి వద్ద కనుగొని గండికోట చరిత్రకు విస్తృతి కల్పించే కృషి చేసారు. ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు వద్ద బుక్కరాయలు కాలంనాటి శాసనాన్ని, మైదుకూరు మండలం ఎల్లంపల్లె వద్ద సంబెట రాజవంశీకుల శాసనాన్ని కనుగొని పురావస్తుశాఖ నుంచి ప్రశంసాపత్రాలను పొందారు.

### *తెలుగు భాషోద్యమం*

కడప జిల్లా మైదుకూరు కేంద్రంగా తెలుగు సమాజం అనే సంస్థ ద్వారా అనేక తెలుగు భాష, సంస్కృతుల వికాస కార్యక్రమాలను తవ్వా ఓబుల్ రెడ్డి నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా, సంస్కృతి అంశాలపై విద్యార్థులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. తెలుగు సమాజం మిత్రులతో కలిసి “కళాపరిచయం”  పేరుతో వేసవిలో సంగీత శిక్షణాశిబిరాన్ని నిర్వహించారు. ఉగాది సందర్భంగా తెలుగు భాష గొప్పదనం విశిష్టతలపై వ్యాసరచన పోటీలను, కథ, కవితల పోటీలను నిర్వహిస్తున్నారు.

### *పత్రికా రచన*

ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల్లో సబ్ ఎడిటర్‌గా, పాత్రికేయుడిగా పనిచేశారు. వ్యవసాయం, సాగునీరు, జీవవైవిధ్యం, గ్రామీణ జీవన స్థితిగతులపై, సామాజిక అంశాలపై అనేక పత్రికల్లో తవ్వా ఓబుల్ రెడ్డి వ్యాసాలను రచిస్తూ ఉంటారు. తన అన్నకుమారుడైన విజయభాస్కర రెడ్డి 2006లో ఏర్పాటు చేసిన www.kadapa.info, www.mydukur.com అంతర్జాల పత్రికలలో కూడా రచనలు చేస్తూ ఉంటారు.

ఉత్తమ పాత్రికేయుడిగా, ఉత్తమ రచయితగా , ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాలను అందుకున్నారు.

***-www.kadapa.info***

***






మైదుకూరు సంఘటన నేపథ్యంలో తెలుగు భాష సంరక్షణ కోసం అక్కడి 'తెలుగు సమాజం' మిత్రులు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు రాజకీయ పక్షాలు, తెలుగు భాషాభిమానులు అందరూ నిర్వహించిన ఉద్యమం చారిత్రాత్మకమైనది. ఆ తర్వాత అక్కడ 'తెలుగు సమాజం' నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలుగు నేలకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయి. ప్రపంచంలోని అన్ని జాతులవారిని అన్ని భాషల వారిని తమ బానిసలుగా మార్చుకునేందుకు పాశ్చాత్య శక్తులు, సామ్రాజ్యవాదులూ ఇంగ్లీషు పెత్తనాన్ని పరివ్యాప్తం చేస్తున్నారు. తెలుగు జాతిని పరిరక్షించుకోవడానికి ఇలాంటి కుటిల యత్నాలను తీవ్రంగా ప్రతిఘటిస్తూనే ఉండాలి. తగిన ప్రణాళికతో తెలుగు భాషను మరింత పటిష్టపరుచుకుంటూనే ఉండాలి.

–ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

ప్రముఖ కథా రచయిత,

కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత.

తెలుగు సమాజం • మైదుకూరు